మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

NAMASTE TELANGANA

సోమవారం MONDAY 16.2.2026 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 10+4 Pages: 10+4 | సంపుటి (Volume): 15 ‖ సంచిక (Issue): 252 ‖ వెల (Price) రూ.6.50

చతుర్దశి

సోమవారం, సూర్యోదయం: 6-42, సూర్యాస్తమయం: 6-18. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం శిశిర రుతువు మాఘ మాసం కృష్ణ పక్షం తిథి: చతుర్దశి సాయంత్రం 5-34 వరకు. నక్షత్రం: శ్రవణం రాత్రి 8-47 వరకు. వర్జ్యం: రాత్రి 12-51 నుంచి రాత్రి 2-29 వరకు. రాహుకాలం: ఉదయం 8-09 నుంచి ఉదయం 9-36 వరకు. దుర్ముహూర్తం: పగలు 12-53 నుంచి పగలు 1-39 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 3-12 నుంచి పగలు 3-58 వరకు. అమృతకాలం: ఉదయం 9-57 నుంచి ఉదయం 11-37 వరకు.



సూపర్ 8

పాక్‌పై భారత్ ఎనిమిదో విజయం

ప్రపంచకప్‌లో అప్రతిహత రికార్డు

ఇషాన్ కిషన్ విజృంభణ › 10

టీమ్‌ఇండియాకు సూపర్-8 బెర్త్



కేసీఆర్ విజన్.. కేటీఆర్ మిషన్..

పుష్కరకాలానికి ముందు ఎట్లుండె తెలంగాణ? ఉపాధిని వెతుక్కుంటూ వలస పోయిన యువత.. జాబ్‌లు రాక రోడ్డెక్కిన నిరుద్యోగులు.. సాఫ్ట్‌వేర్ అంటే బెంగళూరు, పుణె వైపు చూడాల్సిన దుస్థితి.. హైదరాబాద్ అంటే ఆందోళనల అడ్డా అన్నట్టు చిత్రీకరించిన ఆంధ్రా మీడియా! సకల భయాలతో పెట్టుబడులకు ముందుకురాని సంస్థలు! వచ్చినా, పట్టించుకోని ప్రభుత్వాలు! 'పైనాపిల్' బిల్డింగ్ ఒకటి కట్టి.. తెలంగాణ నేదో ఉద్ధరించినట్టు పోజులు కొట్టిన పాలకులు!

రాష్ట్రావిర్భావంతో తెలంగాణ మిషన్ మోడ్‌లోకి మారింది. ఐటీ రంగం కోసం ప్రణాళికలు రచించింది కేసీఆర్ ప్రభుత్వం. సమస్యలను దాటుకుని, రెడ్‌టేపిజాన్ని పక్కకునెట్టి, పాతకాలపు జాడ్యాన్ని పటాపంచలు చేసి పాలసీలను ప్రకటించింది. పెట్టుబడుల ఆకర్షణకు సింగిల్‌విండో విధానాన్ని అమలుపరిచింది.

ఫలితంగా ఐటీ రంగంలో తెలంగాణ రాకెట్‌లా దూసుకుపోయింది. పదేండ్లలో 300 శాతం ఐటీ ఎగుమతులు పెరిగాయి. అన్ని ప్రధాన సంస్థల జీసీసీలు తరలివచ్చాయి. సాఫ్ట్‌వేర్‌రంగపు స్వర్గధామంగా తెలంగాణ మారింది. కేంద్రం తాజా గణాంకాలూ ఐటీ పురోగతిని పునరుద్ఘాటిస్తున్నాయి. కేసీఆర్ విజన్‌కు, కేటీఆర్ మిషన్‌కు, పదేండ్ల ప్రగతికి తార్కాణాలివే!

TELANGANA IT ICON

ఐటీకి ఐకాన్

విప్లవాత్మక పాలసీలతో తెలంగాణను మేటిగా నిలిపిన కేసీఆర్


- బీఆర్ఎస్ పాలనలో ఐటీకి చిరునామాగా నిలిచిన రాష్ట్రం
- హైదరాబాద్‌కు వరుస కట్టిన వందలాది దిగ్గజ కంపెనీలు
- 2023-24లో ఐటీ ఎగుమతుల విలువ 2,72,076 కోట్లు
- 2014 ముందు కాంగ్రెస్ పాలనలో ఇది రూ.57వేల కోట్లే
- పదేండ్ల వ్యవధిలోనే 299 శాతం పెరిగిన ఐటీ ఎగుమతులు
- కేసీఆర్ పాలసీలతో ఇన్వెస్ట్‌మెంట్ క్యాపిటల్‌గా హైదరాబాద్
- 14 ఎన్డీయే రాష్ట్రాల ఐటీ ఎగుమతులు కలిపినా మనమే టాప్
- కేంద్రం విడుదల చేసిన తాజా గణాంకాల ద్వారా సుస్పష్టం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): స్వరాష్ట్ర స్వాప్నికుడు.. ప్రత్యేక రాష్ట్ర సాధకుడు.. తెలంగాణ ప్రగతి ప్రదాత కేసీఆర్ హయాంలో ఐటీ రంగంలో తెలంగాణ కొత్త చరిత్ర లిఖించింది. బీఆర్ఎస్ పదేండ్లపాలనలో అంతర్జాతీయ కంపెనీలకు కేరాఫ్‌గా మారిన హైదరాబాద్.. దేశానికే కొత్త ఐటీ హబ్‌గా అవతరించింది. అప్పటి సీఎం కేసీఆర్ విజన్, నాటి ఐటీ మంత్రి కేటీఆర్ మిషన్‌తో వేలాది ఐటీ కంపెనీలు నగరానికి క్యూకట్టి ఐటీకి తెలంగాణ ఐకాన్‌గా నిలిచింది. ఐటీ ఎగుమతులు పెరిగి లక్షలాది మంది › 2వ పేజీలో

రేపు రాష్ట్రవ్యాప్తంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ శ్రేణులకు తలసాని పిలుపు › 2



బరితెగించిన అధికారం!

మేయర్, చైర్‌పర్సన్ ఎన్నిక వేళ అరాచకం

డబ్బుల ఆశచూపి యథేచ్ఛగా ప్రలోభాలు

హంగ్ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పన్నాగాలు

పోలీస్ అండతో రెచ్చిపోతున్న గూండాలు

బీఆర్ఎస్ క్యాంపుల్లోకి మఫ్టీ పోలీసులు..

భద్రాచలంలో అర్ధరాత్రి భయభ్రాంతులు

దాడికి కాంగ్రెస్ మూకల విఫలయత్నం


రోహిత్‌రెడ్డి ఇంటివద్ద పోలీసుల దౌర్జన్యం

హైదరాబాద్, ఫిబ్రవరి 15(నమస్తేతెలంగాణ): మరికొన్ని గంటల్లో మున్సిపల్, కార్పొరేషన్ చైర్మన్, మేయర్ ఎన్నికల ప్రక్రియ మొదలుకానున్న తరుణంలో అధికార కాంగ్రెస్ పార్టీ బరితెగింపునకు దిగింది. పోలింగ్‌లో యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డట్టు ఆరోపణలు ఎదుర్కొన్న ఆ పార్టీ ఇప్పుడు దొడ్డిదారిన గద్దెనెక్కేందుకు యత్నిస్తున్నది. ముఖ్యంగా హంగ్ ఏర్పడిన చోట్ల అరాచక పర్వానికి తెరలేపింది. అంగ, అర్థ బలాలతో బల్దియాలను కైవసం చేసుకొనేందుకు కుయుక్తులకు దిగుతున్నది. కొందరు పోలీసులు, ఆ పార్టీ గూండాల అండతో › 5వ పేజీలో



రాత్రివేళ తాండూర్ మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఇంటివద్ద తచ్చాడుతున్న పోలీసులు

కాంగ్రెస్, కమలం హగ్గింగ్!



12కుపైగా మున్సిపాలిటీల్లో బీజేపీతో జతకడుతున్న కాంగ్రెస్!

సీఎం రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లో రంగంలోకి దిగిన మంత్రులు

బీజేపీ నేతలతో మంతనాలు!

అటు ఎంఐఎంతోనూ పొత్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): మున్సిపల్ ఎన్నికల్లో హంగ్ ఏర్పడ్డ పలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను ఎలాగైనా హస్తగతం చేసుకోవాలనుకుంటున్న అధికార కాంగ్రెస్ బీజేపీతో పొత్తుకు సిద్ధమైంది. బీఆర్ఎస్‌ను నిలువరించాలని చూస్తున్న సీఎం రేవంత్.. హంగ్ మున్సిపాలిటీలు, బీఆర్ఎస్ గెలుచుకోవడానికి అవకాశం ఉన్న మున్సిపాలిటీలపై › 5వ పేజీలో

నేడు కొలువుదీరనున్న పాలకవర్గాలు

11 గంటలకు సభ్యుల ప్రమాణం.. 12:30కు మేయర్, చైర్‌పర్సన్ల ఎన్నిక

ఆ తర్వాత డిప్యూటీ మేయర్, వైస్ చైర్‌పర్సన్ల ఎన్నిక › 5

కడియం కావ్య డబుల్ ఓటు!

మున్సిపల్ చైర్మన్ కోసం తొండి.. తొర్రూరు మున్సిపాలిటీలో నమోదు

ఏడాది క్రితమే వరంగల్‌లో ప్రమాణం.. ఎన్నికల అధికారికి బీఆర్ఎస్ ఫిర్యాదు

● *ఏరు దాటాక.. 'ఎగవేత' మాట!*

మా ప్రభుత్వం నుంచి సంక్షేమం ఆశించకండి

ప్రభుత్వ పథకాలు, సాయంపై ఆశ పెట్టుకోవద్దు

భూముల కోసం దళిత, గిరిజనులు ఎదురుచూడొద్దు

మీకిచ్చేందుకు ప్రభుత్వం దగ్గర ఎలాంటి భూముల్లేవు

సేవాలాల్ జయంతి వేడుకల్లో తేల్చిచెప్పిన రేవంత్

పురపోరు పూర్తవగానే చేతులెత్తేసేలా వ్యాఖ్యలు



హైదరాబాద్, ఫిబ్రవరి15 (నమస్తే తెలంగాణ) : ఆరు గ్యారెంటీలు, 420 హామీలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులెత్తేశారు. పథకాలపై ఆశ పెట్టుకోవద్దని, సంక్షేమ శకం ముగిసిందని చెప్పారు. ప్రభుత్వం సాయం చేస్తుందని దళిత, గిరిజనులు ఎదురుచూడొద్దని కరాకండిగా తేల్చిచెప్పారు. ఉన్నత చదువులు చదువుకోవాలని, అందుకు ఎంతడిగినా సాయం అందిస్తామని వివరించారు. ఆదివారం ఉదయం బంజారాభవన్‌లో ఏర్పాటుచేసిన సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలకు గిరిజన శాఖ మంత్రి › 7వ పేజీలో

అదృశ్యమైన భారత విద్యార్థి శవమై..

ఆరు రోజుల క్రితం కనిపించకుండాపోయిన సాకేత్ శ్రీనివాసయ్య

అనాజ లేక్ వద్ద మృతదేహం గుర్తింపు › 6

అడ్డదారులు అరాచకాలు

హంగ్ మున్సిపాలిటీల్లో హస్తం కుట్రలు

- పోలీసుల అండతో ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై దౌర్జన్యం
- ఎవరూ కలిసిరాకున్నా సింగరేణి రక్షణకు పోరాటం
- సంస్థ నిర్వీర్యానికి రెండు జాతీయ పార్టీల కుట్రలు
- దోపిడీని అడ్డుకోడానికే సీపీఐతో పొత్తు ప్రతిపాదన
- కాంగ్రెస్‌తో సీపీఐ కలిసివెళ్లడంలో ఆశ్చర్యమేం లేదు
- కేసీఆర్ పదేండ్ల పాలనలోనే గిరిపుత్రులకు న్యాయం
- 4.5 లక్షల ఎకరాల పోడు పట్టాలు.. జీపీలుగా తండాలు
- సేవాలాల్ జయంత్యుత్సవాల్లో కేటీఆర్ స్పష్టీకరణ

మున్సిపల్ పోలింగ్‌లో అధికార కాంగ్రెస్ అక్రమాలకు పాల్పడింది. పోలీసుల అండతో ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై దౌర్జన్యాలకు దిగింది. ఇప్పుడు హంగ్ ఏర్పడ్డ 34 మున్సిపాలిటీలను దొడ్డిదారిన దక్కించుకొనేందుకు కుట్రలు చేస్తున్నది. బరితెగించి అరాచకపర్వం సాగిస్తున్నది. ఖాకీల దన్నుతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లను ఎత్తుకెళ్తున్నది. -కేటీఆర్ › 2



సంత్‌సేవాలాల్ జయంతి సందర్భంగా తెలంగాణభవన్‌లో నిర్వహించిన హోమంలో పాల్గొన్న కేటీఆర్, నేతలు



› 5

బీఆర్ఎస్ క్యాంపులపై ట్యాపింగ్ కుట్ర

అధికార యావలో కాంగ్రెస్ పార్టీ అడ్డదారులు

ఫోన్లు ట్యాప్ చేసి, పోలీసుల్ని పంపుతున్నరు

బీఆర్ఎస్ కౌన్సిలర్లపై దాడులు, బెదిరింపులు

కౌన్సిలర్ల కిడ్నాప్‌కు తెరవెనుక ప్రయత్నాలు

తనిఖీల పేరుతో వారిని అడ్డుకునేందుకు కుట్ర

కాంగ్రెస్‌కు ఓటేయించేలా ఒత్తిడికి పథకరచన

పోలీసులను బూతులు తిట్టినా అరెస్టులేవి?

జగ్గారెడ్డి, అర్వింద్‌ను అరెస్టు చేయరెందుకు?

కోడ్ ఉల్లంఘించినా అధికారులకు పట్టదా?

కోట్లు పంచినా కాంగ్రెస్ గెలిచింది సగం చోట్లే

బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్



బెంగళూరులో ఆదివారం ట్రేడ్‌డీల్ ప్రతులను దహనం చేస్తున్న రైతులు

రైతన్నలపై ట్రేడ్ డీల్ పిడుగు!

ఒప్పందం అమల్లోకి రాకముందే పత్తి, సోయాబీన్ ధరలు పతనం

దేశీయ సాగురంగానికి శరాఘాతం.. రైతుల్లో తీవ్ర ఆందోళన

18% సుంకాలను గొప్పగా చెప్పకోవడం తప్పదారి పట్టించడమే

కేంద్రంపై రైతు సంఘాల ఆగ్రహం.. పలు ప్రాంతాల్లో నిరసనలు

అమెరికాతో మోదీ సర్కార్ కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందం అప్పుడే విపరిణామాలను చూపుతున్నది. ట్రేడ్ డీల్ పూర్తిగా అమల్లోకి రాకముందే రైతులపై దాని ప్రభావం తీవ్రంగా కనిపిస్తున్నది. పత్తి, సోయాబీన్ ధరలు భారీగా పతనమయ్యాయి. అమెరికా-భారత్ ఒప్పందంతో విదేశీ ఉత్పత్తులకు తలుపులు బార్లా తెరవడమే ధరల పతనానికి కారణమని రైతుసంఘాలు విమర్శిస్తున్నాయి. › 6

సామాజిక సమానత్వం కోసం సేవాలాల్ కృషి

ఆ మహనీయుడి మార్గం అనుసరణీయం.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): మహిళలు, పీడిత వర్గాలు, అడవిబిడ్డల సామాజిక సమానత్వం కోసం బంజారాల ఆధ్యాత్మిక దైవం సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్ ఎంతగానో పరితపించారని బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు కొనియాడారు. ఆయన మార్గం భావితరాలకు ఆచరణీయమని పేర్కొన్నారు. ఆదివారం గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. గిరిజన బిడ్డలైన బంజారాల సామాజిక, ఆధ్యాత్మిక ఐక్యత, ధార్మిక జీవనానికి ఆ మహనీయుడు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగించి వారి ఆత్మగౌరవం, అభ్యున్నతి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసిందని గుర్తుచేశారు.



తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి తలసాని. చిత్రంలో బీఆర్ఎస్ నేతలు పల్లె రవికుమార్, కిశోర్‌గౌడ్, ముఠా జయసింహ

రేపు తెలంగాణ భవన్‌లో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

- పుట్టిన రోజును అన్ని జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలి
- పార్టీ నాయకులు, శ్రేణులకు మాజీ మంత్రి తలసాని పిలుపు

హైదరాబాద్, ఫిబ్రవరి 15(నమస్తే తెలంగాణ): తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్.. రాష్ట్ర ప్రజల కరెంట్, నీళ్ల గోస తీర్చిన మహానాయకుడు అని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కొనియాడారు. వృద్ధులకు ఆసరా పింఛన్లు, పేదింటి ఆడబిడ్డ పెండ్లి కోసం కల్యాణలక్ష్మి/షాదీముబారక్ పథకల అందజేతతో పాటు గురుకులాలను అద్భుతంగా తీర్చిదిద్దారని గుర్తుచేశారు. సాగు, తాగునీటి ఇబ్బందులు తీర్చిన గొప్ప నాయకుడని చెప్పారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం మీడియా సమావేశంలో తలసాని మాట్లాడారు. మంగళవారం కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై తెలంగాణ భవన్‌లో కేక్ కట్ చేసి, కేసీఆర్ జన్మదిన వేడుకలు జరుపుతామని తెలిపారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కేసీఆర్ చేసిన ఉద్యమాలు, అభివృద్ధి పనుల చిత్రపటాల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి హరీశ్‌రావు, శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ముఖ్య నేతలు పాల్గొంటారని తెలిపారు. కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలకు పెద్ద ఎత్తు న హాజరుకావాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలవారీగా నేతలందరూ కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించడంతో పాటు ఆలయాలు, చర్చిలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయాలని కోరారు. అనంతరం తెలంగాణ భవన్‌లో వేడుకల ఏర్పాట్లను పార్టీ ప్రధాన కార్యదర్శి రావుల చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి తలసాని పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు పల్లె రవికుమార్, కిశోర్ గౌడ్, ముఠా జయసింహ పాల్గొన్నారు.

అడ్డదారులు.. అరాచకాలు

దొడ్డిదారిన దక్కించుకొనేందుకు హస్తం కుట్రలు • పోలీసుల అండతో ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై దౌర్జన్యం

- ఎవరూ కలిసిరాకున్న సింగరేణి రక్షణకు పోరాటం
- కేసీఆర్ పదేండ్ల పాలనలోనే గిరిబిడ్డలకు న్యాయం
- కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అయితేనే మరింత మేలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టీకరణ
- తెలంగాణ భవన్‌లో ఘనంగా సేవాలాల్ జయంత్యుత్సవాలు



తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ జయంత్యుత్సవాలకు హాజరైన కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, శ్రీనివాస్‌గౌడ్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తేతెలంగాణ): మున్సిపల్ పోలింగ్‌లో అధికార కాంగ్రెస్ అక్రమాలకు పాల్పడ్డదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీసుల అండతో ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై దౌర్జన్యాలకు దిగిందని ధ్వజమెత్తారు. ఇప్పుడు హంగ్ ఏర్పడ్డ 34 మున్సిపాలిటీలను దొడ్డిదారిన దక్కించుకొనేందుకు కుట్రలు చేస్తున్నదని నిప్పులు చెరిగారు. బరితెగించి అరాచకపర్వం సాగిస్తున్నదని తూర్పారబట్టారు. 'ఖాకీల దన్నుతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లను ఎత్తుకెళ్తున్నది.. విచ్చలవిడిగా ప్రలోభాలకు గురిచేస్తున్నది.. వారి ఇండ్లకు పోలీసులు, కాంగ్రెస్ గూండాలను పంపి దుర్మార్గాలకు దిగు తున్నది' అని తూర్పారబట్టారు. ఏదేమైనా తాము ఇప్పటికే 15కు పైగా మున్సిపాలిటీలను గెలుచుకున్నామని, హంగ్ ఏర్పడ్డ చాలా చోట్ల గులాబీ జెండాను ఎగురవేస్తామని విశ్వాసం వ్యక్తంచేశారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ జయంత్యుత్సవాలకు కేటీఆర్ హాజరయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ హంగ్ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ చేస్తున్న దుర్మార్గాలు, కొత్తగూడెంలో సీపీఐ, కాంగ్రెస్ పొత్తు, తాజా రాజకీయ పరిణామాలపై స్పందించారు.

సింగరేణి పరిరక్షణకు పోరాటం

ఎవరు కలిసొచ్చినా రాకున్నా సింగరేణి పరిరక్షణ పోరాటాన్ని కొనసాగిస్తామని, కార్మికుల ప్రయోజనాలను కాపాడుతామని, భవిష్యత్తులోనూ ఇదే పంథాలో ముందుకెళ్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చిచెప్పారు. సింగరేణిలో కాంగ్రెస్ దోపిడీకి అడ్డుకట్టవేసేందుకే సీపీఐతో పొత్తును ప్రతిపాదించామని స్పష్టంచేశారు. 'ఇప్పటికే అధికారపార్టీతో సఖ్యత కొనసాగిస్తున్న సీపీఐ కొత్తగూడెం మేయర్ పీఠాన్ని పంచుకోవడంలో పెద్దగా ఆశ్చర్యపోవాల్సింది ఏమీలేదు.. ఆ పార్టీ అనుబంధ సంఘం ఏఐటీయూసీ ఎందుకు అంగీకరించిందో తెలియదు.. దాని వెనుక ఎవరి ఒత్తిళ్లు పనిచేశాయో చెప్పలేను' అంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ, కాంగ్రెస్ కలిసి సింగరేణి కార్మికులకు తీరని ద్రోహం చేస్తున్నాయని మండిపడ్డారు. రెండు జాతీయ పార్టీల దుర్మార్గాలకు అడ్డుకట్ట వేసి సంస్థను పరిరక్షించుకుంటామని పునరుద్ఘాటించారు.

> కేసీఆర్ పదేండ్ల పాలనలోనే గిరిజన బిడ్డలకు న్యాయం జరిగింది. 'మా తండాల్లో మా రాజ్యం' అనే నినాదాన్ని కార్యరూపంలోకి తెచ్చిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కింది. నాడు 3,146 కోయ, గిరిజన, లంబాడీ తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చినం. వేలాది మంది గిరిజన బిడ్డలకు సర్పంచులు, వార్డు సభ్యులుగా అవకాశం కల్పించినం. 4.5 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలిచ్చినం.
>
> -కేటీఆర్

పోడు పట్టాలిచ్చినం..గురుకులాలు కట్టినం

కేసీఆర్ పదేండ్ల పాలనలో గిరిజన బిడ్డలకు న్యాయం జరిగిందని కేటీఆర్ వివరించారు. 'మా తండాల్లో మా రాజ్యం' అనే నినాదాన్ని కార్యరూపంలోకి తెచ్చిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కిందని చెప్పారు. నాడు 3,146 కోయ, గిరిజన, లంబాడీ తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చామని గుర్తుచేశారు. వేలాది మంది గిరిజన బిడ్డలకు సర్పంచులు, వార్డు సభ్యులుగా అవకాశం కల్పించామని చెప్పారు. 4.5 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలిచ్చామని పేర్కొన్నారు. ఆదివాసీ యోధుడు కుమ్రంభీం నాయకత్వంలో జరిగిన జల్, జంగల్, జమీన్ పోరాట స్ఫూర్తిని కొనసాగించామని స్పష్టంచేశారు. గిరిపుత్రులకు అడవులు, భూములు, నీళ్లపై హక్కులు కల్పించి వారి జీవన ప్రమాణాలు పెంచామని తెలిపారు. గిరిజన పిల్లల కోసం ఆశ్రమ పాఠశాలలు, గురుకుల జూనియర్, డిగ్రీ కాలేజీలు నెలకొల్పి మెరుగైన విద్యనందించామని వివరించారు. ఎస్టీ రిజర్వేషన్లను ఆరు శాతం నుంచి పది శాతానికి పెంచిన ఘనత నాటి కేసీఆర్ సర్కారుకే దక్కిందని చెప్పారు. ఓవర్సీస్ స్కాలర్‌షిప్ ద్వారా విదేశాల్లో చదువుకొనే గిరిజన విద్యార్థులకు చేయూతనందించామని గుర్తుచేశారు. సీఎం ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్ కింద గిరిజన యువతకు వడ్డీలేని, సబ్సిడీ రుణాలు మంజూరు చేసి వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దామని వివరించారు. బంజారాహిల్స్‌లో సేవాలాల్ బంజారా భవన్ నిర్మించామని, జిల్లాల్లో ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి స్థలాలు మంజూరుచేశామని చెప్పారు. సేవాలాల్ జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించి ఆ మహనీయుడికి సముచిత గౌరవమిచ్చామని తెలిపారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయిన తర్వాత గిరిజనుల మేలు కోసం మరిన్ని మంచి కార్యక్రమాలు చేపడుతామని హామీ ఇచ్చారు.

శివుడి ఆశీస్సులతో సుభిక్షంగా ఉండాలి

మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలకు కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. శివుడి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. సేవాలాల్ జయంతి, శివరాత్రి ఒకేరోజు రావడం ఈ ఆదివారం ప్రత్యేకత అని పేర్కొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంత్యుత్సవాలు

బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ 287వ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన భోగ్ బండార్ వేడుకలకు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు గిరిజన మహిళలు సంప్రదాయ వేషధారణతో సందడి చేశారు. డప్పుచప్పుళ్ల మధ్య నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఖానాపూర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి జాన్సన్ రాథోడ్, నాయకులు కరాటే రాజు, రాంబల్ నాయక్, గాంధీనాయక్, రామచంద్రునాయక్, వాల్యానాయక్, పల్లె రవికుమార్‌గౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి, కురువ విజయ్‌కుమార్, కిశోర్‌గౌడ్ పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): బల్దియా ఎన్నికల్లో గెలిచిన మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌కు చెందిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు, బెల్లంపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆదివారం ఆయన నివాసంలో కలిశారు. అధికారపార్టీ అరాచకాలకు ఎదురొడ్డి గెలువడం గొప్పవిషయమని కేటీఆర్ ప్రశంసించారు. మీరు చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని అభినందించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, పార్టీ సీనియర్ నేతలు ఉన్నారు.

పట్టుసడలొద్దు పట్టణం చేజారొద్దు

- స్థానిక నేతలకే నిర్ణయాధికారం
- కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టేలా బీఆర్ఎస్ వ్యూహాత్మక ఎత్తుగడ
- స్వతంత్రులు, ఇతర పార్టీల నేతలకు సహకారం అందించే యోచన

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): అడ్డదారులు తొక్కి అయినా సరే.. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలను కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ సర్కార్ ఎత్తులు వేస్తున్నది. బీఆర్ఎస్ భౌతిక, నైతిక విజయాన్నీ 'చే'జిక్కించుకోవాలని కుట్రలు పన్నుతున్నది. 'నేనే రాజు...నేనే మంత్రి' అని ప్రకటించుకున్న రేవంత్‌కు 36 మున్సిపాలిటీల్లో 'హంగ్' తీర్పుతో ప్రజలు షాక్ ఇచ్చారు. 'కిందపడినా నాదే పైచేయి' అని చెప్పుకొనేందుకు హస్తం పార్టీ నేతలు ఆరాటపడుతున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నది. ఇప్పటికే అధికార పార్టీ కుట్రలను ఎక్కడికక్కడ తిప్పికొడుతున్నది. స్పష్టమైన మెజారిటీ వచ్చిన మున్సిపాలిటీలతోపాటు హంగ్ మున్సిపాలిటీల్లో పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని బాధ్యులకు సంకేతాలిచ్చింది. హంగ్ వచ్చిన 36 మున్సిపాలిటీల్లో 17 చోట్ల బీఆర్ఎస్‌కు అవకాశాలు మెండుగా ఉన్నాయి. దీంతో అధికారంలో ఉన్న అన్ని అనుకూలతలను వాడుకొని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఇతర పార్టీల నుంచే కాకుండా స్వతంత్ర వార్డు సభ్యులను తమ దారికి తెచ్చుకోవాలని కుట్రలు పన్నుతున్నారు. దీంతో కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టేందుకు వెనుకాడొద్దనే ఆలోచనలో బీఆర్ఎస్ ఉన్నది. అనేక మున్సిపాలిటీల్లో ఇండిపెండెంట్ వార్డు సభ్యులు, ఇతర పార్టీ సభ్యులు బీఆర్ఎస్ స్థానిక నాయకత్వాల టచ్‌లోకి వెళ్లినట్టు సమాచారం. హంగ్ వచ్చిన మున్సిపాలిటీల్లో సాధ్యమైనన్ని ఎక్కువగా బీఆర్ఎస్ కైవసం చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. పరిస్థితులను గమనించే మంత్రులు, కాంగ్రెస్‌లో భుజబలం ఉన్న నాయకులు ఎక్కడికక్కడ రంగంలోకి దిగారు. బీఆర్ఎస్ శిబిరంలోకి వెళ్లిన వార్డు సభ్యులను అనేకచోట్ల పోలీసులను ఉసిగొల్పి తమదారికి తెచ్చుకోవడానికి కాంగ్రెస్ నేతలు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. తమ దరికి చేరిన స్వతంత్రులు, ఇతర పార్టీ నేతలకు సంపూర్ణ సహకారం అందిద్దామని, భవిష్యత్తులో వారికి మంచి అవకాశాలు ఇచ్చే విషయంలో తొలిప్రాధాన్యత ఇస్తామనే భరోసాను బీఆర్ఎస్ ఇచ్చినట్టు తెలిసింది.



అమెరికాలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ యూఎస్ఏ డెలవరీ శాఖ ప్రతినిధులు

కేసీఆర్ జన్మదినోత్సవం సందర్భంగా అమెరికాలో రక్తదాన శిబిరం

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ యూఎస్ఏ డెలవరీ శాఖ ఆధ్వర్యంలో ఐదో విడత రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ యూఎస్ఏ డెలవరిశాఖ ప్రతినిధి భాస్కర్ పిన్న, అనుదీప్ దిడ్డి ప్రముఖ బ్లడ్ డొనేషన్ డెల్మేర్వతో కలిసి శిబిరం నిర్వహించారు.

నీటి మళ్లింపులను బోర్డు పర్యవేక్షించాల్సిందే

- కేఆర్ఎంబీకి రాష్ట్ర సర్కార్ లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి రిజర్వాయర్ల నుంచి చేపడుతున్న నీటి మళ్లింపులను బోర్డు కచ్చితంగా పర్యవేక్షించాల్సిందేనని తెలంగాణ ప్రభుత్వం తేల్చిచెప్పింది. రాష్ట్ర ఇరిగేషన్ శాఖ ఈఎన్సీ రమేశ్‌బాబు తాజాగా కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ)కి లేఖ రాశారు. బోర్డు రాసిన లేఖలోని పలు అంశాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉమ్మడి రిజర్వాయర్ల నుంచి అడ్డగోలుగా నీటిని మళ్లించుకుంటున్న ఏపీ ప్రభుత్వం.. ఆ లెక్కలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయడం లేదని వివరించారు. కేవలం 555 టీఎంసీలే మళ్లించామని పేర్కొంటూ 113 టీఎంసీలను లెక్కలో చూపడం లేదని తెలిపారు. కేఆర్ఎంబీ సైతం ఏపీ చెప్పిన లెక్కలనే పరిగణనలోకి తీసుకొంటున్నదని, తెలంగాణ లెక్కలను పట్టించుకోవడం లేదని పేర్కొంటూ.. ఉమ్మడి రిజర్వాయర్ల నుంచి మళ్లించే జలాలను బోర్డు నిత్యం పర్యవేక్షించాల్సిందేనని స్పష్టం చేశారు. వాస్తవానికి ఏపీ కోటా ఇప్పటికే అయిపోయిందని, ఆయా ప్రాజెక్టుల్లోని మిగిలిన 164 టీఎంసీలు తెలంగాణవేనని పేర్కొంటూ.. ఆ మేరకు రిలీజ్ ఆర్డర్స్ జారీ చేయాలని కోరారు. నీటి మళ్లింపులను నిలిపివేయకపోతే ఏపీపై చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఏపీ ఔట్‌లెట్లను స్వాధీనం చేసుకోవాలని రమేశ్‌బాబు డిమాండ్ చేశారు.

..ఐటీకి ఐకాన్

మొదటిపేజీ తరువాయి...

యువతకు ఉపాధి అవకాశాలు లభించాయి. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఐటీ ఎగుమతుల్లో 299 శాతం పెరుగుదల నమోదవ్వడమే కాదు దేశంలోని ప్రతి మూడు ఐటీ ఉద్యోగాల్లో ఒకటి తెలంగాణే సృష్టించిందంటే ఐటీ రంగం అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యత ఏమిటో అర్థం చేసుకోవచ్చు. 'ఐటీ ఎగుమతులను రెట్టింపు చేస్తాం. మన నగరాన్ని ఐటీ హబ్‌గా మారుస్తాం' అని ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన కొత్తలో అప్పటి ఐటీ మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీకి మించి తెలంగాణ రాష్ట్రం ఐటీ రంగంలో దూసుకుపోతున్నది. కేటీఆర్ చెప్పినట్టు ఐటీ ఎగుమతులు రెండురెట్లు కాదు.. ఏకంగా నాలుగింతలయ్యాయి. కొత్త ఉద్యోగాలు పది లక్షలకు చేరాయి. ఎన్డీయే పాలిత 14 రాష్ట్రాల్లోని మొత్తం ఐటీ ఎగుమతులను కలిపినా 2023–24లో తెలంగాణ ఎగుమతి చేసిన ఐటీ ఎగుమతుల కంటే తక్కువే ఉండటం గమనార్హం. ఇదంతా కేసీఆర్ దార్శనికతతో పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రవేశపెట్టిన వినూత్న ఐటీ పాలసీలు, నాటి ఐటీ మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవ వల్లే సాధ్యమైంది. ఈ మేరకు 2023–24గానూ ఐటీ ఎగుమతులకు సంబంధించి కేంద్రప్రభుత్వం తాజాగా విడుదల చేసిన గణాంకాల్లో తేలింది.



అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా..

2013–14లో అప్పటి కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఐటీ ఎగుమతులు రూ.57,258 కోట్లు మాత్రమే ఉండేవి. అయితే, బీఆర్ఎస్ పాలనలో తీసుకున్న విప్లవాత్మకమైన నిర్ణయాల కారణంగా 2023–24 ఏడాదినాటికి ఐటీ ఎగుమతుల విలువ రూ.2,72,076 కోట్లకు చేరింది. ది సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా (ఎస్టీపీఐ) కింద రాష్ట్రం నుంచి రూ.1,21,117 కోట్ల విలువైన ఐటీ ఎగుమతులు జరగ్గా.. స్పెషల్ ఎకనమిక్ జోన్ (సెజ్) కింద మరో రూ.1,50,959 కోట్లు విలువైన ఐటీ ఎగుమతులు జరిగినట్టు కేంద్ర గణాంకాలు తెలిపాయి. 2023–24కు గాను దేశవ్యాప్తంగా మొత్తం ఐటీ ఎగుమతుల్లో తెలంగాణ వాటా 15.56 శాతం ఉన్నట్టు గణాంకాల్లో తేలింది. మొత్తం ఐటీ ఎగుమతుల్లో 65 శాతం వాటా దక్షిణాది రాష్ట్రాలదే కావడం గమనార్హం.

బీఆర్ఎస్ హయాంలో ఐటీ వెలుగులు

కొత్తగా ఏర్పడిన తెలంగాణలో రాజకీయ సుస్థిరత, సమర్థ నాయకత్వానికి తోడు బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రగతిశీల పారిశ్రామిక విధానాలు తెలంగాణలో ఐటీ రంగానికి వెన్నుదన్నుగా నిలిచాయి. దీంతో భారత ఐటీ రంగస్థూల అభివృద్ధి రేటు కంటే తెలంగాణ వృద్ధిరేటు ప్రతి ఏటా రెండు నుంచి మూడు రెట్లవరకూ ఎక్కువగానే ఉంటున్నది. కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐటీ పాలసీలతో యాపిల్, అమెజాన్, సేల్స్‌ఫోర్స్, ఉబర్, మైక్రాన్, స్టేట్ స్ట్రీట్, మాస్ మ్యూచువల్, గూగుల్, ఇంటెల్, ప్రావిడెన్స్, గోల్డ్‌మ్యాన్‌సాచ్స్, జెడ్ఎఫ్, యూబీఎస్, పెప్సీ వంటి దిగ్గజ కంపెనీలు హైదరాబాద్‌కు తరలివచ్చాయి. దీంతోపాటు ఫేస్‌బుక్, క్వాల్కామ్, అక్సెంచర్, వేల్స్‌ఫార్గో, క్విలినిక్స్, మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్, ఒరాకిల్, టీసీఎస్, ఐబీఎం, టెక్ మహీంద్ర, కాగ్నిజెంట్, విప్రో తమ కార్యకలాపాలను విస్తరించాయి. హైదరాబాద్‌లో ఐటీ రంగం వేగంగా పుంజుకోవడంతో దీని ప్రభావం మిగతా రంగాలైన నిర్మాణ, రవాణా, సేవా, ఆతిథ్య, వినోద రంగాల వృద్ధికి తోడ్పాటునిచ్చింది. ఒక్క ఐటీ ఉద్యోగంతో పరోక్షంగా మరో నాలుగు ఉద్యోగాలు వస్తాయని నిపుణులు చెప్తారు. బీఆర్ఎస్ హయాంలో 2023–24నాటికి ఐటీ రంగంలో 10 లక్షల మంది ఉపాధి పొందుతున్నట్టు తేలింది. ఈ లెక్కన ఐటీ రంగాన్ని ఆధారంగా చేసుకొని వివిధ రంగాల్లో కొత్తగా 40 లక్షల ఉద్యోగాల సృష్టి జరిగినట్టు అర్థం చేసుకోవచ్చు.

గత పదేండ్లలో ఐటీ ఎగుమతులు, ఉద్యోగాలు ఇలా...

ఆర్థిక సంవత్సరం	ఐటీ ఎగుమతులు	ఉద్యోగాలు
2014-15	రూ. 68, 209 కోట్లు	3,71,774
2015-16	రూ. 76,595 కోట్లు	4,07,385
2016-17	రూ.86,111 కోట్లు	4,31,891
2017-18	రూ.93,953 కోట్లు	4,75,308
2018-19	రూ.1,09,588 కోట్లు	5,43,033
2019-20	రూ.1,34,335 కోట్లు	5,82,126
2020-21	రూ.1,48,399 కోట్లు	6,28,615
2021-22	రూ.1,85,226 కోట్లు	7,78,121
2022-23	రూ.2,45,186 కోట్లు	9,05,715
2023-24	రూ. 2,72,076 కోట్లు	10,00,000

కేటీఆర్ ప్రత్యేక చొరవ

బీఆర్ఎస్ హయాంలో నాటి ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో తెలంగాణలో వ్యాపార అనుకూల వాతావరణం, ప్రభుత్వ పరంగా ప్రోత్సాహం, ఐటీ మౌలిక వసతులను అందుబాటులోకి తేవడంతో ఐటీ ఎగుమతులు భారీగా పెరిగాయి. పరిశ్రమలకు 15 రోజుల్లో అనుమతి ఇవ్వడానికి టీఎస్ఐపాస్, టీఎస్‌బీపాస్ వంటి కార్యక్రమాలను బీఆర్ఎస్ సర్కార్ ప్రవేశపెట్టింది. స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు టీహబ్–1, టీహబ్–2, హార్డ్‌వేర్ రంగంలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు అతి పెద్ద ప్రొటో టైపింగ్ టీ వర్క్స్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏర్పాటు చేయడం తెలిసిందే.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎగుమతులు డల్

బీఆర్ఎస్ హయాంలో ఒకవైపు.. తెలంగాణకు ఐటీ కంపెనీలు క్యూకట్టి ఎగుమతులు అంతకంతకూ పెరగ్గా.. మరోవైపు, బీజేపీపాలిత రాష్ట్రాల్లో ఐటీ ఎగుమతులు ఆశించిన మేర లేకపోవడం గమనార్హం. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ చెప్తున్నా.. అందుకు పూర్తి భిన్నంగా పరిస్థితులు ఉన్నాయని కేంద్ర గణాంకాల ద్వారా అర్థమవుతున్నది. మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో 2023–24 సంవత్సరానికిగానూ ఐటీ ఎగుమతుల విలువ కేవలం రూ.14,926 కోట్ల మేర జరిగినట్టు రిపోర్టు స్పష్టం చేసింది. యోగీ ఆదిత్యనాథ్ సీఎంగా ఉన్న మరో డబుల్ ఇంజిన్ రాష్ట్రం ఉత్తరప్రదేశ్.. 2023–24లో రూ.79,497 కోట్లు మాత్రమే ఐటీ ఎక్స్‌పోర్ట్స్ చేసింది. మొత్తంగా ఎన్డీయేపాలిత 14 రాష్ట్రాల్లోని మొత్తం ఐటీ ఎగుమతులను కలిపినా 2023–24లో తెలంగాణ ఎగుమతి చేసిన ఐటీ ఎగుమతుల కంటే తక్కువే ఉండటం గమనార్హం.

టీహబ్, టీవర్క్స్‌పై కేంద్రం సహా పలు మేథో సంస్థలు ఇప్పటికే ప్రశంసలు కురిపించాయి.

ఐటీఐఆర్ ఇవ్వకపోయినా..

తెలంగాణకు రావాల్సిన ఐటీఐఆర్ ప్రాజెక్టును ఇవ్వకుండా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రంపై వివక్ష చూపింది. ఒకవేళ, ఐటీఐఆర్ ప్రాజెక్టు వస్తే 2035నాటికి రూ.2.5 లక్షల కోట్ల ఎగుమతులకు చేరే అవకాశం ఉండేది. అయితే, కేంద్రం ఐటీఐఆర్‌ను రద్దు చేయడంతో అప్పటి కేసీఆర్ ప్రభుత్వమే ముందుకొచ్చి ఐటీ అభివృద్ధి కోసం ఎన్నో పాలసీలు, ప్రోత్సాహకాలను తీసుకొచ్చింది. ఫలితంగా 2013–14లో అప్పటి కాంగ్రెస్ పాలనలో ఐటీ ఎగుమతులు రూ.57,258 కోట్లుగా ఉంటే 2023–24 ఏడాది నాటికి ఈ ఎగుమతుల విలువ రూ.2,72,076 కోట్లకు చేరింది. ఐటీ రంగంలో దేశంలోనే అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది.

ఉద్యోగాల కల్పనలో మనమే టాప్

ఐటీ రంగంలో కొత్త ఉద్యోగాల కల్పనలో తెలంగాణ దేశంలోనే తొలి స్థానంలో నిలిచింది. నాస్కామ్ నివేదిక ప్రకారం.. 2022–23లో దేశంలో 4.5 లక్షల మందికి ఐటీ ఉద్యోగాలు రాగా అందులో 1.5 లక్షల మంది హైదరాబాద్ నుంచే ఉన్నారు. అంటే, దేశంలో వస్తున్న ప్రతి మూడు కొత్త ఐటీ ఉద్యోగాల్లో ఒకటి హైదరాబాద్ నుంచే వస్తున్నది. కొత్త ఉద్యోగాల కల్పనలో కేసీఆర్ హయాంలోని తెలంగాణ దేశానికే రోల్ మాడల్‌గా నిలిచినట్టు నిపుణులెందరో ప్రశంసలు కురిపించడం తెలిసిందే.

టీహబ్ రయ్.. రయ్

ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక స్టార్టప్ సంస్థలను ప్రోత్సహించడమే లక్ష్యంగా బీఆర్ఎస్ హయాంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన టీ–హబ్ కొత్త రికార్డులను సృష్టించింది. కేవలం ఐటీ రంగంలోనే గాక, ఔషధ, బయో, మెడికల్, వ్యవసాయ, మహిళ, సామాజిక అంశాల్లో ప్రత్యేకంగా స్టార్టప్‌లకు టీ–హబ్ ఊతమందించింది. అలా టీ–హబ్ ఏర్పాటు చేసిన పదేండ్లలోనే 2 వేలకు పైగా స్టార్టప్‌లకు ప్రయోజనం చేకూరింది. తెలంగాణ టీ–హబ్‌ను ఆదర్శంగా తీసుకొనే మహారాష్ట్రలో ఎం–హబ్‌ను నిర్మిస్తుండటం గమనార్హం. కాగా, టీ–హబ్ స్ఫూర్తితోనే వీ–హబ్, తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్, టాస్క్, ఎమర్జింగ్ టెక్నాలజీస్ వింగ్, రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ (రిచ్)లను ఏర్పాటు చేయడం గమనార్హం. దేశంలోనే అతిపెద్ద ప్రోటోటైపింగ్ కేంద్రం టీవర్క్స్‌ను కూడా టీ–హబ్ స్ఫూర్తితోనే ఏర్పాటు చేయడం విశేషం.

ఐటీతో మరిన్ని ఉద్యోగాలు

ఒక్క ఐటీ ఉద్యోగంతో పరోక్షంగా లభించే ఉద్యోగాల సంఖ్య	4
2023-24లో తెలంగాణలో మొత్తం ఐటీ ఉద్యోగాలు	10 లక్షలు
ఈ లెక్కన మిగతా రంగాల్లో జరిగిన ఉద్యోగాల సృష్టి	40 లక్షలు

టీ-హబ్‌తో ఏం జరిగింది?

లబ్ధిపొందిన స్టార్టప్‌లు	2000+
లభించిన మొత్తం నిధులు	1.94+ బిలియన్ డాలర్లు
అందుబాటులోకి మెంటార్లు:	200+
ప్రోత్సాహం అందించిన దిగ్గజ కంపెనీలు	100+
జరిగిన ఈవెంట్లు	1000+
భాగస్వామ్యమైన కార్పొరేట్ కంపెనీలు	110+
అంతర్జాతీయ భాగస్వామ్య కార్యక్రమాలు	400+

నైపుణ్యాల పెంపునకు టాస్క్


ఐటీతో పాటు ఇతర రంగాల్లో యువతకు అవసరమైన నైపుణ్యాలు కల్పించడమే లక్ష్యంగా అప్పటి కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)ను ఏర్పాటు చేసింది. టాస్క్ ద్వారా పదేండ్ల వ్యవధిలో 10 లక్షల మందికి పైగా యువతీ యువకులకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ లభించింది. ఐటీతో పాటు ఐటీఈఎస్, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్ వంటి అనేక రంగాల్లోనూ టాస్క్ శిక్షణ ఇస్తున్నది. అంతేకాదు వేలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పించడంలో సహకారం అందించింది. అందుకే కేసీఆర్ సర్కార్ ప్రారంభించిన 'టాస్క్' సేవలను నీతి ఆయోగ్ వంటి మేథో సంస్థలు కూడా ప్రత్యేకంగా ప్రశంసించాయి.



జై తెలంగాణ..
జై కె.సి.ఆర్..
జై భారత్..
తన్నీరు మహేష్
మహేష్ బిగాల
అణచివేతకు అడ్డుకట్టు, ఆత్మగౌరవానికి ఆయుధం
తెలంగాణ స్వరం కేసీఆర్! వాగ్మిత విభవం కేసీఆర్!
వేదనకు విరామం, విజయానికి ఆరంభం
రాష్ట్ర జననం కేసీఆర్! చరిత్ర మలుపు కేసీఆర్!
కలలను కట్టగా, కట్టలను కాలువగా
నీటితో నింపిన నమ్మకం కేసీఆర్! తెలంగాణ ఆత్మ కేసీఆర్!
ఆరోగ్యమే ఆయుధం, ఆయుష్షే ఆధారం
దీర్ఘ జీవన ఆశీస్సులు కేసీఆర్!
మళ్ళీ రాష్ట్రానికి మార్గం, మళ్ళీ ప్రజలకు మంచి నాయకత్వం
విజయ పునరాగమనం కేసీఆర్!
తెలంగాణ
రాష్ట్ర ప్రదాత, జాతి పిత
శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారికి
జన్మదిన శుభాకాంక్షలు
రవి దన్నపునేని
లోంకలపల్లి కిశోర్‌రెడ్డి
పోల్సాని కొండల్
మారగోని రాము గౌడ్
సంరెడ్డి వికాస్ రెడ్డి
మనోజ్‌కుమార్ ఇనగంటి
డా. ఎర్రంరెడ్డి తిరుపతి రెడ్డి
శ్రీనివాస్ సురభి
చందు తాళ్ళ
సక్రు నాయక్
నరసింహ నాగులవంచ
రజినికాంత్ కొసనం
BHARAT RASHTRA SAMITHI - USA
భారత రాష్ట్ర సమితి - అమెరికా

చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com



తెలంగాణ సూర్యుడు కేసీఆర్
నిశ్శబ్దంలోంచి శబ్దాన్ని పుట్టించి
అచేతనంలోంచి చైతన్యాన్ని రగిలించి
కొయ్యకు వేలాడిన మద్దెలలోంచి
ప్రత్యేక తెలంగాణ
అస్తిత్వ నాదాన్ని మోగించిన
తెలంగాణ సూర్యుడు కేసీఆర్

మనుషులందరూ ఒక్కపాటై తోటై మాటై
పువ్వులన్నీ ఒక్క దండై
కాలువలన్నీ ఒక్క చెరువై
పాటలన్నీ జయగానాలై
ఊపిరి సలుపని కేంద్రం

దీక్షాశయ్యపై తాడో పేడో
వణికించే చలిలో ఎగిసిన ఉష్ణోగ్రతలు
అర్ధరాత్రి అమావాస్య పున్నమైంది
తేనెతుట్టె తీపి చెరగని చిరునవ్వు
వీధులన్నీ మిఠాయి పొట్లాలై
స్ఫూర్తి గీతాలతో
జై జై కాళోజీ, జయశంకర్ అమర్‌రహే
ఊరూరా ఉద్యమ వీధులు
కొమురం భీమ్, సమ్మక్క సారక్కలు
అమరులకు జోహార్లు
స్వాతంత్ర్యానికి రెక్కలు!
ఆనందము వాకిట్లోనే ఉంది
గడప దాటనీయలేదు
వలస పెత్తందారుల ముండ్లకంచెలు!

పండు తిన్నాక చెట్టుని మరిచినోళ్లు
నీళ్లు తాగాక బావిని పూడ్చినోళ్లు
ఊరు చేరాక తొవ్వని చెరిపేసినోళ్లు
గురువుకే ఎగనామం బెట్టినోళ్లు
తెలంగాణ సూర్యుని
మరిచిపోవడం, ఓ లెక్కనా?
తెలంగాణ తల్లి నా కంజాతవల్లి
తంగేడు పువ్వుల
తీరొక్క పువ్వుల గౌరమ్మ తల్లి
ఒక్కడుగు వెనక్కి వేయలే
ఒక్క మాట వెనక్కి తీసుకోలే
దొడ్డి కొమురయ్య,
శ్రీకాంతాచారి, పోలీసు కిష్టయ్య
ఎందరెందరో వీరుల రక్తతర్పణం....
అరవై ఏండ్ల బానిస
బ్రతుక్కు చరమగీతమై
స్వేచ్ఛకు సూర్యోదయమై
తెలంగాణకు
చంద్రోదయమైన
భూమి పుత్రుడు
తెలంగాణ సూర్యుడు
మాసిపోడు!



వనపట్ల సుబ్బయ్య
949276 5358

బ్రతకవలయునయ్య వంద యేళ్లు



రాపర్తి శ్రీనివాస్
63003 82718

తల్లి వెంకటమ్మ తండ్రి రాఘవరావు
కలల పంట అయిన కర్మయోగి
కొదురుపాక శోభ కోదండరాముడై
పూజలెన్నొ జరిపె పుణ్యశీలి

తేజమొకటి వెలిగె తెలంగాణ నేలలో
చింతమడక గ్రామ చిద్విలాసి
ఉడుకుతున్న మనసు ఉద్యమ శిఖరమై
ఉద్యమమున చేర్చె యువతనంత

మేడిగడ్డ జలము మెతుకు సీమను చేర్చ
ఆనకట్ట యొకటి అవతరించె
కల్వకుంట్ల వంశ కరుణశీలి కదిలె
బువ్వ పెట్టు రైతు భుక్తి కొరకు

చెరువు నిండ తిరుగు చేపపిల్లల చూస్తు
పల్లె తల్లి మురిసి పరవశించె
మిషను కాకతీయ మెండుగ జలమివ్వ
చెరువుయున్న పల్లె సిరుల ముల్లె

అవని జనుల బ్రోచు యాదగిరీశుని
గుడిని కట్టినట్టి గొప్ప శిల్పి
అయుత చండియాగమార్భాటముగ చేసి
దైవ కృపను పొందె ధార్మికుండు

కెసియారు గారు కీర్తికి నిలయులై
బ్రతకవలయునయ్య వంద యేళ్ళు
వృక్షజాతికితడు విశ్వసనీయుడు
చెట్టు నాటినాడు పట్టు పట్టి

మాతృభాష రక్ష మహిలోన విజయమై
శాశ్వతత్వమిచ్చు చరితలోన
చంద్రశేఖరుండు చమురయ్యి అలరార
తెలుగు వెలుగుచుండు దీపమోలె

దార్శనికునికి జన్మదిన జేజేలు

అనేక యుద్ధాల్లో ఆరితేరిన వీరుడెవ్వరు? విజయాన్ని ముద్దాడిన ధీరుడెవ్వరు? సాధించిన రాష్ట్రాన్ని సమున్నతంగా నిలిపిన పరిపాలన దక్షత ఎవరి సొంతం? రెండుసార్లు జనం జేజేలు అందుకొని అప్రతిహత జైత్రయాత్ర సాగించిన విజయుడెవరు? ఒకే ఒక్కడు.. కేసీఆర్.. విజయసాధనలో తనకెవరూ పోటీ లేరని, సకల జనహిత పాలనలో తనకెవరూ సాటిరారని ఢంకా బజాయించిన జన నేత.. పరపీడన చెరబట్టిన దోపిడీ పరిపాలనలో, ప్రజల ఆలోచనలు పరిపరి విధాలా పోతున్న వేళ దారి తెలియని సందిగ్ధంలో బాటలు తీసిన వ్యూహ చతురుడెవరు? అహింసా మార్గంలో అస్తిత్వ పోరాటాన్ని దరి జేర్చిన దార్శనికుడెవరు? స్వపరిపాలన స్వప్నం సాకారం చేసి ప్రగతి పరుగుల మెరుగులు దిద్దిన స్థితప్రజ్ఞుడెవరు? కోట్లాది జనం గుండెఘోషను తన గొంతులో పలికించిన మాటకారి.

గమ్యాన్ని ముద్దాడిన అలుపు లేని బాటసారి కేసీఆర్. ఈ మూడక్షరాల తారక మంత్రం తెలంగాణ విముక్తి గీతమైంది. తెలంగాణ వ్యతిరేకులకు శరాఘాతమైంది. వినూత్న తెలంగాణకు ప్రగతి సుప్రభాతమైంది. తెలంగాణకు నవశకాన్ని ప్రసాదించిన అసమాన వ్యూహ చతురుడు కేసీఆర్. జలకాళేశ్వరంతో జనసౌభాగ్యానికి సోపానాలు నిర్మించిన అపర మయుడు. గోదారి గంగను చేయిపట్టి కొండలెక్కించిన అపర భగీరథుడు. ఆకుపచ్చని తెలంగాణను కలగన్న హాలికుడు. కలను నిజం చేయడం ఎలాగో తెలిసిన నిత్యశ్రామికుడు. తెలంగాణ ఎన్నటికీ మరువని జలప్రదాత.. జయవిధాత. అందుకో జన్మదిన అక్షర నీరాజనాలు.

ఆత్మగౌరవ పతాక

విముక్త నేల మీద స్వేచ్ఛగా
మేం తిరుగాడుతున్నందుకు జననేతా
మీకివే మా జన్మదిన శుభాకాంక్షలు

ఆత్మగౌరవ పతాకను
ఆకాశమెత్తు ఎగరేసిన యోధుడా
పల్లేరులు మొలిచిన నేల మీద
ఆకుపచ్చని అందాలద్దిన రైతుబంధూ

తెలంగాణ తల్లి చిరునామాను
స్వర్ణాక్షరాలతో లిఖించిన మహనీయుడా

చావు నోట్లో తలపెట్టి
సకల అడ్డంకుల్ని సమాధి చేసిన వీరుడా

వదరుబోతుల వ్యూహాలను
నిలువునా తగులబెట్టే చాణక్యుడా

భ్రమలన్నీ ఆవిరవుతున్న వేళ
మా చూపులన్నీ మీవైపే దార్శనికుడా

మా కలల శాశ్వత సాకారానికి
అన్ని మంత్రవిద్యలెరిగిన జాతిపితా
మీకివే మా జన్మదిన శుభాకాంక్షలు



కోట్ల వెంకటేశ్వరరెడ్డి
94402 33261





ఉద్యమ క్రాంతి

పోరునెలనా పొడిచిన పొద్దు
ఉద్యమాల గడ్డన
ఉదయించిన సూర్యుడు

మన నేల మరవని చరిత్ర
అవని ఆకాశం
శూన్యము లేని
సూర్యుని వెలుగు

నింగి నేల నీరు గాలి
ప్రజల మనసుల ప్రాణ చరిత్ర
మాతృభూమిలో
మహావీరుని గాథ

ఊరుఊరున కనబడే
ఉద్యమ క్రాంతి భాస్కరుడు
పల్లె పొలిమేర ప్రాంతంలో
రాలిన రవి కిరణం
పురుడోసుకొని కన్నది వీరుని

కడుపు పేగు తెంచుకొని పుట్టిన దినం
జనం జరుపుకునే జన్మదినం
ఊరు ప్రజలు చేసుకొనే పండగ రోజు



దేవరపాగ కృష్ణయ్య
99634 49579

జనజలం

రైతుకు నీరు కావాలి
రైతుకు పంట పైకం
భరోసా కావాలి
రైతు కూలిగా కాక
జనం భుక్తిమాలిగా
నిలబడాలి




రేడియమ్
9291527757


తడబడకుండ
మోట గిలకలా
మాట మీద నిలబడ్డ
రైతు భరోసా జలం...
కన్ను మూసి తెరచె లోగ
కరెంటు మాయం
ఎపుడొస్తుందో తెలియని
చీకటి గాయం
దోమల కాటు
ఉక్కపోత

సకాలంలో నీరందక
వచ్చిన పంటకు రాని రేటు
కారణం కరెంటు లేటు
అతడు వచ్చాక
రెప్పవాలె లోపే సర్ఫరా
పల్లె పట్నం కార్మిక కర్షక లోకం

అతడి క్రియాశీలతకు హర్షం
అతడొక సాధకుడు
అతడొక ప్రజానేత
అతడొక మయుడు
అతడొక దార్శనికుడు
అతడొక జనజలం
అతడు తెలంగాణ
ప్రజలకు బలం



అలుపెరుగని శ్రామికుడు



కం: తెలగాణ విముక్తి కొరకై
సలిపెను నుద్యమము తాను చంద్రన్న నిలన్
అలుపెరుగని శ్రామికుడిగ
గళమును వినిపించె ఢిల్లి కన్నులు తెరువన్

కం: నేతలు యెందరొ నున్నను
నాథుడిగా ముందు యుండి నడిపెను పోరున్
గాథగు తెలగాణంబుది
మ్రోతగ మ్రోగించె ముక్తి పొందుట కొరకై



కం: జయహో చంద్రన్నంటున్
నయనంబులపండుగయ్యె నడ్వగ జనమున్
నియమముతో ప్రతి నొక్కరు
మయినడ్చిరి నీవెనుకన మన్ననచూపన్

కం: పథకములవి ప్రజ వృద్ధికి
సతతము సాగించినావు సత్యంబదియున్
పథకము రైతులకిస్తివి
బ్రతుకంతయు మర్వలేని రైతులబంధున్

కం: తొలిముఖ్యమంత్రి చంద్రన్న
సలిపెను పరిపాలనంత సవ్యము గానున్
నిలిచిరి పది వత్సరములు
నొలయించుతు ప్రజల సౌఖ్య, నొద్దిక కృతులన్

కం: పింఛను నిచ్చితి
వీవున్
పెంచగ నదిరెండువేలు
పెద్దలకంతన్
యెంచితివి క్షేమంబును
మంచిని కోరంగ
వృద్ధ మనుషుల పట్లన్



డీ.వినాయక రావు
9059494259

తెలంగాణ బాపు

తెలంగాణ ఉనికిని ఉజ్వలం చేసి -
రాష్ట్రావతరణమే ఆతని తపో దీక్షలో ఫలప్రదమైన లక్ష్యం
ఉద్యమాలెన్ని సాగినా-హత్యలు-ఆత్మహత్యలు
తెలంగాణ తల్లిని ఆగర్భ శోకంలో ముంచెత్తినా
తెలంగాణ సహజ సంపద వనరుల్ని పీల్చి పిప్పి చేసినా
సాహితీ సాంస్కృతిక వైభవాన్ని పాతాళంలో పాతరేసినా
పదవీలాలసత - పతితులు చట్టసభల్లో నిర్వీర్యమైనా

ప్రాంతీయ దురహంకారం దుశ్చర్యల్ని ప్రేరేపించినా
తుపాకీ గొట్టంతో అస్తిత్వ హననం తలపెట్టినా
రాష్ట్ర, కేంద్ర రాజకీయం అరాచకంగా అఘోరించినా
దశాబ్దాలు తెలంగాణ అరణ్య రోదనలో అలమటించినా
చట్టసభల్లో 'తల్లి తెలంగాణ' విలవిల్లాడి విలపించినా
గొర్రెల మందల్లా అధికార పీఠంపై
నాయకశ్రేణి మోకరిల్లినా

కటిక చీకట్లను చీల్చే వెలుగు రేఖల్ని ప్రసరించి
వేయి వెలుగుల క్రాంతిపుంజమై దశదిశల్ని ఐక్యం చేసి
మసకేసి మరుగునపడ్డ అస్తిత్వ పునాదుల్ని వెలిగించి
ఒక ఉప్పెనై-ఉద్యమ ఉగ్రరూపమై ప్రాణమొడ్డి ఒడ్డుకు చేర్చిన

తెలంగాణ అవతరణం
ఆతని అంతరంగ మథనంలో ఆవిర్భావం
దశాబ్ద కాలం ప్రగతి పరుగుల పరవళ్లు
అదిగో అతడు అతడే - తెలంగాణ ప్రాభవం
ఆచంద్రతారార్కం వెలుగులీను తెలంగాణం

జాతిపిత చంద్రశేఖరుడి
స్వప్నమే సాకారం
కువిమర్శల సుడిగుండాల
అపస్వరాలు
అధిగమించిన ఆతని
వ్యక్తిత్వ సౌశీల్యం
కాలాతీత చరిత్రలో
ఒక సువర్ణాధ్యాయం



కే.లక్ష్మణ్ గౌడ్
97049 30509

భగీరథునికి వారసుడై...

తెలంగాణ ప్రజల గొంతుక
లొక్కటై నినదించగా
తరతరాలుగ కన్నకలలకు
ఆయువిచ్చెను కేసీఆర్

పదము పదమున ప్రజ్వరిల్లెను
గళము గళమున అగ్గి రగిలెను
ఏరులై ప్రవహించే రక్తం
త్యాగమే నీ రూపమై

తెలంగాణకు పెద్దదిక్కయి
ముందు నిలిచెను కేసీఆర్
ప్రాణత్యాగం చేస్తానంటూ
దీక్షకు పూనిన సాహసి

ఎట్టకేలకు కొట్టుకొచ్చెను
తెలంగాణను మనకు ఇచ్చెను
పాలకుండై ముందు నిలిచెను
ప్రతిన పూనిన పనులు చేయగ

దివిజ గంగను ఇలకు దించిన
భగీరథునికి వారసుండై
గడప గడపకు నీరుదెచ్చి
కానుకిచ్చెను కల్వకుంట్ల

ఆడపిల్లల పెండ్లి భారం
ఆదుకొనే కళ్యాణలక్ష్మి
కేసీఆర్ కిట్స్ ఇచ్చి
కాన్పు భారం కూడా మోసెను

వృద్ధ జీవన దుర్భరత్వం
రూపుమాపెను పెన్షనిచ్చి
అంగవైకల్యాన్ని కూడా
పెన్షనిచ్చి ఆదుకొనెను

గుడిని మార్చెను బడిని మార్చెను
భూమి దేవుల, ఉపాధ్యాయుల
బడుగు జీవన గతిని మార్చెను
తెలుగు యాసకు ఊతమిచ్చెను
తెలుగు కవుల ఘనత చాటెను

-కందాళ పద్మావతి

మహా సత్యాగ్రహి

మోసగించిన ఆంధ్ర దోష సంహతి నెల్ల
ప్రాసంగ నిర్బంధ పథము నుంచి
సరికొత్త శైలిని సంతరించిన యట్టి
వక్తృత్వ ధీశక్తి వరుస జూపి
వ్యూహ నిర్మాణాల దోహదమ్ములలోన
రిపుల ఆత్మికశక్తి అపహరించి
సబ్బండ వర్ణాల సమరాన దూకించి
ఢిల్లీని మంటల తృళ్ల జేసి

యుక్తి సత్యాగ్రహానికి శక్తినిచ్చి
మహిత స్వాతంత్ర్య సంజీవ మార్గమంచు
నిలిచితివి కాదెభారతి నీ కతాన
అఖిల పోరాట మార్గమై అలర లేదె


చెరగెను చీకటు లెల్లను
విరిసెను ఉదయాలు హృదయ వేదిక లందున్
పరుగులు తీసెను గతమది
సురగంగలు పారె ఫల రసోదిత మెదలన్.

పుట్టినరోజట ఉద్యమ
మట్టే బ్రతుకున మలంచు హర్షా త్మునకున్
పుట్టినరోజట గగనము
పట్టున భూమికిని దించు ప్రజ్ఞా నిధికిన్.

కేసీఆర్‌కు ఆరోగ్య వాసి పెరిగి
జనుల మనసులో వసియించు ఘనత కలిగి
కాలమును మీర జాలిన క్రాంతి బొంది
కవి శుభాకాంక్షలందుచు కదలుగాత.



కాంచనపల్లి గోవర్ధనగిరి రాజు



విలువను పెంచెను విశ్వమందు

పదునాలుగేడులు పలుచన గానీక
నుద్యమంబు నడిపెనుత్తమముగ
ప్రజల మనస్సున రాజిల్లజేసెను
సొంత రాష్ట్ర కలను సంతతముగ

ఆత్మగౌరవమున ఆంధ్ర ప్రభుత నుండి
తాకట్టు విడిపించె ధైర్యమూని
విలవిలలాడెడు తెలంగాణ ప్రాంతపు
విలువను పెంచెను విశ్వమందు

తెచ్చి తెలంగాణ రాష్ట్రము తెగువమీర
వర్ష దశ పాలనము నందు హర్షమెగయ
దీర్ఘకాలపు కలలను దీర్చినాడు
చంద్రశేఖరుండనఘుడు చాలఘనుడు



చిలకమర్రి కృష్ణమాచార్యులు

బరితెగించిన అధికారం!

శంకరయ్యను అప్పగించకుంటే ఆత్మహత్య చేసుకుంటాం

మీడియాతో కుటుంబ సభ్యులు

షాబాద్, ఫిబ్రవరి 15 : మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్ 8వ వార్డు బీఆర్‌ఎస్ కౌన్సిలర్‌గా గెలుపొందిన మంచి శంకరయ్యను కాంగ్రెస్ నాయకులు కిడ్నాప్ చేశారు. ఆదివారం అజీజ్‌నగర్‌లో శంకరయ్య సోదరులు పోచయ్య, సత్తయ్య వారి కుటుంబీకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ఎత్తుకుపోయిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్ మంచి శంకరయ్యను వెంటనే తమకు అప్పగించాలని, లేకపోతే కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. శంకరయ్య గెలుపొందడంతో తాము సంబురాలు చేసుకుంటామనే తరుణంలోనే.. ఆయనను కాంగ్రెస్ శ్రేణులు ఎత్తుకుపోయారని ఆరోపించారు. తాము 25 ఏండ్ల నుంచి రాజకీయాల్లో ఉన్నామని.. ఎప్పుడూ ఇలాంటి పని చేయలేదని పేర్కొన్నారు. శంకరయ్యను తమకు అప్పజెప్పాలని, లేకుంటే ఆత్మహత్య శరణ్యమవుతుందని వాపోయారు.

కిరాణ వ్యాపారిపై కాంగ్రెస్ అభ్యర్థి దౌర్జన్యం

- ఓటమికి కారణమంటూ దుర్భాషలాడిన వైనం
- పాల్వంచలో ఘటన

పాల్వంచ, ఫిబ్రవరి 15 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని ఉన్న పాల్వంచలోని 32వ డివిజన్‌లో ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థి మాలోత్ కోటేశ్వరరావు ఆదివారం ఓ కిరాణ దుకాణ యజమానిపై దౌర్జన్యానికి దిగాడు. బాధితుడి కథనం ప్రకారం.... కార్పొరేషన్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీచేసిన గుగులోత్ రాంబాబు తరపున కిరాణషాపు యజమాని జగ్గు సత్యనారాయణ, అతని కుమారుడు అనిల్ ప్రచారం చేశారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి కోటేశ్వరరావు ఓటమి పాలయ్యాడు. కోపోద్రిక్తుడైన కోటేశ్వరరావు ఆదివారం సత్యనారాయణ దుకాణం ఎదుట బైఠాయించి దుర్భాషలాడుతూ దౌర్జన్యానికి పాల్పడ్డాడు. అంతటికాకుండా ముఖంపై ఉమ్మివేసి.. నీ సంగతి చూస్తానని బెదిరించినట్టు బాధితుడు తెలిపాడు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు షాపు యజమాని తెలిపారు.

మొదటిపేజీ తరువాయి...

రెచ్చిపోతున్నది. ప్రతిపక్ష బీఆర్‌ఎస్, ఇండిపెండెంట్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లను దారికి తెచ్చుకొనేందుకు సామ, దాన, భేద, దండోపాయాలను ప్రయోగిస్తున్నది. స్వతంత్ర, బీఆర్‌ఎస్, ఇతర పార్టీల కౌన్సిలర్లను ఇష్టారాజ్యంగా ప్రలోభాలకు గురిచేస్తున్నది. పెద్దమొత్తంలో డబ్బు ఆశచూపుతూ పట్టపగలు ప్రజాస్వామ్య హననానికి ఒడిగడుతున్నది. సంగారెడ్డి జిల్లాలోని పలుచోట్ల ఏకంగా బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన వారిని కిడ్నాప్ చేసి రాజ్యాంగ విలువలను పాతరేసింది. అర్ధరాత్రి వేళ మఫ్టీలో ఉన్న పోలీసులను బీఆర్‌ఎస్ క్యాంపుల్లోకి ఉసిగొల్పి భయభ్రాంతులకు గురిచేస్తూ ప్రజాస్వామ్య ప్రక్రియకు తిలోదకాలిస్తున్నది.

రేవంత్‌రెడ్డి డైరెక్షన్.. పోలీసుల, శ్రేణుల ఓవరాక్షన్

ఇటీవల కాంగ్రెస్ ముఖ్య నేతలతో నిర్వహించిన సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎట్టి పరిస్థితుల్లో 90 శాతానికి పైగా మున్సిపాలిటీలను దక్కించుకోవాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, కీలక నేతలకు సూచించినట్టు వార్తలొచ్చాయి. ఈ నేపథ్యంలో ఆ పార్టీ నాయకులు రెచ్చిపోతున్నారు. ఎలాగైనా మేయర్/చైర్‌పర్సన్ పీఠాలను కైవసం చేసుకునేందుకు అక్రమాలకు పాల్పడుతున్నారు. పరిగి మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల శిబిరంలోకి శనివారం అర్ధరాత్రి 2 గంటలు దాటిన తర్వాత మఫ్టీలో ఉన్న ఓ పోలీసు చొరబడటం కలకలం సృష్టించింది. హైదరాబాద్ మణికొండలోని తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఇంటి వద్ద పోలీసులు దౌర్జన్యం చేస్తూ హల్‌చల్ చేశారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో గెలిచిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు క్యాంపునకు తరలివెళ్లారు. ఫోన్‌ట్యాపింగ్ ద్వారా తెలుసుకున్న పోలీసులు అక్కడికి మఫ్టీలో వెళ్లగా పార్టీ నాయకులు అడ్డుకున్నారు. సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ మున్సిపాలిటీ నుంచి గెలిచిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్‌ను పోలీసుల సాయంతో కాంగ్రెస్ గూండాలు బలవంతంగా తమ క్యాంపులోకి తీసుకెళ్లారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలో బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన అభ్యర్థులకు కాంగ్రెస్ డబ్బు ఆశచూపి తరలించేందుకు యత్నించినట్టు తెలిసింది.

జాతరలో గొడవలకు ఎత్తుగడలు

మున్సిపల్ పాలకవర్గాలు కొలువుదీరనున్న వేళ అధికార పార్టీ సరికొత్త ఎత్తుగడలకు పాల్పడుతున్నది. ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రాని చోట్ల గొడవలు సృష్టించి ఎన్నికను వాయిదా వేసేందుకు కుయుక్తులు పన్నుతున్నది. ముఖ్యంగా బీఆర్‌ఎస్‌కు అవకాశం ఉన్న మెదక్ జిల్లా పరిధిలోని మెదక్, తూప్రాన్, నర్సాపూర్ మున్సిపాలిటీలను దొడ్డిదారిన చేజిక్కించుకొనేందుకు యత్నిస్తున్నది. పోలీసులను ఎన్నికల విధుల నుంచి తప్పించి ఏడుపాయలు, ఇతర ప్రధాన శివాలయాల వద్ద జాతర బందోబస్తుకు పంపినట్టు తెలుస్తున్నది. ఇదే అదనుగా అధికార పార్టీ నాయకులు గొడవలకు దిగి ఎన్నిక ప్రక్రియను నిలిపివేసేలా పథకం రచించినట్టు బీఆర్‌ఎస్ నాయకులు అనుమానిస్తున్నారు.



శిబిరంలో మఫ్టీలో వచ్చిన కానిస్టేబుల్

బీఆర్‌ఎస్ శిబిరానికి మఫ్టీలో పోలీసు

పరిగి మున్సిపాలిటీకి చెందిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల శిబిరానికి అర్ధరాత్రి సమయంలో మఫ్టీలో ఉన్న ఓ పోలీసు తీవ్ర కలకలం సృష్టించింది. పరిగి మున్సిపాలిటీలో 18 వార్డులకు 8 వార్డుల్లో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, మరో 8 వార్డుల్లో కాంగ్రెస్ కౌన్సిలర్లు గెలుపొందారు. రెండు వార్డుల్లో స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక నేపథ్యంలో క్యాంపు రాజకీయాలు కొనసాగుతున్నాయి. పరిగి మున్సిపాలిటీలో గెలుపొందిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు చీరాలలో ఉన్నారు. శనివారం అర్ధరాత్రి వేళ మఫ్టీలో ఉన్న ఓ పోలీస్ అక్కడికి వెళ్లి సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించసాగాడు. దీంతో 'మీరెవరు? సీసీ టీవీ ఫుటేజీలను ఎందుకు చెక్ చేస్తున్నారు? చెక్ చేయడానికి వారెంట్ ఉన్నదా?' అని అక్కడే ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు భాస్కర్, అశోక్‌వర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు శ్రీనివాస్, రవికుమార్, వారాల రవి తదితరులు ప్రశ్నించారు. తనది వేటపాలెం అంటూ అతను పొంతనలేని సమాధానం చెప్తూ పారిపోయేందుకు యత్నించాడు. బీఆర్‌ఎస్ నాయకులు పట్టుకొని గట్టిగా నిలదీయడంతో తాను కానిస్టేబుల్‌నని ఒప్పుకొన్నాడు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

పైలట్ రోహిత్‌రెడ్డి అరెస్టుకు యత్నం

మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని ఆరోపిస్తూ, తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డిని అరెస్ట్ చేసేందుకు తాండూరు పోలీసులు ఆదివారం సాయంత్రం హైదరాబాద్ మణికొండలోని ఆయన నివాసానికి వెళ్లి అరెస్ట్ చేసేందుకు నానా హంగామా చేశారు. రోహిత్‌రెడ్డి నివాసాన్ని తాండూర్ నుంచి వచ్చిన 50 మంది పోలీసులు నిర్బంధించారు. ఇంటి బయట ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యానికి దిగారు. కొందరి సెల్‌ఫోన్లను లాక్కున్నారు. రోహిత్‌రెడ్డి ఇంట్లో తనిఖీలు చేపట్టి, ఆయనను అదుపులోకి తీసుకోవాలని ప్రయత్నించారు. ఆయన ఇంట్లో ఆయన లేకపోవడంతో రెండు గంటలపాటు తనిఖీలు చేసిన పోలీసులు వెనుతిరిగారు. ఉద్దేశపూర్వకంగానే కాంగ్రెస్ నాయకుల ఒత్తిళ్లతో పోలీసులు రోహిత్‌రెడ్డి ఇంటిని తనిఖీలు చేయడాన్ని బీఆర్‌ఎస్ నాయకులు తీవ్రంగా నిరసించారు. పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్ నాయకులపై వేధింపులను మానుకోవాలని డిమాండ్ చేశారు.

రోహిత్‌రెడ్డిపై కేసు అప్రజాస్వామికం: ఆనంద్, పంజుగుల

ఎన్నికల సమయంలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించారంటూ తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేయడం అప్రజాస్వామికమని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్, బీఆర్‌ఎస్ తాండూరు ఎన్నికల ఇన్‌చార్జి పంజుగుల శ్రీశైల్‌రెడ్డి ఆరోపించారు. పోలింగ్, ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎన్నికల నిబంధనలు పాటించకుండా కోడ్‌ను ఉల్లంఘించిన తాండూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితోపాటు ఆయన అనుచరులపైనా కేసు నమోదు చేయకపోవడం వివక్షే అని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కాకుండా బీఆర్‌ఎస్ నాయకులపై పోలీసులు కేసులు నమోదు చేయడమేమిటని ప్రశ్నించారు. పోలింగ్ సందర్భంగా ఓట్లను తారుమారు చేసేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో పాటు డీసీసీ అధ్యక్షుడు ధారాసింగ్, కాంగ్రెస్ నాయకులు కరణం పురుషోత్తం, మాజీ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, రవిగౌడ్ ప్రయత్నించారని ఆరోపించారు. కౌంటింగ్ సమయంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి వెళ్లారని ఆరోపించారు. ఆయా విషయాలపై తాము ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయగా, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. తమకు న్యాయం జరుగకుంటే తాము సుప్రీం కోర్టు వరకైనా వెళ్తామని వెల్లడించారు.

బీఆర్‌ఎస్, సీపీఐ శిబిరంపై దాడికి కాంగ్రెస్ గూండాల ప్లాన్!

- భద్రాచలంలో క్యాతన్‌పల్లి విజేతల శిబిరం ఏర్పాటు
- హోటల్‌లోకి పోలీసులతో వెళ్లేందుకు కాంగ్రెస్ యత్నం
- విషయం తెలిసి చెన్నూరు తరలించిన బాల్క సుమన్

భద్రాచలం/మంచిర్యాల, ఫిబ్రవరి 15: ఉమ్మడి కరీంనగర్ జిల్లా చెన్నూరు నియోజకవర్గం క్యాతనపల్లి మున్సిపాలిటీలో విజయం సాధించిన బీఆర్‌ఎస్, సీపీఐ కూటమి అభ్యర్థుల శిబిరంపై పోలీసులతో కలిసి దాడి చేసేందుకు కాంగ్రెస్ గూండాలు ప్లాన్ చేశారు. ఈ విషయాన్ని ముందుగానే తెలుసుకొన్న చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వెంటనే అప్రమత్తమై వారిని భద్రాచలం నుంచి చెన్నూరులోని తన నివాసానికి తరలించారు. ఈ ఘటన భద్రాద్రి జిల్లా భద్రాచలంలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్నది. క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, సీపీఐ కూటమిగా పోటీచేశాయి. కాంగ్రెస్ నుంచి ప్రమాదం పొంచి ఉండటంతో ఆ కూటమి అభ్యర్థులతో కలిసి బాల్క సుమన్ శనివారమే భద్రాచలం పట్టణానికి చేరుకొన్నారు. శనివారం ఓ హోటల్లోని శిబిరంలో అభ్యర్థులతో కలిసి బస చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఆ విజేతలను ఆదివారం అదే భద్రాచలంలోని మరో హోటల్‌లోని శిబిరంలోకి మార్చారు. అయినా పసిగట్టిన కాంగ్రెస్ గూండాలు స్థానిక పోలీసుల సాయంతో బీఆర్‌ఎస్, సీపీఐ కూటమి విజేతల శిబిరంపై దాడి చేసేందుకు ప్లాన్ చేశారు. ఈ విషయాన్ని ముందుగానే తెలుసుకొన్న బాల్క సుమన్.. వెంటనే వారిని ప్రత్యేక వాహనాల్లో ఆదివారం అర్ధరాత్రికి చెన్నూరులోని తన నివాసానికి చేరుకొన్నారు.

చెన్నూరులో ప్రజాస్వామ్యం ఖూనీ: బాల్క సుమన్

చెన్నూరు నియోజకవర్గంలో మంత్రి వివేక్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ మాజీ విప్ బాల్క సుమన్ ఆరోపించారు. ఆదివారం రాత్రి చెన్నూరులోని 63వ జాతీయ రహదారిపై మీడియాతో మాట్లాడారు. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్, సీపీఐ కూటమికి చెందిన 14మంది కౌన్సిలర్ల శిబిరంపై కాంగ్రెస్ పార్టీ దాడికి యత్నించిందని ఆరోపించారు. ప్రజలు అధికార పార్టీకి వ్యతిరేకంగా తీర్పునిచ్చారని, ఎలాగైనా మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠాన్ని దక్కించుకొనేందుకు అధికార కాంగ్రెస్ విశ్వప్రయత్నాలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు.



తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్. చిత్రంలో బీఆర్‌ఎస్ నేత పల్లె రవికుమార్, గాయకుడు సందీప్

బీఆర్‌ఎస్ క్యాంపులపై ట్యాపింగ్ కుట్ర

- అధికారం కోసం అడ్డదారులు తొక్కుతున్న హస్తం పార్టీ
- బీఆర్‌ఎస్ కౌన్సిలర్లపై దాడులు, కిడ్నాప్‌లకు విఫల యత్నాలు
- ఫోన్ ట్యాప్ చేయించి పోలీసులను పంపుతున్నారు
- బెదిరించి అనుకూలంగా ఓటేయించేలా కుట్ర!
- పోలీసులను బూతులు తిట్టినా అరెస్టు చేయలేరా..?
- బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజం

హైదరాబాద్, ఫిబ్రవరి 15(నమస్తే తెలంగాణ) : అధికారం కోసం కాంగ్రెస్ అడ్డదారులు తొక్కుతున్నదని బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజమెత్తారు. క్యాంపులకు వెళ్లిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల ఫోన్లను ట్యాపింగ్ చేయించి అక్కడికి పోలీసులను పంపుతున్నదని దుయ్యబట్టారు. కొన్నిచోట్లకు మఫ్టీలో కూడా పంపారంటూ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సోమవారం చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఓటింగ్ జరుగుతున్న నేపథ్యంలో క్యాంపుల నుంచి బస్సుల్లో తిరిగి వచ్చే కౌన్సిలర్లను తనిఖీల పేరుతో పోలీసులు అడ్డగించి, బలవంతంగా కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓటు వేయించే కుట్రలు పన్నినట్టు తెలిసిందని చెప్పారు. ఈ నేపథ్యంలో హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీల్లో మేయర్, చైర్మన్ ఎన్నికల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, సజావుగా జరుపాలని డిమాండ్ చేశారు.

మున్సిపోల్‌లో కాంగ్రెస్ అరాచకం

మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ అరాచకాలకు పాల్పడిందని, డబ్బు మూటలు పంపిణీ చేసినా కేవలం 51శాతం వార్డుల్లోనే ఆ పార్టీ గెలిచిందని ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. కానీ ప్రతిపక్షంలో ఉన్న బీఆర్‌ఎస్‌ను ప్రజలు ఆదరించారని, ప్రజాసమస్యల కోసం పోరాడినందుకు 788 వార్డుల్లో విజయం కట్టబెట్టారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌కు ఓట్లేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. 2020 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 110 మున్సిపాలిటీలు గెలిస్తే, కాంగ్రెస్ పార్టీకి నాలుగంటే నాలుగే వచ్చాయని గుర్తుచేశారు.

జగ్గారెడ్డి, అరవింద్‌లను ఎందుకు అరెస్టు చేయలేదు

మున్సిపల్ ఎన్నికల సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్.. పోలీసులను పచ్చి బూతులు తిట్టినా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు కేసులు నమోదు చేయలేదని ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. అధికార కాంగ్రెస్, బీజేపీ కలిసి పనిచేస్తున్నాయని చెప్పేందుకు ఇదే నిదర్శనమని ఆరోపించారు. ఈ విషయం లో ఐఏఎస్, ఐపీఎస్, ఉద్యోగ సంఘాలు ఎందుకు మౌనంగా ఉన్నాయని ఆయన ప్రశ్నించారు. ఎన్నో దశాబ్దాల నుంచి హోంగార్డులుగా సేవలందిస్తున్న వారిని జగ్గారెడ్డి బూతులు తిట్టినా ఎన్నికల సంఘం మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏం కోరుకుంటున్నారో ఏమో కానీ, కొన్ని పత్రికలు మాత్రం విషం చిమ్ముతున్నాయని ఆరోపించారు. ఫార్ములా ఈ-రేసులో మళ్లీ లీకులు ఇస్తున్నారంటూ మండిపడ్డారు. ఏమైనా చేసి, హంగ్ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ గెలువాలని రేవంత్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. చేర్యాలలో భార్య బీఆర్‌ఎస్ నుంచి కౌన్సిలర్‌గా పోటీ చేస్తే, భర్తను సస్పెండ్ చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. కాగజ్‌నగర్‌లో ఎమ్మెల్సీ దండే విఠల్ ఓటు వేయకపోయినా, అతనికి అక్కడే ఎక్స్ అఫీషియో ఓటు హక్కు ఎలా కల్పించారని ఆశ్చర్యం వ్యక్తంచేశారు. విఠల్‌కు వాస్తవంగా సనత్‌నగర్‌లో ఓటు ఉన్నదని, రాత్రికి రాత్రే ఎక్స్‌అఫీషియో ఓటు ఎలక్టోరల్‌లో ఎలా యాడ్ చేస్తారని ప్రశ్నించారు. విప్ జారీ చేసినా పరిగణనలోకి తీసుకోవడం లేదని మండిపడ్డారు. వికారాబాద్‌లో అధికారిక సమావేశంలో హస్తం గుర్తుకే ఓటు వేయాలని స్వయంగా సీఎం చేసిన ప్రచారంపై ఈసీ ఎందుకు చర్య తీసుకోలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేత పల్లె రవికుమార్, గాయకుడు సందీప్ పాల్గొన్నారు.

తొర్రూరు మున్సిపల్ పీఠం బీఆర్‌ఎస్‌దే

- కాంగ్రెస్ మోసపూరిత ప్రచారాలు నమ్మొద్దు
- తొర్రూరులో ఎక్స్‌అఫీషియో ఓట్లు చెల్లవు : ఎర్రబెల్లి దయాకర్



తొర్రూరు, ఫిబ్రవరి 15: కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో చేసే అసత్య ప్రచారాన్ని నమ్మొద్దని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రజలను కోరారు. తొర్రూరు మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లతో కలిసి ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఎర్రబెల్లి మాట్లాడారు. తొర్రూరు మున్సిపాలిటీలో 16 వార్డులకు గాను 9 వా ర్డుల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలిచారని, వీరిలో ఇద్దరు కాంగ్రెస్‌లో చేరినట్టు ఆ పార్టీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎక్స్‌అఫీషియో ఓట్లపై కూడా కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తున్నదని అన్నారు. గతంలో ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉండేదని, అయితే సుప్రీంకోర్టు ఆదేశాలను తప్పుగా అర్థం చేసుకొని కాంగ్రెస్ పార్టీ తొర్రూరులో ఎక్స్‌అఫీషియో ఓటును వినియోగించకుండా అడ్డుకుంటున్నదని ఆరోపించారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రకు అవకాశం లేకుండా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మరోవైపు ఎంపీ కడియం కావ్య ఎక్స్‌అఫీషియో ఓటును వరంగల్‌లో నమోదు చేసుకోగా, దానిని తిరస్కరించి తొర్రూరులో నమోదు చేసుకున్నదని దుష్ప్రచారం జరుగుతున్నదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా దుష్ప్రచారాలు మానుకోవాలని హెచ్చరించారు.

నేడు 'పుర'పాలకవర్గాల కొలువు

- 11 గంటలకు సభ్యుల ప్రమాణం
- 12:30 గంటలకు మేయర్ చైర్‌పర్సన్లు.. ఆ తర్వాత డిప్యూటీ మేయర్, వైఎస్ చైర్‌పర్సన్ల ఎన్నిక

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో సోమవారం కొత్త పాలకవర్గాలు కొలువుదీరనున్నాయి. ఇందుకు రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ అన్ని ఏర్పాట్లు చేసింది. ఆయా జిల్లాల కలెక్టర్ల పర్యవేక్షణలో ఈ ప్రక్రియను పూర్తిచేసేందుకు రంగం సిద్ధమైంది. 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల ఎన్నిక ఫలితాలు 13న ఫలితాలు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోమవారం 11 గంటలకు నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు, కార్పొరేటర్లతో సంబంధిత కమిషనర్లు ప్రమాణం చేయిస్తారు. అనంతరం చైర్మన్/వైఎస్ చైర్మన్, మేయర్/డిప్యూటీ మేయర్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేస్తారు. కోరం(సగం మంది ఎన్నికైన సభ్యులు)హాజరైతే మధ్యాహ్నం 12:30 గంటలకు చైర్మన్/వైఎస్ చైర్మన్, మేయర్/డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రక్రియకు ఉపక్రమిస్తారు. కోరం లేకుంటే ఎన్నికను మరో రోజుకు వాయిదా వేస్తారు.

చేతులెత్తే విధానంలో ఎన్నిక..

ఎన్నికైన వార్డు సభ్యులు మాత్రమే మేయర్ లేదా చైర్‌పర్సన్ పదవులకు పోటీ చేయడానికి అర్హులు. రిజర్వేషన్లు అమలులో ఉన్నచోట ఆయా క్యాటగిరీల వ్యక్తులు మాత్రమే పోటీ చేయాలి. చేతులెత్తడం ద్వారా ఎన్నిక జరుగనున్నది. మొదట మేయర్ లేదా చైర్‌పర్సన్ ఎన్నిక ఉంటుంది. ఆ తర్వాత డిప్యూటీ మేయర్ లేదా వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక చేపడతారు. ఒకే అభ్యర్థి ఉంటే ఏకగ్రీవంగా ప్రకటిస్తారు. ఒకరి కంటే ఎక్కువ మంది ఉంటే ఎక్కువ ఓట్లు వచ్చిన వారిని విజేతగా ప్రకటిస్తారు. ఓట్లు సమానంగా వస్తే లాటరీ ద్వారా విజేతను నిర్ణయిస్తారు.

పార్టీ అభ్యర్థులకు విప్ జారీ..

ఆయా పార్టీలు తమ సభ్యులకు నిర్దిష్ట అభ్యర్థికే ఓటు వేయాలని విప్ జారీ చేస్తాయి. ఒకవేళ ఎవరైనా సభ్యుడు పార్టీ విప్ పాటించకుండా వేరే వారికి ఓటు వేస్తే, వారి సభ్యత్వం రద్దవుతుంది. విప్ ఉల్లంఘనపై పార్టీలు మూడు రోజుల్లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలి. కలెక్టర్ వారంలో సదరు సభ్యుడి వివరణ కోరతారు. సరైన సమాధానం ఇవ్వకపోతే సభ్యత్వం రద్దు చేస్తారు. కానీ, వారు వేసిన ఓటు మాత్రం చెల్లుబాటు అవుతుంది.

ఎక్స్ అఫీషియో సభ్యులు కీలకం..

ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఓటు వేసే అధికారం కలిగి ఉంటారు. ప్రస్తుతం ఎక్స్ అఫీషియో సభ్యుల ఓటింగ్ నిబంధనల్లో మార్పులు చేశారు. గతంలో రాజ్యసభ ఎంపీ, ఎమ్మెల్సీలు ఏ మున్సిపాలిటీ లేదా కార్పొరేషన్‌లోనైనా ఓటువేసే అవకాశం ఉండగా, దానిని మార్చి ఆయా మున్సిపాలిటీల పరిధిలోని సభ్యులకే ఓటు వేసే అవకాశం కల్పించారు.

కాంగ్రెస్, కమలం హగ్గింగ్!

మొదటిపేజీ తరువాయి...

కన్నేశారు. ఇప్పటికే బీజేపీలో తనకు అనుకూలంగా ఉన్న పలువురు ముఖ్యనేతల వద్దకు తన దూతలుగా పలువురు మంత్రులను పంపించారు. ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, కరీంనగర్ జిల్లాల్లో కాంగ్రెస్, బీజేపీ ఇచ్చిపుచ్చుకునే ధోరణితో పనిచేయాలనే అవగాహనకు వచ్చినట్టు తెలిసింది. ఈ మేరకు నిర్దిష్టమైన అవగాహనను ఆదివారం కుదుర్చుకున్నట్టు సమాచారం. ఇలా బీజేపీతో ఒప్పందం చేసుకుంటే, తమకు కనీసం 12 మున్సిపాలిటీలు, ఒక కార్పొరేషన్ దక్కుతుందని కాంగ్రెస్ అంచనా వేస్తున్నది. బీజేపీతో పొత్తు పెట్టుకోవడం కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతానికి వ్యతిరేకం. కానీ, ఇక్కడ ఎలాగైనా అధికారాన్ని చేజిక్కించుకోవాలని భావిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీజేపీతో అనైతిక బంధానికి తెరతీశారు. కాంగ్రెస్ పార్టీకి అనేక మున్సిపాలిటీల్లో చైర్మన్, మేయర్ పదవులకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ రాలేదు. బీఆర్‌ఎస్ పార్టీకి ఆయా స్థానాలు దక్కకుండా చేసేందుకు ఏకంగా బీజేపీతో ముఖ్యమంత్రి లోపాయికారి ఒప్పందానికి తెరతీశారు.

కాంగ్రెస్‌కు చైర్మన్, బీజేపీ వైస్‌చైర్మన్

ఇప్పటికే మెదక్ మున్సిపల్ చైర్మన్ విషయంలో కాంగ్రెస్, బీజేపీ ఒక అవగాహనకు వచ్చి చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులు పంచుకోవాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఇక్కడ వాస్తవానికి బీఆర్‌ఎస్ పార్టీ 15 వార్డులు గెల్చుకున్నది. కాంగ్రెస్ 14 వార్డులే గెలుచుకున్నది. బీజేపీ రెండు వార్డులు కైవసం చేసుకున్నది. ఇక్కడ బీజేపీ కాంగ్రెస్ పార్టీని బలపర్చాలని నిర్ణయించింది. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి చైర్మన్ కానున్నారు. నర్సాపూర్‌లో కూడా బీజేపీ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నట్టు స్థానిక కాంగ్రెస్ నేతలు చెప్తున్నారు. వాస్తవానికి, ఇక్కడ బీఆర్‌ఎస్ పార్టీ అత్యధిక వార్డులు గెలుపొందింది. మెట్‌పల్లిలో బీజేపీకి కాంగ్రెస్ మద్దతు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారని చెప్తున్నారు. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్‌లో కాంగ్రెస్, బీజేపీ కలిసి చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు పంచుకోనున్నాయి. ఇక్కడ వాస్తవానికి బీఆర్‌ఎస్ పార్టీకి 11 వార్డులు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీకి 9, బీజేపీకి 5 స్థానాలు వచ్చాయి. కానీ, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ బీజేపీ సహకారంతో చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులు సాధించుకోబోతున్నది. రాష్ట్రంలోని మరికొన్ని మున్సిపాలిటీల్లో కూడా బీజేపీతో కాంగ్రెస్ పార్టీ అనైతిక పొత్తులకు తెరతీసింది.

ఎంఐఎంతోనూ అవగాహన


గతంలో ఎన్నడూలేనివిధంగా కాంగ్రెస్ పార్టీ బీజేపీతో కలువడంపై కాంగ్రెస్ పార్టీ సీనియర్లు పెదవి విరుస్తున్నారు. జాతీయ స్థాయిలో రాహుల్‌గాంధీ ఒకవైపు బీజేపీపై పోరాటం చేస్తుంటే, మరోవైపు రాష్ట్రంలో నేరుగా బీజేపీతో పొత్తు పెట్టుకోవడం, పదవులు పంచుకోవడం విడ్డూరమని సీనియర్ కాంగ్రెస్ నేతలు చెప్తున్నారు. ఒకవైపు ఎంఐఎం, మరోవైపు బీజేపీతో కాంగ్రెస్ జత కట్టడంపై పార్టీ కార్యకర్తలు, నేతలు కూడా ఆశ్చర్యపోతున్నారు. రాష్ట్రంలో పలు మున్సిపాలిటీల్లో ఎంఐఎంతో కూడా కాంగ్రెస్ పొత్తు పెట్టుకుంటున్నది. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ పార్టీకి బీజేపీ పరోక్షంగా సహకరిస్తున్నది. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ ఎంఐఎంతో కలిసి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోబోతున్నది. మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో ఎంఐఎంతో కాంగ్రెస్ పదవులు పంచుకోబోతున్నది. ఎంఐఎంతో అంటే అవగాహన ఉన్నది, ఫర్వాలేదు కానీ, బీజేపీతో కూడా జతకట్టడం పార్టీ కార్యకర్తలకు ఎలాంటి సంకేతం ఇస్తుందనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బీజేపీ, ఎంఐఎంపై ఆధారపడి హంగ్ మున్సిపాలిటీలను సాధించుకొనేందుకు ఆపసోపాలు పడాల్సి వస్తున్నదని కాంగ్రెస్ నేతలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఒకవైపు బలప్రయోగం చేసి ప్రత్యర్థి బీఆర్‌ఎస్ శిబిరం నుంచి కౌన్సిలర్లను ఎత్తుకొని రావడం, బీజేపీతో అంటకాగడంపై పార్టీలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తూప్రాన్‌లో కాంగ్రెస్ శిబిరానికి బీజేపీ కౌన్సిలర్లు

కాంగ్రెస్ పార్టీ శిబిరానికి తూప్రాన్‌లో బీజేపీ బీ ఫారంపై గెలిచిన ముగ్గురు కౌన్సిలర్లను తరలించినట్టు తెలిసింది. వాస్తవానికి ఇక్కడ బీఆర్‌ఎస్ పార్టీకి 9 మంది కౌన్సిలర్ల మద్దతు ఉన్నది. కాంగ్రెస్ నుంచి నలుగురు, బీజేపీ నుంచి మరో ముగ్గురు కౌన్సిలర్లు మాత్రమే గెలిచారు. ఏరకంగా చూసినా ఇక్కడ బీఆర్‌ఎస్ గెలవడం ఖాయం. అయితే, ఆదివారం సాయంత్రం బీజేపీకి చెందిన ఓ కీలక ప్రజాప్రతినిధి చొరవ తీసుకొని ముగ్గురు బీజేపీ కౌన్సిలర్లను కాంగ్రెస్ శిబిరానికి తరలించినట్టు తెలిసింది. సోమవారం జరిగే చైర్మన్ ఎన్నిక సమయానికి ఏదోరకంగా చేసి బీఆర్‌ఎస్‌కు చైర్మన్ పదవి రాకుండా అడ్డుకోవాలని, బీజేపీ, కాంగ్రెస్‌కు కలిపి ఉన్న ఏడుగురు సభ్యుల బలంతో ఈ స్థానాన్ని సాధించుకోవాలని కాంగ్రెస్ ముఖ్యనేత, బీజేపీలోని ఓ కీలక ప్రజాప్రతినిధి కలిసి వ్యూహం రచిస్తున్నట్టు తెలిసింది. తూప్రాన్‌లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే కేసీఆర్ ఇలాకాలో కూడా గెలిచినట్టు చెప్పుకోవచ్చని, అందుకే ఇక్కడ బీజేపీతో లోపాయికారి ఒప్పందం చేసుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

భువనగిరిలో కాంగ్రెస్ అరాచకం

- ఓట్లు వేయలేదని పద్మశాలీల ఇండ్లపై బీరు సీసాలతో దాడి
- కాంగ్రెస్ ఇచ్చిన హాట్ బాక్స్‌లు, చీరలు బయటకు విసిరేసిన ఓటర్లు
- పోలీస్ స్టేషన్ ఎదుట బాధితుల ఆందోళన.. పోలీసులకు ఫిర్యాదు



అర్బన్ కాలనీ నుంచి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ తీస్తున్న పద్మశాలి కుటుంబాలు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 15. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని ఒకటో వార్డు అర్బన్‌కాలనీలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏలే భువనేశ్వరి గెలుపొందింది. ఈ క్రమంలో ఓటమి పాలైన వల్లభోజు స్వరూపారాణి కి సంబంధించిన బంధువు, ఒకటో వార్డు మాజీ కౌన్సిలర్, ప్రస్తుత రెండో వార్డు కౌన్సిలర్ పాలిశెట్టి అనిల్‌కుమార్ శనివారం రాత్రి కాలనీ ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థికి ఓటువేయలేదని దుర్భాషలాడుతూ విరుచుకుపడ్డారు. శనివారం రాత్రి తన అనుచరులతో కలిసి పద్మశాలీ కులస్తుల ఇండ్లపైన ఖాళీ బీరుసీసాలతో దాడులకు పాల్పడ్డారు. దీంతో పద్మశాలీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఓటర్లను ఆకర్షించేందుకు కాంగ్రెస్ అభ్యర్థి పంచిపెట్టిన చీరలు, హాట్ బాక్స్‌లను రోడ్డు మీద పడవేశారు. ర్యాలీగా వెళ్లి పీఎస్ ఎదుట ఆందోళనచేశారు. కాంగ్రెస్ నాయకులతో తమకు ప్రాణభయం ఉందని స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

కడియం కావ్య డబుల్ ఓటు!

- మున్సిపల్ చైర్మన్ కోసం తొండి
- తొర్రూరు మున్సిపాలిటీలో ఎంపీ కావ్య ఓటు నమోదు
- ఏడాది క్రితమే గ్రేటర్ వరంగల్‌లో ప్రమాణం
- ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసిన బీఆర్‌ఎస్ నాయకులు



గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా ప్రమాణం చేస్తున్న వరంగల్ ఎంపీ కడియం కావ్య

మహబూబాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ తొండి రాజకీయం చేస్తున్నదని బీఆర్‌ఎస్ ఆరోపిస్తున్నది. బీఆర్‌ఎస్ పార్టీకి సంపూర్ణ మెజారిటీ వచ్చిన మున్సిపాలిటీలను కూడా దక్కకుండా చేసేందుకు కుట్రలు పన్నుతున్నదనే విమర్శలొస్తున్నాయి. వరంగల్ ఎంపీ కడియం కావ్య ఎక్స్‌అఫీషియో ఓట్లు రెండు చోట్ల నమోదు చేసుకోవడం విమర్శలకు తావిస్తున్నది. గత సంవత్సరం జనవరి 29న వరంగల్ నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశానికి వరంగల్ ఎంపీ కడియం కావ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. కడియం కావ్య వరంగల్ కార్పొరేషన్‌లో ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా ఉండగానే, ప్రస్తుతం తొర్రూరు మున్సిపాలిటీలో ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా దరఖాస్తు చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని తొర్రూర్ 3వ వార్డు కౌన్సిలర్ తూర్పాటి రవి పేర్కొన్నారు. వరంగల్ కార్పొరేషన్‌లో ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా ఉండగానే, తొర్రూరు మున్సిపాలిటీలో ఆమెకు అవకాశం కల్పించొద్దని కోరుతూ తొర్రూరు మున్సిపాలిటీ ప్రీసైడింగ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నెల 11న నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల్లో తొర్రూరులో 16 వార్డులకు 9 వార్డులు బీఆర్‌ఎస్, 7 వార్డులు కాంగ్రెస్ గెలిచింది. పాలకుర్తి ఎమ్మెల్యే ఓటుతో కలిపి బీఆర్‌ఎస్‌కు 9, కాంగ్రెస్‌కు 8 ఓట్లు ఉంటాయి. కడియం కావ్య ఓటు కూడా నమోదైతే రెండు పార్టీల బలం సమానమయ్యే అవకాశం ఉంటుంది.

హైదరాబాద్‌కు జగిత్యాల పంచాయితీ

- మాజీ మంత్రి జీవన్‌రెడ్డితో ఏఐసీసీ సెక్రటరీ సవాంత్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ భేటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తేతెలంగాణ): జగిత్యాల మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఎన్నికపై పీఠముడి చిక్కు వీడలేదు. పదవిపై మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ పట్టు వీడలేదు. దీంతో పంచాయితీ హైదరాబాద్ పార్టీ అధిష్ఠానం వద్దకు చేరింది. తమ వర్గానికే చైర్మన్ పదవి దక్కాలని ఎవరికి వారుగా పట్టుపడుతున్నారు. జీవన్‌రెడ్డి నేరుగా ప్రజాభవన్‌కు వెళ్లి ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథన్ సవాంత్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో తన సభ్యులతో కలిసి భేటీ అయ్యారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలు, ఎమ్మెల్యే పనితీరుపై అధిష్ఠానం ప్రతినిధులకు వివరించారు. ఒకవైపు జీవన్‌రెడ్డితో చర్చలు జరుగుతుండగానే.. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో కూడా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఫోన్ ద్వారా మాట్లాడారు. ఇదిలా ఉండగా, ఇరువర్గాలకు చెరి రెండున్నరేండ్లు చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవులను కట్టబెట్టేందుకు నిర్ణయించినట్టు తెలిసింది. తొలి విడత తమకే అవకాశమివ్వాలని జీవన్‌రెడ్డి, సంజయ్ పట్టుబట్టడంతో సీల్డ్‌కవర్‌లో పంపుతామని తేల్చి చెప్పినట్టు తెలిసింది. ఇదే సమయంలో తనకు అన్యాయం జరిగిందని కాంగ్రెస్ సీనియర్ కౌన్సిలర్ మీడియా ముందుకు వచ్చే అవకాశం ఉన్నది.

రష్యా చమురు కొనుగోలు
నిలిపేస్తామని భారత్ హామీ
అమెరికా విదేశాంగ మంత్రి రూబియో

మ్యూనిచ్, ఫిబ్రవరి 15: రష్యా నుంచి చమురు కొనుగోలును నిలిపివేయడానికి భారత్ కట్టుబడి ఉందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో తెలిపారు. జర్మనీలోని మ్యూనిచ్‌లో జరిగిన రక్షణ సమావేశంలో రూబియో మాట్లాడుతూ 'భారత్‌తో మేము జరిపిన చర్చల్లో రష్యా నుంచి చమురును కొనుగోలు చేయమన్న హామీ వారి నుంచి లభించింది' అని ప్రకటించారు. ఇటీవల భారత్‌తో జరిగిన వాణిజ్య ఒప్పందం సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఇదే విషయం ప్రకటించారు. రష్యా నుంచి చమురు కొనుగోలును భారత్ నిలిపివేస్తుందని ఇప్పటికే పలుసార్లు అమెరికా ప్రకటించింది.

అమెరికాలో అదృశ్యమైన భారతీయ విద్యార్థి మృతి

కాలిఫోర్నియా: అమెరికాలో ఈ నెల 9న అదృశ్యమైన భారతీయ విద్యార్థి శవమై కన్పించాడు. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం బర్కిలీలో చదువుతున్న 22 ఏండ్ల సాకేత్ శ్రీనివాసయ్య ఈ నెల 9 నుంచి అదృశ్యమయ్యాడు. అతను మృతదేహమై కన్పించినట్టు శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత రాయబార కార్యాలయం ఆదివారం వెల్లడించింది. శ్రీనివాసయ్య చివరిసారిగా బర్క్‌లీహిల్స్‌లోని అనాజ లేక్ సమీపంలో కన్పించాడు. ల్యాప్‌టాప్, పాస్‌పోర్ట్ ఉన్న అతడి బ్యాగ్ పొరుగున ఉన్న వారి ఇంటి గుమ్మం ముందు కన్పించింది. కర్ణాటకకు చెందిన శ్రీనివాసయ్య ఐఐటీ మద్రాస్‌లో కెమికల్ ఇంజనీరింగ్ చేశాడు. ప్రస్తుతం అతడు యూసీ బర్క్‌లీలో కెమికల్, బయో మాలిక్యులర్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ చేస్తున్నాడు.

17 మంది పాక్ సైనికులను నిర్బంధించిన బీఎల్ఏ
ఖైదీల మార్పిడికి అల్టిమేటం

ఇస్లామాబాద్: తాము 17 మంది పాకిస్థాన్ సైనికులను నిర్బంధించినట్టు పాకిస్థాన్‌లోని బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) ఆదివారం ప్రకటించింది. అనంతరం 10 మందిని విడుదల చేస్తూ మిగిలిన ఏడుగురిని విడుదల చేయడానికి ఖైదీల మార్పిడి ఒప్పందాన్ని వారంలోగా చేసుకోవాలని డిమాండ్ చేసింది. ఇది ఆపరేషన్ హరాఫ్ రెండో దశ అని బీఎల్ఏ మీడియా వింగ్ హక్కాయ్ అధికార ప్రతినిధి జీయంద్ బలూచ్ పేర్కొన్నారు. నిర్బంధంలో ఉన్న మిగిలిన ఏడుగురు పాకిస్థాన్ ఆర్మీ రెగ్యులర్ యూనిట్‌కు చెందిన వారు. వారిపై బలూచ్ జాతీయ కోర్టులో వివిధ ఆరోపణలపై విచారణ జరిగింది.

ఆంక్షలు ఎత్తేస్తే.. అణు కార్యక్రమంపై రాజీ
అమెరికాకు ఇరాన్ ప్రతిపాదన

టెహ్రాన్: తమ అణు కార్యక్రమంపై రాజీకి ఇరాన్ తలుపులు తెరిచింది. తమపై ఆంక్షలు ఎత్తివేస్తే అమెరికాతో ఈ విషయమై రాజీ కుదుర్చుకొనేందుకు సిద్ధమని ప్రతిపాదించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చోటు చేసుకొన్న వేళ ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి మజిద్ తఖ్త్-రవంచి ఈ విషయాన్ని వెల్లడించారు. ఇటీవల బీబీసీ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ఒప్పందం చేసుకొనే విషయంలో అమెరికానే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ఇరు దేశాల మధ్య మలి విడత చర్చలు ఈ నెల 17న జెనీవాలో ప్రారంభం కానున్నాయి. ఇరాన్ అణ్వాయుధాన్ని అభివృద్ధి చేసే దిశగా కదులుతున్నదన్న ఆరోపణలను ఇరాన్ తిరస్కరిస్తూ వస్తున్నది.

ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మాన చర్చ మార్చి 9న

న్యూఢిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను పదవి నుంచి తొలగించేందుకు విపక్షాలు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానంపై పార్లమెంట్ మలి విడత బడ్జెట్ సమావేశాల తొలి రోజైన మార్చి 9న చర్చ, ఓటింగ్ ఉంటాయని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజు ఆదివారం తెలిపారు. నిబంధనల ప్రకారం సమావేశాల తొలి రోజే ఈ చర్చ చేపట్టాలని చెప్పారు. ఓం బిర్లా స్పష్టంగా విపక్షాలపై పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నారని విపక్షం ఆరోపించి ఆయనపై అవిశ్వాసానికి నోటీస్ ఇవ్వడంతో చర్చ అనివార్యమైంది. కాగా, మార్చి 9 నుంచి ఏప్రిల్ 2 వరకు బడ్జెట్ మలి విడత సమావేశాలు ఉంటాయని కిరణ్ రిజుజు తెలిపారు.

రైతులపై ట్రేడ్ డీల్ పిడుగు!
ఒప్పందం అమల్లోకి రాకముందే పత్తి, సోయాబీన్ ధరలు పతనం

- అన్నదాతల్లో తీవ్ర ఆందోళన
- 18 శాతం సుంకాలను గొప్పగా చెప్పకోవడం తప్పదారి పట్టించడమే
- కేంద్రంపై రైతు సంఘాల ఆగ్రహం



మైసూరులో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పంద ముసాయిదాను కాల్చి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: అమెరికాతో మోదీ సర్కారు కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందం రైతులకు శరాఘాతంలా మారింది. ఒప్పందం ఇంకా అమల్లోకి రాకముందే దాని ప్రభావం రైతులపై పడుతున్నది. పత్తి, సోయాబీన్ ధరలు భారీగా పతనం కావడమే ఇందుకు ఉదాహరణ. ఈ రెండు పంటలను నాగ్‌పూర్ ప్రాంతంలో భారీగా పండిస్తారు. ధరల భారీ పతనానికి భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందమే కారణమని వ్యాపార వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం పత్తి పంట కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) క్వింటాల్‌కు రూ.8,100 ఉండగా, దేశీయ ఓపెన్ మార్కెట్లో రూ.7,200 నుంచి రూ. 6,700 పలికింది. అలాగే సోయాబీన్ ఎంఎస్‌పీ క్వింటాల్‌కు రూ. 5,300 ఉండగా, ఓపెన్ మార్కెట్లో 5,000కు పడిపోయింది. ఒక దశలో ఇది రూ.4,200కు దిగజారి తర్వాత కోలుకుంది. దీనిపై రైతు సంఘం శెత్‌కారీ సంఘటన తీవ్ర అందోళన వ్యక్తం చేసింది. గతంలో మోదీ ప్రభుత్వం మూడు రైతు నల్ల చట్టాలు తెచ్చినప్పుడు ఈ సంఘం ప్రభుత్వానికి మద్దతుగా నిలిచింది. అయితే శనివారం ఆ సంఘం అధ్యక్షుడు అనియ్ ఘనావత్ మాట్లాడుతూ మక్కజొన్న, బియ్యం నుంచి తయారైన డీడీజీఎస్ వల్ల సోయాబీన్ ధరలపై ప్రభావం పడిందని అన్నారు. పత్తి, మక్కజొన్న నుంచి తయారయ్యే డీడీజీఎస్ (ఇథనాల్ తయారీ తర్వాత మిగిలే, ఎండబెట్టే ధాన్య అవశేషం) సోయాబీన్‌కు పోటీదారుగా ఉద్భవించిందని అన్నారు. ఈ రెండింటినీ పశువుల దాణాగా ఉపయోగిస్తారు. ఒక వేళ డీడీజీఎస్‌ను కనుక అమెరికా నుంచి ఎలాంటి సుంకాలు లేకుండా దిగుమతి చేసుకుంటే అది కేవలం సోయాబీన్ పైనే కాదు, మక్కజొన్నపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన తెలిపారు.

ఎంఎస్‌పీ కన్నా దిగజారిన ధరలు

వాణిజ్య ఒప్పందం ప్రభావం ఇప్పటికే సోయాబీన్, కాటన్ దేశీయ మార్కెట్లపై పడిందని ప్రముఖ హక్కుల కార్యకర్త విజయ్ జవాన్దియా తెలిపారు. వీటి ధరలు ఇప్పటికే ఎంఎస్‌పీ కన్నా తక్కువకు దిగజారాయన్నారు. పత్తిని కొనుగోలు చేసి జిన్నింగ్ మిల్లులకు ఇచ్చే వారు ఇప్పటికే ధరలు తగ్గించారని, వారు అమెరికాతో వాణిజ్య ఒప్పందాన్ని కారణంగా చూపుతున్నారని అన్నారు. దీంతో కొందరు రైతులు నేరుగా తమ పత్తిని జిన్నింగ్ మిల్లులకు అమ్ముతూ కొద్దిగా ఎక్కువ మొత్తం పొందుతున్నారని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో జిన్నింగ్ యజమానులు కూడా ఎక్కువ మొత్తం చెల్లించే పరిస్థితి లేదన్నారు. యావత్మల్‌కు చెందిన రైతు మనీశ్ జాదవ్ మాట్లాడుతూ చాలామంది రైతులు ఇప్పటికే తాము పండించిన సోయాబీన్‌ను అమ్మేశారని, కొద్ది మొత్తంలో పత్తి మాత్రం మిగిలి ఉందన్నారు. ఇప్పుడైతే తమకు నష్టాలు తప్పవని, అయితే ఈ ధరల పతనం చూస్తే భవిష్యత్ తలచుకుంటే భయమేస్తుందని అన్నారు. ప్రభుత్వం ఎంఎస్‌పీకి తమ పంటలు కొంటుందన్న గ్యారంటీ కూడా భవిష్యత్తులో ఉండకపోవచ్చునని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

పాక్, బంగ్లాల ఒప్పందం కన్నా ఎలా మెరుగు?

అమెరికాతో భారత్ కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందం భారత్‌కు ఎంతో మేలు చేస్తున్నదని కేంద్రం చేస్తున్న ప్రకటనల పట్ల ప్రముఖ రైతు సంఘం రాష్ట్రీయ కిసాన్ మహాసంఘ్ (ఆర్‌కేఎం) తీవ్రంగా మండిపడింది. అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతికి ఈ ఒప్పందం తలుపులు బార్లా తెరిచిందని, అలాంటప్పుడు ఇది బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లతో కుదుర్చుకున్న ఒప్పందాల కన్నా ఎలా మెరుగైనది అవుతుందని ప్రశ్నించింది. ఒక పక్క ఈ ఒప్పందం కారణంగా తమ దేశ వ్యవసాయ రంగానికి ఎంతో మేలు చేకూరుతుందని, వాణిజ్య లోటు కూడా తొలగిపోతుందని అమెరికా వ్యవసాయ మంత్రి బ్రూక్ రోలిన్స్ ఆనందంతో ప్రకటనలు చేస్తుండగా, దానికి విరుద్ధంగా మన వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. ఈ ఒప్పందాన్ని సమర్థిస్తూ, అది రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని అంటూ పొరుగు దేశాలతో పోల్చి చూపిస్తూ మంత్రి గోయల్ చేసిన ప్రకటన మోసపూరితమైనదని, అది ప్రభుత్వ జవాబుదారీతనంపై ఎన్నో ప్రశ్నలను లేవనెత్తుతున్నదని ఆర్‌కేఎం జాతీయ కన్వీనర్ కేవీ బిజు పేర్కొన్నారు.

> **వారితో మన రైతుల పోటీ ఎలా సాధ్యం?**
>
> మనకన్నా 30 శాతం తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేసి, సున్నా దిగుమతి సుంకాలతో మన దేశానికి తమ ఉత్పత్తులను సరఫరా చేసేవారితో మన దేశ రైతులు ఎలా పోటీ పడతారో మన వాణిజ్య మంత్రి సమాధానం చెప్పాలని కేవీ బిజు డిమాండ్ చేశారు. 'అత్యంత అనుకూల దేశం హోదా భారత్‌కు లభించ లేదు. దిగుమతి సుంకాలను 10 శాతానికి తగ్గించ లేదు. అంతేకాకుండా ఈ ఒప్పందానికి ముందు ఉన్న 5-15 శాతం సుంకాలను కూడా పునరుద్ధరించ లేదు. ఈ ప్రాథమిక ప్రతికూలతలను పరిష్కరించకుండా పోటీతత్వాన్ని పొందుతామన్న వాదనలు బోలుగా ఉన్నాయి' అని ఆయన వ్యాఖ్యానించారు.

ఒప్పందాన్ని పూర్తిగా బయటపెడితే ..

ఈ వాణిజ్య ఒప్పందంలో భారత్ తరపున హాజరైన ప్రతినిధులు ఒప్పందం పూర్తి వివరాలను బయటపెట్టలేదని, అది కనుక వెల్లడిస్తే రాజకీయంగా, ఆర్థికంగా తీవ్ర నష్టం జరిగి, తమను పూర్తి చిక్కుల్లోకి నెట్టేస్తుందన్న విషయం వారికి తెలుసని, అందుకే ఆ ఒప్పందం వివరాలను ఇంకా రహస్యంగానే ఉంచారని రాష్ట్రీయ కిసాన్ మహాసంఘ్ నేత ఆరోపించారు. బంగ్లాదేశ్, పాకిస్థాన్ ఉత్పత్తులపై 19 శాతం సుంకాలు విధిస్తున్నందున ఆ దేశాల కన్నా భారత్‌కు ప్రయోజనాలు చేకూరుతాయన్న కేంద్రం వాదనను ఖండించారు. అమెరికా ఇప్పటికే వస్త్రాలు సహా పలు వస్తువులను సున్నా సుంకాలతో దిగుమతి చేసుకోవడానికి బంగ్లాతో ఒప్పందం కుదుర్చుకున్న విషయాన్ని ఆయన వెల్లడించారు. దీనిని బట్టి 18 శాతం సుంకాలతో భారత్ ఒప్పందం కుదుర్చుకోవడం గొప్ప విజయమంటూ మోదీ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. అసలు ట్రంప్ రెండోసారి అధికారంలోకి రాక ముందు అమెరికా మన ఉత్పత్తులపై సగటున 2-3 శాతం సుంకాలు మాత్రమే విధించేదని, మోదీ ఆ విషయాన్ని దాచి 18 శాతానికి సుంకాలు తగ్గించినట్టు గొప్పలు చెబుతున్నారన్నారు.

వ్యతిరేకిస్తున్న స్వదేశీ జాగరణ్ మంచ్, బీకేఎస్

స్వదేశీ జాగరణ్ మంచ్, భారతీయ కిసాన్ సంఘ్‌లు ఈ వాణిజ్య ఒప్పందాన్ని, జీఎం ఉత్పత్తులను వ్యతిరేకిస్తున్నాయని ఆర్‌కేఎం తెలిపింది. డబ్ల్యూటీవో వద్ద భారత దేశం చాలాకాలంగా అమెరికా వ్యవసాయ సబ్సిడీలను వ్యతిరేకిస్తూ వచ్చిందని, ఇప్పుడు అమెరికా నుంచి సబ్సిడీ వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడానికి అనుమతించడం ఈ సబ్సిడీలను వ్యతిరేకించడంలో భారత దేశంతో నిలిచిన ఇతర దేశాలకు 'ద్రోహం' చేయడమేనని విమర్శించింది. 'ప్రాసెస్ చేసిన ఉత్పత్తి దిగుమతి చేసినప్పుడు జన్యు మార్పిడి (జీఎం) ప్రభావం దీర్ఘకాలం ఉండదు' అంటూ గోయల్ చేసిన ప్రకటనను ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ జన్యు మార్పిడి ఉత్పత్తులను భారత్‌ను ముంచెత్తడానికి మంత్రి చట్టబద్ధంగా అనుమతి ఇచ్చే ప్రయత్నమే ఈ ప్రకటన అని అన్నారు. సోయాబీన్ ఆయిల్, ఎండిన డిస్టిలర్ల ధాన్యాలు పెద్దమొత్తంలో జీఎం పంటల నుంచే వస్తాయన్నారు. వాటి దిగుమతిని అనుమతించడం అంటే జవాబుదారీతనం లేకుండా జీఎం వ్యవసాయానికి తలుపులు బార్లా తెరవడమేనని ఆయన విమర్శించారు.

కశ్మీర్‌లో భారీ హవాలా రాకెట్
జాతి వ్యతిరేక పనులకు వాడిన 8 వేల బ్యాంక్ ఖాతాలు ఫ్రీజ్

శ్రీనగర్: జమ్ము కశ్మీర్‌లో చట్ట విరుద్ధంగా లావాదేవీలు జరుగుతున్న మ్యూల్ ఖాతాల నెట్‌వర్క్‌ను భద్రతా దళాలు రట్టు చేశాయి. ఈ తరహా బ్యాంక్ ఖాతాలకు అంతర్జాతీయ సిండికేట్లతో సంబంధాలు ఉండొచ్చని అనుమానిస్తున్నాయి. అంతిమంగా ఈ ఖాతాల ద్వారా వేర్పాటువాదులకు, జాతి వ్యతిరేక కార్యకలాపాలకు నిధులు అందుతుండొచ్చని భావిస్తున్నాయి. గత మూడేండ్లలో ఈ తరహాలో ఉన్న సుమారు 8 వేల బ్యాంక్ అకౌంట్లను భద్రతా దళాలు గుర్తించి వాటిని ఫ్రీజ్ చేశాయి. ఇలాంటి ఖాతాలు లేనప్పుడు నేరగాళ్లు తాము దొంగిలించిన నిధులను క్రిప్టో కరెన్సీ లాంటి గుర్తించలేని డిజిటల్ ఆస్తుల్లోకి మార్చడానికి తీవ్రంగా ఇబ్బంది పడతారు. ఈ తరహా బ్యాంక్ ఖాతాల నిర్వహణకు మధ్యవర్తులుగా పనిచేసే 'మ్యూలర్స్'ను గుర్తించడానికి పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. జాతి వ్యతిరేక నేరగాళ్లు 'డిజిటల్ హవాలా' పద్ధతిలో పని చేస్తూ మ్యూల్ ఖాతాలు, మ్యూలర్స్ సంపాదించిన నిధులను జ్యాతి వ్యతిరేక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. సాధారణ వ్యక్తులకు సులభ సంపాదన ఆశ చూపి వారి బ్యాంక్ ఖాతాలను మ్యూల్ ఖాతాలుగా నేరగాళ్లు వాడుకొంటున్నారు.

హర్దీప్ మెడకు 'ఎప్‌స్టీన్' ఉచ్చు!
ఒకటి కాదు అనేకసార్లు ఎప్‌స్టీన్‌తో మెయిల్‌లో సంభాషించినట్టు వెలుగులోకి



న్యూఢిల్లీ: కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్‌కు ఎప్‌స్టీన్ ఉచ్చు చిక్కుకుంటున్నది! లైంగిక నేరస్థుడు ఎప్‌స్టీన్‌తో ఆయన ఒకటి కాదు చాలా సార్లు ఈ-మెయిల్ ద్వారా సంభాషించినట్టు రుజువులు బయటకు రావడమే అందుకు కారణం. యూఎస్ న్యాయ శాఖ వెబ్‌సైట్‌లో మంత్రి పేరును హర్దీప్ పురిగా 46 సార్లు, హర్దీప్‌గా 430 సార్లు, హర్దీప్ సింగ్ పురిగా 163 సార్లు ప్రస్తావించారు. 'ఒక మహిళా ఎంపీ ఉన్నారు. ఆమె నన్ను పక్కకు తీసుకెళ్లారు. వీళ్లలో చాలా మంది అసూయపరులున్నారని ఆమె నాతో అన్నారు. ఏమైనా జరిగితే నేను మాట్లాడతాలే అని నేను ఆమెతో అన్నాను. అయితే నేను దీంతో ఇరుక్కుపోయా' అని తీవ్రమైన సమస్యను హర్దీప్ జోక్ చేశారని, అసూయ పడేవారి గురించి సాధారణంగా వ్యాఖ్యానించారని ఆ మెయిళ్లలో ఉన్నట్టు సమాచారం! తాను మోదీ ప్రభుత్వంలో చేరకముందు ఎప్‌స్టీన్‌తో సంభాషించానన్న హర్దీప్ వాదన కూడా అబద్ధమని తేలిపోయింది. ఆయన మోదీ మంత్రి వర్గంలో చేరిన తర్వాత ఎప్‌స్టీన్‌కు పంపిన మెయిల్స్ తేదీలతో సహా బయటకు వచ్చాయి. తన సహాయకురాలు ఇండియాలో జరిగే ఒక పెండ్లికి హాజరయ్యేందుకు వీసా ఇప్పించాలని ఎప్‌స్టీన్ కోరగా హర్దీప్ అందుకు సహకరించారు. చాలావరకు ఆయన తన ఐఫోన్ ద్వారానే ఎప్‌స్టీన్‌కు మెయిల్స్ పంపారు. ఎప్‌స్టీన్‌కు 'ప్రజల పట్ల అభిరుచి ఉండటాన్ని' హర్దీప్ ఒక మెయిల్‌లో ప్రశంసించారు. అది ఎందుకు ఉద్దేశించిందో మాత్రం తెలియలేదు. ఇంకో మెయిల్‌లో వేరే దేశంలోని ద్వీపానికి ఎప్‌స్టీన్ విహార యాత్రకు వెళ్లి వచ్చాక 'అక్కడ మీరు బాగా ఆనందించి ఉంటారు' అని హర్దీప్ పేర్కొన్న విషయం కూడా తాజాగా బయటకు వచ్చింది.

యూనస్ భవితవ్యమేంటి?
దేశ అధ్యక్ష పదవి దక్కవచ్చంటూ ఊహాగానాలు!

ఢాకా: బంగ్లాదేశ్ ప్రధానిగా తారిఖ్ రహ్మాన్ నేతృత్వంలో మంగళవారం కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. దీంతో తాత్కాలిక ప్రభుత్వ అధినేతగా మహ్మద్ యూనస్ తన పదవి నుంచి తప్పుకోనున్నారు. ఈ నేపథ్యంలో రాబోయే ప్రభుత్వంలో ఆయన పోషించే పాత్రపై రకరకాల ఊహాగానాలు వెలువడుతున్నాయి. ఆయనకు రాజ్యాంగ బద్ధ పదవి, ముఖ్యంగా దేశాధ్యక్ష పదవి ఇవ్వాలనే డిమాండ్ సోషల్ మీడియాలో బలంగా వినిపిస్తున్నది. ఈ ఊహాగానాలపై కాబోయే ప్రధాని తారిఖ్ రహ్మాన్ సలహాదారు హుమాయూన్ కబీర్ స్పందిస్తూ, 'యూనస్‌తో చర్చలు జరిగాయి. కానీ ఏ పదవీ ఖరారు కాలేదు. రాజకీయాల్లో ఏదీ అసాధ్యం కాదు' అని అన్నారు. అయితే ఈ ప్రచారాన్ని మహ్మద్ యూనస్ కార్యాలయం ఖండించింది.

తారిఖ్ ప్రమాణ స్వీకారానికి వెళ్లనున్న ఓం బిర్లా!

తారిఖ్ ప్రమాణ స్వీకారానికి 12 దేశాలకు ఆహ్వానం అందింది. అదే రోజు ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌తో ప్రధాని మోదీ సమావేశం కావాల్సి ఉండటం వల్ల ఆయన బదులు భారత్ తరపున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ కార్యక్రమానికి హాజరు కానున్నట్టు తెలిసింది.



మీ గుర్తింపు కార్డు చూపండి
జర్మనీలో పాక్ ఆర్మీ చీఫ్‌కు చేదు అనుభవం

మ్యూనిచ్: పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌కు జర్మనీలోని మ్యూనిచ్‌లో జరిగిన భద్రతా సమావేశంలో అవమానం ఎదురైంది. అక్కడ ఒక సెక్యూరిటీ అధికారి ఒకరు అతడిని ఆపి ఐడెంటిటీ కార్డును చూపించమని అడిగారు. సెక్యూరిటీ కాన్ఫరెన్స్‌కు హాజరయ్యేందుకు ఫీల్డ్ మార్షల్ మునీర్, అతని బృందం జర్మనీలోని మ్యూనిచ్ నగరానికి చేరుకున్నారు. అయితే పాకిస్థాన్ ఆర్మీ చీఫ్‌ను తన ఐడెంటిటీ కార్డు ముందు కన్పించేలా ఉంచమని అక్కడి భద్రతా అధికారి అడుగుతున్న దృశ్యం ఇప్పుడు వైరల్‌గా మారింది. సమావేశ ప్రవేశ ద్వారానికి అడుగు దూరంలో ఒక భద్రతాధికారి తన నేమ్ బ్యాడ్జీని తట్టి, తన మెడలో వేలాడుతున్న ఐడీ కార్డు వైపు చూపిస్తూ 'మీరు దానిని తిప్పగలరా?' అని అడిగారు.



ఏప్రిల్ 22న తెరుచుకోనున్న కేదార్‌నాథ్ ఆలయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: శీతాకాలంలో దాదాపు ఆరు నెలలుగా మూసివేసిన ప్రఖ్యాత కేదార్‌నాథ్ ఆలయం ద్వారాలు ఏప్రిల్ 22న తెరుచుకోనున్నాయి. మహాశివరాత్రి పురస్కరించుకొని మందిరాన్ని తిరిగి తెరిచేందుకు శుభ తేదీ, సమయాన్ని నిర్ణయించినట్టు ఆలయ ప్రజా సంబంధాల అధికారి హరీశ్ గౌర్ ఆదివారం వెల్లడించారు. దీంతో ఈ ఏడాది చార్‌ధామ్ యాత్ర షెడ్యూల్ ఖరారైంది. బద్రీనాథ్ ధామ్ ద్వారాలు ఏప్రిల్ 23న, గంగోత్రి, యమునోత్రి ధామ్ ఏప్రిల్ 19న తెరుచుకుంటున్నాయి. ఉత్తరాఖండ్‌లోని గర్వాలీ హిమాలయ పర్వతాల్లో కొలువైన ఓంకారేశ్వర్ ఆలయం తలుపులు ఏప్రిల్ 22న ఉదయం 8 గంటలకు తెరుచుకుంటాయని, దీనికంటే ముందు పండితులు, పూజారులు ప్రత్యేక పూజలు చేస్తారని తెలిపారు.



2.7 కిలోల బంగారాన్ని కాజేసిన మేనేజర్

బెంగళూరు, ఫిబ్రవరి15: కంచె చేను మేసినట్టు.. వినియోగదారులు లాకర్లలో దాచుకున్న బంగారాన్ని బ్యాంక్ మేనేజర్ కాజేశాడు. దాదాపు 2.7 కిలోల బంగారు ఆభరణాలను దొంగిలించగా, వాటి ద్వారా పొందిన సొమ్ముతో ఆన్‌లైన్ బెట్టింగ్, జూదం ఆడాడు. బ్యాంక్ కస్టమర్లు తమ బంగారాన్ని విడిపించుకునేందుకు రాగా, ఫిబ్రవరి 2న బంగారు ఆభరణాల దొంగతనం బయటపడింది. దీంతో బెంగళూరులోని ఓ జాతీయ బ్యాంక్‌కు చెందిన అసిస్టెంట్ మేనేజర్ కిరణ్ కుమార్(34)ను అరెస్టు చేశారు. బ్యాంక్ కస్టమర్లకు చెందిన 2,783 గ్రాముల బంగారం దొంగతనానికి గురైందని దర్యాప్తులో తేలింది. నిందితుడు లాకర్ కీలను దుర్వినియోగం చేశాడని, బ్రాంచ్ మేనేజర్ లేని సమయాల్లో.. కొంత కాలంగా తాకట్టు పెట్టిన బంగారాన్ని క్రమంగా దొంగలిస్తున్నాడని తెలిసింది.



ఉగ్రదాడుల కోసం 'అన్సార్ ఇంటీరియం'
టెర్రర్ డాక్టర్ల కుట్ర

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: జమ్ముకశ్మీర్ పోలీసులు ఇటీవల 'వైట్ కాలర్' టెర్రర్ మాడ్యూల్‌ను ఛేదించగా కొత్త విషయం బయటపడింది. కొంతమంది డాక్టర్లు, రాడికల్ మత ప్రచారకులు కలిసి 'అన్సార్ ఇంటీరియం' పేరుతో కొత్త ఉగ్రసంస్థను ఏర్పాటుచేసుకున్నట్టు తేలింది. జమ్ముకశ్మీర్‌లో విధ్వంసక కార్యకలాపాలకు పాల్పడేందుకు దీనిని 2022లో ఏర్పాటుచేసినట్టు పోలీసు అధికారులు ఆదివారం మీడియాకు తెలిపారు. ఢిల్లీ ఎర్ర కోట దాడికి పాల్పడిన డాక్టర్ ఉమర్ నబీ, 2016-18 మధ్య కాలంలో పలు ఉగ్రవాద గ్రూపుల్లో చేరడానికి ప్రయత్నించాడని, అయితే.. డాక్టర్లు, మరికొంత మందితో కలిసి కొత్త సంస్థను శ్రీనగర్‌లో ఏర్పాటుచేసినట్టు పోలీసులు చెప్పారు.

▶▶ ప్రియురాలికి రూ. 1.5 కోట్లకు భర్తను అమ్మేసిన భార్య



భోపాల్: ఎస్వీ కృష్ణారెడ్డి దర్శకత్వంలో వచ్చిన ఒక చిత్రంలో భార్య.. తన భర్తను కోటి రూపాయలకు ప్రియురాలికి అమ్మేస్తుంది. అచ్చం అలాంటి ఘటనే ఇప్పుడు భోపాల్‌లో చోటుచేసుకుంది. ఇందులో కూడా ఇద్దరు పిల్లల తల్లి తన భర్తను రూ.1.5 కోట్లకు మరో మహిళకు అప్పగించేసి పిల్లలతో హాయిగా వేరే చోటకు వెళ్లిపోయింది. ఈ ఒప్పందం న్యాయస్థానం సాక్షిగా జరగడం విశేషం. వివరాల్లోకి వెళితే.. భోపాల్‌లో 42 ఏండ్ల వ్యక్తికి 23 ఏండ్ల క్రితం పెండ్లయింది. వారికి ఇద్దరు ఆడపిల్లలు. అయితే తన తండ్రి తన కార్యాలయంలో 54 ఏండ్ల మహిళతో సంబంధం పెట్టుకుని తమను నిర్లక్ష్యం చేస్తున్నాడంటూ 16 ఏండ్ల వారి పెద్ద కుమార్తె ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ వేసింది. కోర్టు భార్యాభర్తలు, అతని ప్రియురాలిని కౌన్సెలింగ్‌కు పిలిచింది. అయితే తాను ప్రియురాలితోనే ఉంటానని భర్త స్పష్టం చేశాడు. దీంతో తన భర్తను ప్రియురాలికి వదిలిపెట్టడానికి రూ.1.5 కోట్లు ఇవ్వాలని భార్య డిమాండ్ చేసింది. దీనికి ప్రియురాలు సై అనడంతో 23 ఏండ్ల వారి వివాహ బంధానికి తెరపడింది. ఆ భార్యకు ఒక డూప్లెక్స్ ఇంటితో పాటు 27 లక్షల నగదును ప్రియురాలు చెల్లించడంతో ఆమె తన ఇద్దరు పిల్లలతో అందులోకి మారిపోయేందుకు సిద్ధపడుతున్నది.

▶▶ 15 ఏండ్లుగా పోలీసుల ఇండ్లలో చోరీలు!



ఖాండ్వా: చిన్నప్పుడు ఒక పోలీస్ కానిస్టేబుల్ అకారణంగా కొట్టాడని కోపం పెంచుకున్న ఒక యువకుడు ఆ వ్యవస్థపైనే పగపట్టి పోలీసుల ఇళ్లనే టార్గెట్ చేస్తూ గత 15 ఏండ్లుగా చోరీలకు పాల్పడుతున్నాడు. 29 ఏండ్ల దీపేశ్ అలియాస్ దీపేంద్ర గత నెల 30న మధ్యప్రదేశ్ ఖాండ్వాలోని ఒక పోలీస్ కానిస్టేబుల్ ఇంట్లో జరిగిన చోరీ కేసులో ఈ నెల 11న అరెస్టయ్యాడు. అతడి వద్ద నుంచి రూ.2.5 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో అతను చెప్పిన విషయాలు విని పోలీసులు విస్తుపోయారు. తాను కేవలం పోలీసుల ఇండ్లలో మాత్రమే చోరీలు చేస్తానని, వారిపై ప్రతీకారంతోనే ఈ చోరీలు చేస్తున్నట్టు చెప్పాడు. తనకు 14 ఏండ్లు ఉన్నప్పుడు ఒక పోలీస్ అకారణంగా దారుణంగా కొట్టాడని, అప్పటి నుంచి పోలీసులపై పగ పట్టానని, వారి ఇండ్లలోనే ఇన్నాళ్లూ చోరీలు చేసినట్టు తెలిపాడు. మొదట తాను పోలీస్ లైట్లు అమ్మే వ్యక్తిగా కాని, అలంకరణ వస్తువులు అమ్మకందారునిగా కాని ఆయా ఇండ్లకు వెళ్లి పరిస్థితులను అంచనా వేసి రాత్రి చోరీకి పాల్పడతానని ఆయన తెలిపాడు.

▶▶ బీఏ చదివి సర్జరీలు!.. నకిలీ డాక్టర్ నిర్వాకం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: ఓ నకిలీ వైద్యుడి నిర్వాకం వల్ల గర్భిణి మృతిచెందిన ఘటన ఉత్తరప్రదేశ్‌లో చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, అంబేద్కర్ నగర్‌లోని బస్ఖారి ప్రాంతంలో యోగేశ్ వర్మ అనే సర్జన్ కొన్నేండ్లుగా క్లినిక్‌ను నడుపుతున్నాడు. స్థానికంగా ఉండే ఓ గర్భిణి ఫిబ్రవరి 5న ప్రసవం కోసం దవాఖానలో చేరింది. సిజేరియన్ ఆపరేషన్ అనంతరం తీవ్ర రక్తస్రావంతో ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటనపై మృతురాలి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటపడింది. వైద్యుడిగా చలామణి అవుతున్న యోగేశ్ వర్మకు వైద్య అర్హతలు లేవని దర్యాప్తులో గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. యోగేశ్ బీఏ చదివాడని.. వైద్య వృత్తిలో ఎటువంటి అనుభవం లేదని పోలీసులు తెలిపారు. అతడు ఎక్కడా ప్రత్యేక వైద్య శిక్షణ కూడా తీసుకోలేదన్నారు. నకిలీ క్లినిక్ నిర్వహిస్తూ.. సిజేరియన్‌తో సహ ఇతర శస్త్రచికిత్సలు సైతం చేస్తున్నారని అన్నారు. వెంటనే క్లినిక్‌ను సీజ్ చేసిన పోలీసులు, యోగేశ్‌ను, అతడి సహాయకుడిని అరెస్ట్ చేశామని అన్నారు.

▶▶ ఏలియన్స్ ఉన్నది నిజమే.. కానీ ఏరియా 51లో లేవు!



వాషింగ్టన్: (గ్రహాంతర జీవులు(ఏలియన్స్) ఉన్నది నిజమేనని అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అయితే అవి ఎక్కడ ఉన్నాయో తనకు తెలియదన్నారు. ఇటీవల యూట్యూబర్ బ్రెయిన్ టైలర్ కొవెన్స్ ప్రశ్నకు బదులిస్తూ ఆయన ఈ కామెంట్స్ చేశారు. అమెరికా వైమానిక దళ స్థావరమైన నెవెడాలోని 'ఏరియా 51'లో ఏలియన్స్ ఉన్నారనే వాదనను ఆయన తోసిపుచ్చారు. 'ఆ స్థావంలో భూగర్భ సౌకర్యం లేదు. అపారమైన కుట్ర ఉంటే తప్ప ఏలియన్స్‌ను అమెరికా అధ్యక్షుడికి తెలియకుండా అక్కడ దాచి పెట్టలేరు' అని ఆయన వెల్లడించారు. భూమి, సముద్రం, రోదసి, ఆకాశంలో విమానాలను లేదా సహజ దృగ్విషయాలను వెంటనే గుర్తించకపోవడానికి సంబంధించిన యూఏపీ పద్ధతిపై ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో ఒబామా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 2020 నుంచి SETI@Home ప్రాజెక్ట్ ద్వారా వేలాది స్వచ్ఛంద కార్యకర్తలు అసాధారణ రేడియో సంకేతాలను గుర్తించడం ద్వారా ఏలియన్స్ జాడను వెతికే ప్రయత్నం చేస్తున్నారు.

▶▶ కప్ప విషంతో రష్యా విపక్ష నేత నావల్నీ హత్య!



లండన్: రష్యా ప్రతిపక్ష నాయకుడు అలెక్సీ నావల్నీని ఆ దేశంలోని పుతిన్ ప్రభుత్వం కప్ప విషమిచ్చి చంపిందని యూకే సహా నాలుగు యూరోపియన్ దేశాలు ఆరోపిస్తున్నాయి. బహుళ నిఘా సంస్థలతో చేపట్టిన దర్యాప్తులో ఈ విషయం తేలిందని యూకే, ఫ్రాన్స్, జర్మనీ, స్వీడన్, నెదర్లాండ్స్ తాజాగా ప్రకటించాయి. రష్యాలోని మారుమూల ఆర్కిటిక్ శిక్షా కాలనీలో పుతిన్ ప్రభుత్వం అతడ్ని బంధించగా, 2024 ఫిబ్రవరిలో నావల్నీ జైల్లోనే మరణించాడు. అతడ్ని ఖననం చేయడానికి ముందు అతడి శరీరం నుంచి నమూనాలను సేకరించి రెండు దేశాల ప్రయోగశాలలకు పంపారు. రసాయన ఆయుధాల్ని ప్రయోగించటం ద్వారా రష్యా 'కెమికల్ వెపన్స్ కన్వెన్షన్' ఒప్పందాన్ని ఉల్లంఘించినట్టు ఆరోపించాయి. క్వెడార్ డార్ట్ కప్పల చర్మంలో ప్రాణాంతక విషం నావల్నీ శరీరంలో కనిపించిందని నిఘా సంస్థలు చెబుతున్నాయి.



విమానాల్లో బిగ్గరగా సంగీతం..
ప్రయాణికులపై చర్యలు తప్పవు
లోక్‌సభలో కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: విమానాల్లో బిగ్గరగా సంగీతాన్ని ప్లే చేసే ప్రయాణికులపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్రం తాజాగా హెచ్చరించింది. విమానం లోపల ఇయర్‌ఫోన్లు వాడకుండా బిగ్గరగా సంగీతాన్ని వింటున్న ప్రయాణికులపై చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపింది. కేంద్ర సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా ఈ విషయాన్ని సభ్యులకు తెలిపారు. తోటి ప్రయాణికులకు ఇబ్బంది కలిగేలా, బిగ్గరగా సంగీతం వినటంపై ప్రత్యేక నిబంధనేదీ లేనప్పటికీ, అధికారులు చర్య తీసుకోవచ్చునని అన్నారు.



జాక్వెలిన్‌కు గిఫ్ట్‌గా
రూ.30 కోట్ల హెలికాప్టర్
అందించిన ఆర్థిక నేరగాడు సుకేశ్ చంద్రశేఖర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: ఆర్థిక మోసగాడు సుకేశ్ చంద్రశేఖర్ మరోమారు వార్తల్లో నిలిచాడు. తన ప్రేయసి, బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్‌కు ప్రేమికుల రోజున అతడు ఊహించని గిఫ్ట్ పంపాడట. ఆమె కోసం ప్రత్యేకంగా తయారుచేసిన రూ.30 కోట్లు విలువజేసే ఎయిర్‌బస్‌ను ప్రేమ బహుమతిగా అందజేశానని, దాంతో పాటు తన ప్రేమ లేఖను కూడా పంపానని సుకేశ్ తెలిపాడు. ఢిల్లీ మండోలి జైల్లో శిక్ష అనుభవిస్తున్న సుకేశ్, మనీలాండరింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. అతడు రాసిన లేఖలో, జాక్వెలిన్‌ను బుట్టబొమ్మగా పేర్కొన్నాడు.

మాట జారి..నాలుక మడతేసి

'నేనే రాజు.. నేనే మంత్రి'నంటూ ఢిల్లీలో రేవంత్ ప్రకటన

సీఎం, మున్సిపల్ మంత్రిని కాబట్టి అన్నానని బుకాయింపు

- స్వపక్షం నుంచి ఊహించని ఎదురుదాడితో కంగుతిన్న సీఎం
- మొన్న రంజిత్‌రెడ్డిని మంత్రిని చేస్తానని ప్రకటించిన రేవంత్
- ఆనక తన మాటలు మీడియా అర్థం చేసుకోలేదని వివరణ
- భూపాలపల్లి సభలో నిధులు శ్రీధర్‌బాబు ఇస్తారని వ్యాఖ్యలు
- ఈ మాటలపై ఇప్పటికీ స్పష్టత ఇవ్వని సీఎం రేవంత్‌రెడ్డి
- ఆ వ్యాఖ్యలు భట్టి శాఖల్లో కోతకేనని హస్తం శ్రేణుల్లో చర్చ



హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ) : వెనుకా ముందు ఆలోచన లేకుండా నోటికి ఏదొస్తే అది మాట్లాడటం.. ప్రతిఘటన ఎదురైతే నాలుక మడతేయడం సీఎం రేవంత్‌రెడ్డికి అలవాటుగా మారిందని కాంగ్రెస్ శ్రేణులే చెప్తున్నాయి. 'తెలంగాణకు నేనే రాజు.. నేనే మంత్రి' అని రేవంత్‌రెడ్డి ఢిల్లీలో చేసుకున్న స్వయం ప్రకటనపై స్వపక్షం నుంచే విమర్శలు వెల్లువెత్తడంతో రేవంత్ నాలుక మడతేశారు. 'నా వ్యాఖ్యలను ప్రతిపక్షాలు వక్రీకరించాయని' అని తాజాగా బుకాయించారు. అంతకు ముందు పరిగి సభలోనూ రంజిత్‌రెడ్డిని మున్సిపల్ శాఖ మంత్రిని చేస్తానని ప్రకటించారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి నోరు పెద్దగ చెయ్యగానే..'అబ్బే.. నా మాటలు మీడియా అర్థం చేసుకోలేదు' అని వివరణ ఇచ్చారు. భూపాలపల్లిలోనూ 'సంతకం పెట్టేది నేను.. నిధులు ఇచ్చేది శ్రీధర్‌బాబు.. పని చేయించుకునేది గండ్ర సత్యనారాయణ' అని చెప్పడంతో కాబోయే ఆర్థిక మంత్రి శ్రీధర్‌బాబు అని కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చ మొదలైంది. దీనిపై సీఎం నుంచి స్పందన రాలేదు.

నేను ఆ ఉద్దేశంతోనే అన్నా..

ఇటీవల ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి 'నేనే రాజు.. నేనే మంత్రి' అని వ్యాఖ్యలు చేయడంపై అధికారం పక్షం నుంచే తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. తమను అసమర్థులుగా చిత్రీకరించడం కోసమే ఇలాంటి వ్యాఖ్యలు చేశారా? అంటూ సహచర మంత్రులు కొందరు సీఎంను కలిసి అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. వినాశకాలే విపరీత బుద్ధి అన్నట్టు రేవంత్ రెడ్డి తీరు ఉన్నదని, రేవంత్‌రెడ్డివి అహంకారపూరిత మాటలు అని కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మీడియా ఎదుట మండిపడ్డారు. మరోవైపు అధికార అహంకారం పెరగడంవల్లే రేవంత్‌రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ప్రతిపక్షాలు విమర్శించాయి. తన వ్యాఖ్యలపై ఎదురుదాడితో కంగుతిన్న రేవంత్ ఆత్మరక్షణలో పడ్డట్టు కాంగ్రెస్ శ్రేణులు చెప్తున్నాయి. నష్టనివారణ చర్యలకు ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ జయంతిని రేవంత్ వేదికగా చేసుకున్నారు. తన మాటలను ప్రతిపక్షాలు వక్రీకరించాయని వివరణ ఇచ్చారు. 'నేనే రాజు, నేనే మంత్రి' అనే వ్యాఖ్యల వెనుక ఉన్న ఉద్దేశం బాధ్యతను స్వీకరించడమే తప్ప అహంకారం కాదు' అంటూ చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే, మున్సిపల్ పరిపాలన శాఖ కూడా పర్యవేక్షిస్తున్నందున, రాబోయే ఎన్నికల ఫలితాలకు తానే పూర్తి జవాబుదారీ అని చెప్పే క్రమంలో ఆ పదాన్ని ఉపయోగించినట్టు కథ అల్లారు. రాజ్యాంగబద్ధమైన పదవుల రీత్యా ఆ వ్యాఖ్యలు చేశానని, తప్పుగా చిత్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని కోరడం కొసమెరుపు.

రంజిత్‌రెడ్డిని మంత్రిని చేస్తా అనలే

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పరిగి బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రంజిత్‌రెడ్డికి మున్సిపల్ మంత్రిగా బాధ్యతలు అప్పగిస్తామని ప్రకటించారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి రంజిత్‌రెడ్డి ఎంతో కృషి చేశారని చెప్పారు. 'ఈ ప్రాంత అభివృద్ధిలో ప్రభుత్వం వైపు నుంచి మీకు అండగా రంజిత్‌రెడ్డి నిలబడుతడు.. మీరంతా కలిసి కట్టుగా అభివృద్ధి చేసుకోండి' అని రేవంత్ సూచించారు. దీంతో మంత్రివర్గం బెర్త్ మీద మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే రంగారెడ్డి పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యాయి. దీంతో రాజగోపాల్‌రెడ్డి సీఎంపై ప్రత్యక్ష దాడికి దిగారు. 'తెలంగాణలో అధికారంలో ఉన్నది రేవంత్ కాంగ్రెస్సా? రాహుల్ కాంగ్రెస్సా?' అంటూ నిలదీశారు. 'ఆయన అహంకార పూరిత మాటలు రాహుల్‌గాంధీని అవమానించడమే' అని మండిపడ్డారు. మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా ఫీల్డ్ మీదికి వచ్చి 'రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి ఇవ్వడానికి సామాజిక వర్గమే అడ్డు అనుకుంటే నేను రాజీనామా చేసి, మీరు కోరిన సామాజిక వర్గం నేతను నిలబెట్టి గెలిపిస్తా'నని ప్రకటించారు. వారి మాటలతో ఆందోళన చెందిన సీఎం మీడియాను పిలిచి మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డిని మంత్రిని చేస్తానని ఎక్కడా చెప్పలేదని వివరణ ఇచ్చారు. మున్సిపల్ శాఖ మంత్రిగా నిధులిచ్చి అభివృద్ధి చేసే బాధ్యతను రంజిత్‌రెడ్డికి ఇస్తానని తాను పరిగి సభలో చెప్పినట్టు సంజాయిషీ ఇచ్చారు.

నిధులు శ్రీధర్‌బాబు ఇస్తారు

భూపాలపల్లి సభలో కూడా 'నేను సంతకం చేస్తే.. శ్రీధర్‌బాబు నిధులు ఇస్తారు.. మాతో ప్రజలు పని చేయించుకోవాలి' అని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీంతో త్వరలోనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని కాంగ్రెస్ అనుకూల సోషల్ మీడియా పోస్టింగ్ పెట్టింది. నైని బొగ్గు గనుల కుంభకోణం ఆరోపణల నేపథ్యంలో భట్టి శాఖల్లో మార్పులు చేర్పులు చేసి, ఆర్థిక శాఖను మంత్రి శ్రీధర్ బాబుకు అప్పగిస్తారని కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చ. సీఎం వివరణ ఇస్తారా? జరగబోయే విషయాన్నే తేల్చి చెప్పారా? అనేది కాలమే తేల్చాలని అధికార పార్టీ నేతలే చెప్పుకొస్తున్నారు.

పాలిటెక్నిక్ కోర్సుల పేరు మార్పు

పలు కోర్సుల్లో భారీగా సీట్ల పెంపు

కంప్యూటర్ సైన్స్‌లోనే పెరుగనున్న 1,320 సీట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ) : పాలిటెక్నిక్ కోర్సులకు సాంకేతిక విద్యాశాఖ కొత్త రంగులద్దుతున్నది. వచ్చే విద్యాసంవత్సరం కోసం పాలిటెక్నిక్ కోర్సుల్లోని నాలుగు కోర్సుల పేర్లను మార్చనున్నది. 2,880 సీట్లను పెంచనున్నది. కంప్యూటర్ సైన్స్‌లో 1,320, మరో 10 కొత్త కోర్సుల్లో 2,280 సీట్లు అందుబాటులోకి రానున్నాయి. 2025-26 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో 13,050 సీట్లుండగా, కొత్త సీట్ల పెంపు, కొత్త కోర్సులు ప్రవేశపెట్టడంతో మొత్తం సీట్ల సంఖ్య 18,330కు చేరనున్నది. రాష్ట్రంలో ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీల్లో మొత్తంగా 15,780 సీట్లున్నాయి. డిమాండ్ అధికంగా ఉన్న కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్(సీఎస్) కోర్సులో ఏకంగా 1,320 సీట్లను పెంచబోతున్నది. ఇది వరకు ఈ కోర్సులో 1,420 సీట్లుండగా, కొత్త సీట్లు చేరడంతో మొత్తం సీట్ల సంఖ్య 2,740కి చేరింది. ప్రింటింగ్ టెక్నాలజీ అండ్ డాటా అనలటిక్స్ కోర్సులో ఇప్పటి వరకు 60 సీట్లు మాత్రమే ఉండగా, మరో 60 సీట్లను పెంచుతున్నారు. ఎలక్ట్రానిక్స్ అండ్ వీడియో ఇంజినీరింగ్ కోర్సులోనూ 120 సీట్లను అదనంగా చేర్చుతున్నారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్(ఈసీ) విభాగంలో 60, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ అండ్ ఎలక్ట్రిక్ వెహికిల్ టెక్నాలజీ(ఈఈవీ) కోర్సులో 360, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్(ఈఈ)లో 180, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ అండ్ సెక్యూరిటీ (సీపీఎస్)లో 60, క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ బిగ్‌డాటా(సీసీబీ)లో 120, కెమికల్ ఇంజినీరింగ్‌లో 60, ఏఐఎంఎల్‌లో 540 చొప్పున సీట్లను పెంచారు. ఈ కొత్త సీట్లకు అనుమతి కోరుతూ ఏఐసీటీఈకి దరఖాస్తు చేశారు.

పేరు మార్చిన కోర్సులివే..

- డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ వీడియో ఇంజినీరింగ్(ఈవీ) పేరును డిప్లొమా ఇన్ మల్టీమీడియా అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ కోర్సుగా మార్చారు.
- డిప్లొమా ఇన్ కమర్షియల్ కంప్యూటర్ ప్రాక్టీస్(డీసీసీపీ) పేరును డీసీఏబీఎం కోర్సుగా మార్పుచేశారు.
- డిప్లొమా ఇన్ టెక్స్‌టైల్ టెక్నాలజీ(టీటీ) కోర్సు పేరును డిప్లొమా ఇన్ టెక్స్‌టైల్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ(టీఎఫ్)గా చేంజ్ చేశారు.
- డిప్లొమా ఇన్ ప్రింటింగ్ టెక్నాలజీ(పీటీ) పేరును డిప్లొమా ఇన్ ప్రింటింగ్ టెక్నాలజీ అండ్ డాటా అనలెటిక్స్(పీటీడీఏ) కోర్సుగా మార్చారు.

మా ప్రభుత్వం నుంచి సంక్షేమం ఆశించకండి

మొదటిపేజీ తరువాయి...

లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 'ఒకప్పుడు ఇందిరాగాంధీ హయాంలో సీలింగ్ యాక్ట్ ప్రకారం భూములను తీసుకొని అసైన్‌మెంట్ పట్టాల రూపంలో పంచారు. ఇప్పుడు పంచడానికి ప్రభుత్వం వద్ద భూములు లేవు. దళితులకు, గిరిజనులకు నాది ఒక్కటే సూచన. ఆనాడున్న పరిస్థితుల్లో సంక్షేమం, అభివృద్ధిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక విధానం తీసుకున్నది. కానీ నేడు ఆ శకం ముగిసింది. ఇవ్వాళ భూములు ఇవ్వాలన్నా మా దగ్గర అందుబాటులో లేవు. ఇక భూముల గురించి, ప్రభుత్వమిచ్చే సంక్షేమం గురించి ఆలోచించవద్దు. మేం ఏం చేయం, మాకు భూమివ్వండి? చిన్నవ్యాపారాలు చేసుకుంటామనేది వదిలిపెట్టండి. తాత్కాలిక సంక్షేమం గురించి ఆలోచించవద్దు' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి తేల్చిచెప్పారు. అయితే గిరిజన బిడ్డలు ఎంతరవరకు చదువుకుంటారో చదువుకోవాలని, అందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఉచిత సలహా ఇచ్చారు. ఆ తర్వాత ఉచిత సన్న బియ్యం, ఉచిత బస్సు, సబ్సిడీ విద్యుత్ పథకాలు, యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తదితర వాటి గురించి ఏకరువు పెట్టారు. సేవాలాల్ బోధనలు, సామాజిక ఐక్యతకు చేసిన కృషిని కొనియాడారు. తన రాజకీయ ప్రస్థానంలో లంబాడా గిరిజనుల పాత్ర ఎంతో ఉన్నదని, వారి రుణం తీర్చుకునే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని తెలిపారు. ప్రతీ తండాకు బీటీ రోడ్లు, సోలార్ పంప్ సెట్లు, పాఠశాల భవనాలు, గ్రామ పంచాయతీ భవనాలు, తాగునీరు, విద్యుత్ మౌలిక వసతులను కల్పించాలని ఆదేశాలు జారీ చేశామని వెల్లడించారు.

వచ్చే ఏడాది అచ్చంపేటలో వేడుకలు

రాష్ట్రంలో సంత్ సేవాలాల్ పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు అచ్చంపేట అటవీ ప్రాంతంలో 20 ఎకరాలు సేకరించామని, వచ్చే ఏడాది అక్కడే వేడుకలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. సేవాలాల్ భారీ విగ్రహం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీలు బలరాం నాయక్, ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రునాయక్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మాజీ మంత్రి రవీందర్ నాయక్, గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్, అదనపు సంచాలకులు సర్వేశ్వరరెడ్డి, గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ సంచాలకులు వేమూరి సముజ్వల, చీఫ్ ఇంజినీర్ బాలునాయక్, జీసీసీ జీఎం ప్రతాప్ రెడ్డి, గిరిజన మ్యూజియం క్యురేటర్ ద్యావనపల్లి సత్యనారాయణతోపాటు ఉన్నతాధికారులు, లంబాడా కళాకారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే ముఖ్యమంత్రి వ్యాఖ్యలతో ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అటకెక్కినట్టేనని మరోసారి తేలిపోయింది.

ఎంజేపీ స్కూల్ విద్యార్థి అదృశ్యం!

కేసు నమోదు చేసిన పోలీసులు

హనుమకొండ జిల్లాలో ఘటన

హసన్‌పర్తి, ఫిబ్రవరి 15 : హనుమకొండ జిల్లా నడికుడ మండలం చౌటపర్తికి చెందిన యెలగొండ సంతోష్ కుమారుడు హేమంత్ హసన్‌పర్తి మండలం జయగిరిలోని ఎంజేపీ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. శనివారం రాత్రి నుంచి హాస్టల్‌లో హేమంత్ కనిపించకపోవడంతో ప్రిన్సిపాల్ వెంకటప్రసాద్ తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. ఈ విషయమై ఆదివారం విద్యార్థి తల్లిదండ్రులు, ప్రిన్సిపాల్ హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్ నంబర్ 8712685095కు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

ఆదర్శప్రాయుడు ధర్మభిక్షం

పల్లా వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, కమ్యూనిస్టు నాయకుడు, మాజీ ఎంపీ ధర్మభిక్షం నేటి తరానికి ఆదర్శప్రాయుడని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి కొనియాడారు. హైదరాబాద్‌లో ఆదివారం సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ధర్మభిక్షం 104వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. అట్టడుగువర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన గొప్ప నాయకుడు ధర్మభిక్షం అని అన్నారు. గీత కార్మికుల కోసం రాష్ట్ర, జాతీయస్థాయిలో సంఘాలను ఏర్పాటు చేసి, వారి హక్కుల కోసం పోరాడారని గుర్తుచేశారు. విద్యార్థి దశ నుంచే అనేక మందిని నాయకులుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనదని తెలిపారు. ధర్మభిక్షం కేవలం కమ్యూనిస్టు పార్టీకే కాక, అన్ని పార్టీల వారికి ఆత్మీయుడని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నరసింహ, ప్రభాకర్, యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి దామోదర్ రెడ్డి, పొలగాని రవికిశోర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ దుకాణానికి పంచాయతీ వేలం!

లింగాలఘనపురం, ఫిబ్రవరి 15 : జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం కొత్తపల్లిలో బెల్ట్ దుకాణానికి గ్రామ పంచాయతీ వేలం నిర్వహించడం వివాదం రేపుతున్నది. బెల్ట్ దుకాణాలు నిర్వహించడమే అనధికారికమని, అలాంటిది వాటికి గ్రామ పంచాయతీ ఎలా వేలం వేస్తుందని స్థానికులు కొందరు ప్రశ్నిస్తున్నారు. కొత్తపల్లిలో దుర్గమ్మ పండుగ నిర్వహించాలని సర్పంచ్ గాదెపాక విష్ణు అధ్యక్షతన గ్రామస్థులు సమావేశమయ్యారు. నిధుల కోసం గ్రామంలో బెల్ట్ దుకాణానికి వేలం వేయాలని నిర్ణయించారు. రూ.1.30 లక్షలకు గ్రామానికి చెందిన దాసరి సురేశ్ బెల్ట్ షాపు దక్కించుకున్నాడు. ఏడాది వరకు ఇతరులెవరూ గ్రామంలో బెల్ట్ దుకాణాలు నిర్వహించొద్దని తీర్మానించారు. నెలరోజుల వరకు అభ్యంతరం లేదని, ఏడాది అంటే కుదరదని మిగతా బెల్ట్‌షాపుల నిర్వాహకులు అడ్డుకున్నారు. తాము గతంలో చాలా మందికి మద్యం ఉద్దెర ఇచ్చామని, తమకు డబ్బులు రావాలంటే మద్యం విక్రయించాల్సిందేనంటూ స్పష్టంచేశారు. అంతేగాక తమపొట్ట కొడుతున్నారని, బెల్ట్ దుకాణానికి వేలం ఎలా నిర్వహిస్తారని సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టడంతో విషయం బహిర్గతమైంది. ఇంత జరుగుతున్నా అటు ఎక్సైజ్ శాఖ, ఇటు లింగాలఘనపురం పోలీసులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిందగీ
చింతన
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 16 ఫిబ్రవరి 2026
www.ntnews.com

మనసును మార్చే మాసం

జీవితం ఉరుకులు పరుగుల మయం. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ఏదో హడావుడి. ఈ పరుగులో అసలు మనం ఎటు వెళ్తున్నాం? ఎందుకు బతుకుతున్నాం? అని ఒక్క క్షణం ఆగి ఆలోచింపజేసే మాసం 'రంజాన్'. రంజాన్ అంటే కేవలం కడుపుని ఖాళీగా ఉంచడం కాదు, మనసుని మంచి ఆలోచనలతో నింపుకోవడం. ఈ ఆధ్యాత్మిక ప్రయాణాన్ని కొన్ని సామాన్య ఉదాహరణలతో అర్థం చేసుకుందాం.

ఆ కౌగిలిలో ఉండే భరోసానే.. 'తఖ్వా'

చాలామందికి 'తఖ్వా' (దైవభీతి) అంటే దేవుడు ఎక్కడ శిక్షిస్తాడో అన్న భయం అనుకుంటారు. కానీ అది నెగెటివ్ భయం కాదు. ఒక చిన్న బిడ్డను ఊహించుకోండి. తల్లి కోపగించుకున్నప్పుడు ఆ బిడ్డ భయపడి ఇంట్లోకి వెళ్లకుండా బయట ఎక్కడో దాక్కోదు. ఇంకాస్త గట్టిగా ఏడుస్తూ వెళ్లి ఆ తల్లి కాళ్లనే పట్టుకుంటుంది. ఆ తల్లి కౌగిలిలోనే తనకు రక్షణ అని ఆ బిడ్డకు తెలుసు. దైవభీతి కూడా సరిగ్గా ఇలాంటిదే! అల్లాహ్ ఆగ్రహానికి గురవుతామేమో అన్న భయంతోనే ఆయన కారుణ్యం వైపు పరుగెత్తడం, ఆయనకు మరింత దగ్గరవ్వడం. అదే అసలైన 'తఖ్వా'.

మనసును చూసే కన్ను

మనం రోడ్డుపై వెళ్తున్నప్పుడు ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఎవరూ లేకపోయినా, పైన కెమెరా ఉందని తెలియగానే జాగ్రత్తపడతాం. ఆ కెమెరా మనల్ని గమనిస్తోందని, నిబంధన అతిక్రమిస్తే చలాన్ పడుతుందని మనకు తెలుసు.
నిజానికి మన జీవితంలోనూ ఇలాంటి ఒక నిఘా నేత్రం అవసరం. అదే ఆధ్యాత్మిక స్పృహ. ఎవరూ చూడటం లేదని అబద్ధం చెప్పడం, ఒంటరిగా ఉన్నాం కదా అని తప్పుడు పని చేయడం లాంటివి చేయకుండా.. 'నా దేవుడు నన్ను చూస్తున్నాడు' అనే స్పృహతో ఉండటమే ఉపవాసం మనకు నేర్పే పాఠం. రోడ్డుపై క్రమశిక్షణ మనల్ని ప్రమాదాల నుంచి ఎలా కాపాడుతుందో, జీవితంలో ఈ ఆధ్యాత్మిక క్రమశిక్షణ మనల్ని పాపాల నుంచి అలా రక్షిస్తుంది.

ఖురాన్: ఒక జీవన మార్గదర్శి

రంజాన్ నెలలో ఖురాన్ పారాయణానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. అయితే, ఇది కేవలం చదివి వదిలేసే పుస్తకం కాదు. ఇది ఒక మ్యాప్ లాంటిది. మనం తెలియని ఊరు వెళ్తున్నప్పుడు గమ్యం చేరడానికి మ్యాప్ ఎలా వాడతామో, పరలోకంలో విజయం సాధించడానికి ఖురాన్ అలా ఉపయోగపడుతుంది.

గురువారం నుంచి రంజాన్ మాసం



అందుకే దీన్ని అర్థం చేసుకుంటూ చదవడం, ఆచరించడం ముఖ్యం.

ఈ నెలలో మనం చేసే 'సాధన'

ఈ 30 రోజుల ప్రయాణంలో మనం కొన్ని నియమాలు కచ్చితంగా పాటించాలి:
మాటపై అదుపు: కడుపు మాడ్చుకుంటూ పక్కవారిపై చాడీలు చెబితే ఆ ఉపవాసానికి విలువ ఉండదు.
సేవలో సార్థకత: ఒక ఫర్జ్ నమాజ్ చేస్తే 70 రెట్ల పుణ్యం వచ్చే ఈ కాలంలో, పేదవారికి చేసే సాయం కూడా అదే స్థాయిలో మనల్ని దేవుడికి దగ్గర చేస్తుంది.
చివరి మెట్టు: రంజాన్ చివరి పది రోజులు చాలా కీలకం. ముఖ్యంగా 'లైలతుల్ ఖద్ర్' అనే మహోన్నతమైన రాత్రి కోసం చేసే అన్వేషణ మన జీవితాన్నే మార్చేయగలదు.
చివరగా..
గుర్రాన్ని అదుపు చేసే కళ్లెంలాగా, మన అహంకారాన్ని అదుపు చేసే కళ్లెమే ఈ రంజాన్. ఈ నెల ముగిసే సమయానికి మనలో కోపం తగ్గి, ఓర్పు పెరగాలి. ఈ మార్పే మనల్ని ఒక సంపూర్ణ మానవుడిగా తీర్చిదిద్దుతుంది.

... ముహమ్మద్ ముజాహిద్,
9640622076

కథాసుధ

నిండు కుండ



అదొక మారుమూల పల్లెటూరు. ఆ ఊరి నడిమధ్యన చేద బావి ఉంది. ఊర్లో వాళ్లందరూ ఆ చేదబావి దగ్గరకు వెళ్లి కావలసినన్ని నీళ్లు తోడుకుని వస్తారు. ఆ బావి నీళ్లు చాలా రుచిగా ఉంటాయని పక్క ఊరి వాళ్లు కూడా వచ్చి తోడుకుని వెళ్తారు. ఒక రోజు పక్క ఊరికి చెందిన తల్లీకూతురు బిందెలు తీసుకుని బావి వద్దకు వెళ్లారు. నీళ్లు తోడుతూ తల్లి ఇలా చెప్పింది 'పెండ్లీడుకు వచ్చావు. రేపోమాపో నీకు పెండ్లి చేస్తాము. నువ్వు అత్తగారి ఇంటిలో మంచి పేరు తెచ్చుకోవాలి. ఎలాంటి పరిస్థితులలోనూ అమ్మగారి ఇంటిని ఎక్కువ చేసి, అత్తగారి ఇంటిని తక్కువ చేసి మాట్లాడవద్దు' అని చెప్పింది.
'అంటే ఎలా ఉండాల'ని అడిగింది కూతురు. నిండు కుండలా ఉండాలని బదులిచ్చింది తల్లి. 'అర్థమయ్యేలా చెప్పు' అని కోరింది కూతురు. సమయం వచ్చినప్పుడు చెబుతానని సమాధానమిచ్చింది తల్లి. తల్లి తన బిందెలో నీళ్లను నిండుగా తోడింది. కూతురి బిందెలో తక్కువ నీళ్లు తోడింది. ఇద్దరూ బిందెలను ఎత్తుకుని మంచీచెడ్డా మాట్లాడుకుంటూ ఇంటికి చేరారు. వంట గదిలో నీళ్ల బిందె దించుతూ కూతురు ఏడుపు ముఖం పెట్టి 'నీ దుస్తులు తడవలేదు, నా దుస్తులు తడిచిపోయాయి' అని తన తడి వస్త్రాలు చూపింది. తల్లి చిన్న నవ్వు నవ్వుతూ 'ఎందుకంటే నా బిందెలో నీళ్లు నిండుగా ఉన్నాయి కాబట్టి నీళ్లు నాపైన ఒలకలేదు. నీ బిందెలో నీళ్లు నిండుగా లేవు కాబట్టి నీళ్లు ఒలికాయి. అందుకే పెద్దవాళ్లు నిండు కుండ తొణకదు అని అంటారు. గుణవంతులు, తెలివైన వాళ్లు హంగు ఆర్భాటాలకు వెళ్లరు. మిడిమిడి జ్ఞానం ఉన్నవాళ్లే ఎగిరెగిరి పడతారు. నెత్తిమీదికి తెచ్చుకుంటారు. అందుకే నువ్వు అత్తగారింట్లో ఒద్దికగా ఉండు' అని హితవు చెప్పింది. 'నిజమే... మనం బాగా గమనిస్తే నిండు కుండ మోగదు, ఖాళీ కుండే ఎక్కువ మోగుతుంది అనే విషయం స్ఫురిస్తుందని' తెలుసుకుంది కూతురు.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు
93936 62821

క్రీస్తు సందేశం

వల నిండా చేపలు



ఓ రోజు సీమోను, జబెదేయా అనే జాలరులు చేపల వేటకు సముద్రానికి వెళ్లారు. రాత్రంతా శ్రమించినా వారికి ఒక్క చేపా చిక్కలేదు. వారి శ్రమను చూసిన ప్రభువు 'రండీ ఇదిగో ఇక్కడ మీ వలలు విసరండి, చేపలు పట్టుకోండీ' అని భరోసా ఇచ్చాడు. ప్రభువు చూపిన చోట వల విసిరాడు సీమోను. మరుక్షణం అతని వల నిండా చేపలు పడ్డాయి. 'ఇదేం విడ్డూరం! మనం ప్రతిరోజూ తిరుగాడే సముద్రమేగా, మనకు తెలియని ప్రదేశమా? అయినా ఇంతలా ఎన్నడూ చేపలు పడలేదు' అని ఆశ్చర్యంతో ముక్కన వేలేసుకున్నారు. 'చేపలు పడితేనే ఇంత ఆనందమా? ఇలా ఆశ్చర్యపడాలా? ఇక మనుషుల్ని పట్టేవానిగా నీవు మారబోతున్నావు' అని సీమోనుతో అన్నాడు ప్రభువు. ఆనాటి నుంచి నేటి దాకా ఆ సీమోనే ప్రభువుకు తొలి శిష్యుడు. అతనికే పేతురనే పేరు కూడా.

... ప్రొ||బెర్నార్డ్ రాజు, 98667 55024



అడుగడుగునా శ్లోకం

అణువణువులోనూ నిండిన పరమాత్మ చైతన్యాన్ని అనుక్షణం గుర్తు చేసుకోవడం, ఆ శక్తిని గౌరవించడం కృతజ్ఞతా పూర్వకమైన సంస్కారం. మన విధి కూడా. అందుకే నిద్ర లేచింది మొదలు తిరిగి నిద్రపోయే వరకు ప్రతి అడుగులోనూ ఓ శ్లోకం చదవాలంటూ నిర్దేశిస్తాయి శాస్త్రాలు.

అసలు ఎందుకు ఇన్నేసి శ్లోకాలు చదవాలి? ఏదో ఒక్క శ్లోకం చదివితే సరిపోదా అంటే, నిజమే... సరిపోదు. అనంతమైన విశ్వంలో ప్రతి అణువులోనూ నిండిన పరమాత్మ చైతన్యాన్ని ఎంతని స్తోత్రం చెయ్యగలం? ఆ స్వామి మనకు ఇచ్చిన లెక్కలేనన్ని వరాలకు ఏమని కృతజ్ఞత చెప్పగలం? మనం వేసే ప్రతి అడుగూ, మాట్లాడే ప్రతి మాటా, తినే ప్రతి మెతుకూ, చివరకు తీసుకునే శ్వాస కూడా పరమాత్మ మనకు ఇచ్చిన వరాలే! పరమాత్మ శక్తి చైతన్యం మనకు తోడు లేకపోతే ఒక్క అడుగూ వెయ్యలేం. అందుకే, అనుక్షణం దైవాన్ని తలచుకుంటూ, మనల్ని మనమే ఉద్ధరించుకునే మార్గం దైవ శ్లోక-స్తోత్ర పారాయణం.

మనసు నిరంతరం ఏదో ఒకటి చింతించకుండా ఉండదు. అది దాని స్వభావం. పొలంలో విత్తనం వేయకపోతే ప్రకృతి దానిని గడ్డీగాదంతో నింపేస్తుంది. అది ప్రకృతి నియమం. అదేవిధంగా, మనసును మంచి ఆలోచనలతో నింపకపోతే అందులో చెడు ఆలోచనలు చేరుకుంటాయి. అనేక విషయ వాసనలతో నిండిపోతుంది. అందుకే, మెలకువగా ఉండే ప్రతి క్షణాన్నీ దైవనామ స్మరణతో నింపాలి. నామ-స్తోత్ర పారాయణం ద్వారా మనసును అంతర్ముఖం చేసుకోగలిగితే, విషయ చింతన తగ్గుతుంది. పరమాత్మ సన్నిధికి మార్గం సుగమం అవుతుంది. మనం చదివే ప్రతి శ్లోకానికీ, చేసే ప్రతి స్తోత్రానికీ అంతిమ పరమార్థం ఇదే.
మహాభారత యుద్ధంలో భీష్ముడు, ద్రోణుడు మొదలైన శత్రువీరులు అర్జునుడిపై వేసిన బాణాలు అత్యంత శక్తిమంతమైనవి. కేవలం శ్రీకృష్ణుడి అనుగ్రహం వల్ల వాటి శక్తి పూర్తిగా పనిచేయలేదు. ఈ రహస్యం తెలియని అర్జునుడు శత్రుపరాజయం అంతా తన శక్తిసామర్థ్యాల వల్లనే జరిగిందని అనుకుంటాడు. యుద్ధం ముగింపునకు వస్తుంది. చివరి రోజు సాయంకాల సమయం అది.. యుద్ధరంగం నుంచి అర్జునుడు శిబిరానికి చేరుకుంటాడు. ఇంకా, అల్లంత దూరంలో శిబిరం ఉందనగా, కృష్ణుడు రథాన్ని ఆపి, అర్జునుడిని దిగమంటాడు. పరమాత్మ మాట కాదనలేక రథం దిగుతాడు అర్జునుడు. ఆ వెంటనే కృష్ణుడు కూడా రథం దిగుతాడు. ఇద్దరూ... కొద్ది అడుగులు నడవగానే, భయంకరమైన శబ్దం చేస్తూ ఆ రథం ముక్కలు చెక్కలుగా విరిగిపోతుంది. ఒక్కసారిగా మంటలు చెలరేగి, రథం దగ్ధమైపోతుంది. ఇదంతా చూస్తున్న అర్జునుడు భయంతో కంపించిపోతాడు. ఎందుకిలా జరిగిందో అర్థం చేసుకోలేకపోతాడు. అప్పుడు, కృష్ణుడు చిరునవ్వులు చిందిస్తూ... 'అర్జునా! ఇంతకాలం నేను రథంలో ఉన్న కారణంగా శత్రువీరులు నీపై ప్రయోగించిన అస్త్రశస్త్రాలు నిన్నేమీ చెయ్యలేకపోయాయి. వాటి శక్తి ఈ రథాన్ని ఆవహించి, నా కారణంగా అక్కడే ఆగిపోయింది. ఇప్పుడు నేను రథాన్ని విడిచిపెట్టాను. అస్త్రాలు వాటి పని అవి నిర్వహించాయి' అంటాడు. భగవానుడి శక్తికి మరోసారి నివ్వెరపోతాడు అర్జునుడు.



మన జీవన రథానిదీ ఇదే కథ. భగవంతుడి శక్తి మనల్ని ఆవహించినంత కాలం ఏ ప్రారబ్ధ కర్మా మనల్ని ఏవిధంగా బాధించదు. కేవలం సాక్షికంగా వాటి ప్రభావాన్ని చూపిస్తాయే కానీ, మనల్ని పూర్తిగా ఇబ్బందిపెట్టవు. అదే భగవచ్ఛక్తి మనకు దూరమైతే, విషయవాంఛలు, ప్రారబ్ధకర్మల విషాగ్నిలో మనం దగ్ధం కాకతప్పదు అనే సందేశాన్ని ఈ కథ ద్వారా మనం అందుకోవాలి. అందుకే, నిత్యజీవితంలోని ప్రతి అడుగులో ఫలానా శ్లోకం చదవమంటూ, మనలో అనుక్షణం దైవీకమైన శక్తిని వృద్ధి చెందే ఉపాయాన్ని సూచించాయి శాస్త్రాలు.

దైవారాధన, శక్తి ఉపాసన అంటే... పెద్ద పెద్ద మంత్రాలు మాత్రమే చదవాల్సిన అవసరం లేదు. 'అమంత్రం అక్షరం నాస్తి'- మంత్రం కాని అక్షరం లేదని చెబుతాయి శాస్త్రాలు. మన వాక్కు ద్వారా బయటికి వచ్చే శబ్దంలోని శక్తిని గుర్తించి, ఉపాసించగలిగితే అంతకుమించిన తపస్సు మరొకటి ఉండదు. అందుకనే, ప్రతి మనిషీ ఈ ఉపాసన చేసేందుకు వీలుగా నిత్యజీవితంలోని ప్రతి అడుగులోనూ దైవప్రార్థన పేరుతో శబ్ద బ్రహ్మోపాసన చేసేలా వీలు కల్పించారు సనాతన రుషులు.



> ఉదయం నిద్రలేవగానే...
> కరాగ్రే వసతే లక్ష్మీః కరమధ్యే సరస్వతీ।
> కరమూలే స్థితా గౌరీ ప్రభాతే కరదర్శనమ్॥

త్రిశక్తులూ మన చేతిలోనే ఉంటాయి. ఆ శక్తుల్ని గ్రహించుకుని, గమనించుకోవాలనే సందేశం కన్నుతెరవగానే అందిస్తుంది శ్లోకం. మనలో ఉండే ప్రాణశక్తి, ఉపాసన ద్వారా చైతన్యశక్తిగా మారి మనల్ని నడిపిస్తుంది. అటువంటి శక్తి ప్రచోదనం ద్వారా, పరాశక్తిని ఉపాసన చేయడానికి పునాది ఈ శ్లోకం చదవటం నుంచే ప్రారంభం అవుతుంది.

> మంచం దిగుతూ, పాదాన్ని నేల మీదే మోపే ముందుగా...
> సముద్ర వసనే దేవీ పర్వత స్తన మండలే।
> విష్ణుపత్నీ నమస్తుభ్యం పాదస్పర్శం క్షమస్వమే॥

అనంతకోటి మానవ సమూహాన్ని భరిస్తున్న భూదేవి పట్ల మనం చూపాల్సిన కృతజ్ఞతను ప్రకటిస్తుందీ శ్లోకం. అడుగులతో తొక్కి బాధించినా, మన జీవనానికి అవసరమైన అన్నంతో సహా అన్ని ఓషధుల్నీ తన నుంచి ఆవిర్భవింపజేస్తుంది భూమాత. ఆ తల్లికి మించిన శాంతమూర్తి సృష్టిలో ఇంకెవ్వరూ లేరు. నీరు, పర్వతాలతో నిండిన భూమాత నా పాదాలతో తొక్కుతున్న పాపానికి మన్నించమని వేడుకోవటం పై శ్లోకంలోని అర్థం, పరమార్థం. మాతృమూర్తి పట్ల, మాతృభూమి పట్ల మన కర్తవ్యం, కృతజ్ఞత... నిద్రలేవటంతోనే గుర్తు చేస్తుందీ శ్లోకం.

> స్నానం చేసే సందర్భంలో...
> గంగే చ యమునే చైవ గోదావరీ సరస్వతీ।
> నర్మదే సింధు కావేరీ జలేస్మిన్ సన్నిధిం కురు॥

భౌతికంగా కంటికి కనిపించే అన్ని అశౌచాలను ప్రక్షాళన చేసే సామర్థ్యం కేవలం నీటికి మాత్రమే ఉంది. దీంతోపాటు, కంటికి కనిపించని పాపాన్ని పోగొట్టుకోవడానికి చేసే ప్రయత్నం కూడా ఈ నీటితో శుద్ధి చేసుకున్న తర్వాతనే మొదలవుతుంది. బాహ్యంగానూ, అంతరంగంలోనూ స్ఫటికం వలే స్వచ్ఛంగా ఉండే అవకాశం కల్పించే జలశక్తి మనల్ని ఆవహించేందుకు ఈ శ్లోకం పఠించాలని పెద్దలు సూచించారు.

> సూర్య నమస్కారం చేస్తూ...
> బ్రహ్మస్వరూపముదయే మధ్యాహ్నేతు మహేశ్వరమ్।
> సాయం ధ్యాయేత్సదా విష్ణుం త్రిమూర్తించ దివాకరమ్॥

స్నానం పూర్తి కాగానే, ప్రత్యక్ష దైవమైన సూర్యనారాయణ మూర్తిని చూస్తూ, ధ్యానించాల్సిన శ్లోకం ఇది. నిద్రలేవగానే చేసే ప్రార్థన ద్వారా త్రిశక్తులు మనల్ని ఆవహిస్తే, సూర్యోపాసన ద్వారా త్రిమూర్తులు మనకు ప్రసన్నులవుతారు. ఈవిధంగా త్రిమూర్తి, త్రిశక్తి ఉపాసన చేసే సులువైన మార్గం మనకు చూపించారు పూర్వీకులు.

> భోజనం చేసే ముందుగా...
> అహం వైశ్వానరో భూత్వా ప్రాణినా దేహమాశ్రితః।
> ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధం॥

జఠరాగ్ని సవ్యంగా ఉన్నప్పుడే మనం తీసుకునే ఆహారం జీర్ణమై, శక్తిగా మారుతుంది. లేకపోతే అధికంగా నెయ్యి పోసిన హోమగుండం మాదిరిగా చప్పబడిపోతుంది. రుషులు చేసేన అసంఖ్యాక యజ్ఞాల్లో నెయ్యి అధికంగా తీసుకున్న కారణంగా అగ్నిదేవుడికే జఠరాగ్ని సమస్య వచ్చింది. కృష్ణార్జునుల సహాయంతో ఖాండవ వనాన్ని దహించి, బాధ తీర్చుకున్నాడు అగ్ని. మనదీ అదే పరిస్థితి. మనలో జఠరాగ్ని రూపంలో ఉండే శక్తిని ఉద్దీపనం చేసుకోవడం, మనలోనే ఉండే ఆత్మారాముడికి నివేదన చెయ్యటం నేర్పిస్తుందీ శ్లోకం.

> ప్రయాణం సమయంలో...
> యశ్శివోనామ రూపాభ్యాం యాదేవీ సర్వమంగళా।
> తయో సంస్మరణాత్ పుంసాం సర్వతో జయమంగళం॥

మనం ఏది తలిస్తే అదే జరుగుతుందంటారు పెద్దలు. దీన్నే తథాస్తు దేవతలంటారు ఇంకొందరు. ఏది ఏమైనప్పటికీ, మనలో కలిగే భావనలే మనల్ని నడిపిస్తాయి. అందుకు అనుగుణంగా ఫలితాలను ఇస్తాయనేది సుస్పష్టం. అందుకే, ఏ పని ప్రారంభించినా, అడుగు వేసేముందుగా మంగళం జరగాలని కోరుకుంటూ, దైవ ప్రార్థన చేసే శ్లోకం ఇది. శివ, శక్తులు నా ప్రయాణంలో అంతటా నన్ను ఆవహించి, అన్నిటా నాకు విజయాన్ని కలిగించాలని ఈ శ్లోకానికి భావం.

> నిద్రపోయే ముందు....
> రామం స్కందం హనూమంతం వైనతేయం వృకోదరం।
> శయనే యః స్మరేన్నిత్యం దుస్వప్నం తస్య నశ్యతి॥


రోజంతా అనేక కార్యక్రమ నిర్వహణలో అలసిన మనిషి, విశ్రాంతి తీసుకోవడానికి ఉపక్రమించే సందర్భంలో చదవాల్సిన శ్లోకం ఇది. ఐదుగురు దివ్య పురుషుల స్మరణతో సాగుతుందీ శ్లోకం. ఈ ఐదుగురు పురుషులు ఐదు శక్తులకు ప్రతీక. జాగ్రదవస్థ నుంచి స్వప్న, సుషుప్తిలోకి జారుకునే మనిషి ఈ శక్తుల్ని చైతన్యవంతం చేసుకోవాలి. అప్పుడే ఏ దుస్వప్నం రాదు. కల అంటే మనసు పొందే విరుద్ధమైన భావన. తనకు తెలియని, తాను అనుకోని, తాను ఊహించని స్థితికి మనసు చేరుకుంటుంది. ఆ ఆలోచన చేస్తుంది. అవే కలలు అవుతాయి. పై శ్లోకంలో చెప్పుకొన్న ఐదు శక్తుల్ని మనిషి వృద్ధి చేసుకుంటే దుస్వప్నాల వల్ల కలిగే విపరీత ఫలితాలు అంటుకోవు. అంటే, ఏ విధమైన విపరీత భావన మనసులోకి ప్రవేశించదని అర్థం. ఎప్పుడైతే, మనసు వికల్పం కాదో... ఆ స్వచ్ఛమైన మనసు పరమాత్మకు వేదికగా నిలుస్తుంది. అంతిమంగా హృదయాకాశంలో కొలువైన దైవాన్ని దర్శించుకునే పూర్ణత్వం మనిషికి సిద్ధిస్తుంది. నిత్య ప్రార్థన శ్లోకాల రహస్యం ఇదే.

... డాక్టర్ కప్పగంతు రామకృష్ణ

ఉపనిషత్ వాక్యం

కౌశికుడు.. ధర్మవ్యాధుడు

మాతృదేవో భవ పితృదేవో భవ
ఆచార్యదేవో భవ అతిథిదేవో భవ
అని తైత్తరీయ ఉపనిషత్తు 11వ అనువాకం ప్రబోధిస్తున్నది.
తల్లిని తండ్రిని ఆచార్యుని అతిథిని దైవంగా భావించి సేవించాలని భావం. ఆచార్యుడు వేదాన్ని బోధించి ఇంటికి తిరిగి పంపేటప్పుడు శిష్యుడికి కర్తవ్యాన్ని గుర్తు చేస్తూ వీడుకోలు చెప్పే సందర్భం ఇది. గురువుగారి మాటలను సాధ్యమైనంత ఆచరించే వారు శిష్యులు. వారిని చూసి తమ నడవడికను తీర్చిదిద్దుకునే వారు కొందరు. దీనిని నిరూపించేదే ధర్మవ్యాధుని చరిత్రం.
కౌశికుడు నిష్ఠాగరిష్ఠుడు. తీవ్రమైన తపస్సు చేసిన వాడు. ఒకసారి ఒక చెట్టు కింద కూర్చుని వేద పఠనం చేస్తుంటే ఒక కొంగ రెట్ట వేసింది. అతనికి కోపం వచ్చింది. దానిని తీక్షణంగా చూశాడు. వెంటనే అది మలమల మాడి చనిపోయింది. కౌశికుడు తర్వాత భిక్షాటనకు వెళ్లాడు. ఒక ఇంటి ముందు నిలబడి 'భవతి భిక్షాం దేహి' అన్నాడు. ఆ ఇల్లాలు ఇంటి పనులలో నిమగ్నమై ఉన్నది. భర్త పాదాలు కడిగి ఆహారం సమకూర్చింది. తర్వాత భిక్ష తీసుకు వచ్చింది. ఆలస్యానికి అతనికి కోపం వచ్చింది. కానీ, ఆమె ప్రశాంతంగా 'నీ కోపం నన్నేమీ చేయలేదు. నేను కొంగను కాదు. నీవు మిథిలా నగరం వెళ్లి ధర్మవ్యాధుని ద్వారా తత్వాన్ని గ్రహించు' అన్నది. కౌశికుడు పశ్చాత్తాప పడి మిథిలకు వెళ్లాడు. ధర్మవ్యాధుడు అంటే ఎవరో మహర్షి అనుకున్నాడు. కానీ అతను మాంసం అమ్ముకునే కసాయివాడు. ధర్మవ్యాధుడు ఎంతో గౌరవంగా కౌశికుణ్ని తన ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ ధర్మవ్యాధుడు తల్లిదండ్రులకు చేస్తున్న సేవ చూసి కౌశికుడు ఆశ్చర్యపోయాడు. అతని నుంచి ధర్మ



సూక్ష్మాలు తెలుసుకున్నాడు. ధర్మం తెలుసుకునేందుకు చిన్న పెద్ద తారతమ్యాలు లేవు. తల్లిదండ్రులను సేవించేవాడు గొప్పవాడని ఈ వృత్తాంతం తెలియజేస్తున్నది

.. డా|| వెలుదండ సత్యనారాయణ



వేములవాడలోని భీమేశ్వర ఆలయంలో బారులుతీరిన భక్తులు

శివోహం.. హరోహం

- శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు
- ఉపవాస దీక్షతో జాగారం

నమస్తే నెట్‌వర్క్, ఫిబ్రవరి 15: మహా శివరాత్రి సందర్భంగా రాష్ట్రంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం ఉదయాన్నే ఆలయాలకు చేరుకున్న భక్తులు 'శివోహం.. హరోహం' అంటూ ముక్కంటిని భక్తిశ్రద్ధలతో పూజించి జాగరణ చేశారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. వేములవాడ రాజన్న అనుబంధ భీమేశ్వరాలయానికి లక్షల మంది భక్తులు తరలివచ్చారు. ప్రభుత్వం తరఫున విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ భీమేశ్వరస్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. రాత్రి 11:30 గంటలకు లింగోద్భవకాలంలో ఆలయ ఇన్‌చార్జి స్థానాచార్యులు ఎన్ ఉమేశ్ ఆధ్వర్యంలో 11 మంది రుత్వికులతో మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. శ్రీశైలం బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకొన్నారు. ప్రభోత్సవం సందర్భంగా కళారూపాలు ప్రదర్శించారు. లింగోద్భకాల మహారుద్రాభిషేకం, రాత్రి 12 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. హనుమకొండలోని వేయిస్తంభాలగుడి, మడికొండలోని మెట్టుగుట్ట, ఐనవోలు మల్లికార్జున స్వామి, వరంగల్ కాశీబుగ్గలోని కాశీవిశ్వేశ్వరాలయం, కోటిలింగాలు, ఖిలావరంగల్‌లోని రామలింగేశ్వరాలయం, శివనామస్మరణతో మెదక్ జిల్లా పాపన్నపేట మండలం ఏడుపాయల గుట్టలు మార్మోగాయి.

18 నుంచి యాదగిరీశుడి బ్రహ్మోత్సవాలు

వివరాలు వెల్లడించిన ఈవో భవానీశంకర్

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 15: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 2026 వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 18 నుంచి 28 వరకు వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో భవానీశంకర్ తెలిపారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో మీడియాకు వివరాలు వెల్లడించారు. ఈ నెల 18న స్వస్తీవాచనం, అంకురార్పణ, విశ్వక్సేరాధన, రక్షాబంధనంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 24న ఎదుర్కోళ్లు, 25న స్వామివారి తిరుకల్యాణోత్సవం, 26న దివ్య విమాన రథోత్సవం, 27న మహాపూర్ణాహుతి, చక్రతీర్థం, 28న శతఘటాభిషేకంతో ఉత్సవాలకు పరిసమాప్తి పలుకుతామని పేర్కొన్నారు. ఆరు రోజులపాటు అలంకార సేవలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.2 కోట్లు కేటాయించినట్టు అన్నారు. ఈ ఉత్సవాల్లో 100 మంది పారాయణీకులు, రుత్వికులు, ఆచార్యులు, పండితులు పాల్గొననున్నట్టు పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణమంతా విద్యుద్దీపకాంతులతో మిరిమిట్లు గొలిపే అలంకరించనున్నట్టు తెలిపారు. బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 18 నుంచి 28వరకు నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం, మొక్కు సేవలను రద్దు చేస్తున్నట్టు ఈవో ప్రకటించారు.

యూరియా యాప్ మాకొద్దు

రాష్ట్రవ్యాప్తంగా రైతుల ధర్నాలు, నిరసనలు

యాప్ కష్టాలపై రగిలిపోతున్న అన్నదాతలు

స్మార్ట్‌ఫోన్‌లేని, చదువురాని వారి పరిస్థితి దారుణం

- క్షణాల్లోనే స్టాక్ మొత్తం బుకింగ్
- కొన్నిచోట్ల స్టాక్ ఉన్నా బుక్‌కాని వైనం
- సొంతూళ్లో కాకుండా ఎక్కడో బుకింగ్
- రైతులపై అదనంగా రవాణా చార్జీల భారం
- బస్తా ధరను మించిపోతున్న బస్సుచార్జీలు
- పొంచి ఉన్న సైబర్ మోసాల ముప్పు



సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్‌లోని పీఏసీఎస్ ముందు ఆందోళనచేస్తున్న రైతులు (ఫైల్)

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రైతులకు యూరియా తిప్పలు తప్పడంలేదు. మొన్నటివరకు క్యూలతో గోసపడ్డ రైతులకు.. ఇప్పుడు యూరియా యాప్‌తో కష్టాలు మరింత పెరిగాయి. యాప్‌కు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా రైతులు రోడ్డెక్కుతున్నారు. ధర్నాలు, రాస్తారోకోలతో నిరసన వ్యక్తంచేస్తున్నారు. యాప్‌ను రద్దు చేసి పాత విధానంలోనే యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రైతుల ధర్నాలు, రాస్తారోకోలు

యాప్ ద్వారా యూరియా పంపిణీని వ్యవసాయ శాఖ తొలుత ఆరు జిల్లాల్లో ప్రయోగాత్మక ప్రాజెక్టుగా చేపట్టగా ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా విస్తరించింది. ప్రస్తుతం మెజారిటీ జిల్లాల్లో యాప్ ద్వారానే యూరియా పంపిణీ చేస్తున్నది. యాప్ ద్వారా రైతులకు సులువుగా యూరియా లభిస్తున్నదంటూ వ్యవసాయ శాఖ ప్రకటనలు చేస్తున్నది. కానీ, వాస్తవ పరిస్థితి అందుకు పూర్తి విరుద్ధంగా ఉన్నది. యాప్ ద్వారా యూరియా కొనుగోలు చేయలేక రైతులు తిప్పలు పడుతున్నారు. కొద్దిరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ చూసినా యూరియా యాప్‌కు వ్యతిరేకంగా రైతులు ధర్నాలు చేస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. సూర్యాపేట జిల్లా ఖానాపురం, కరీంనగర్ జిల్లా కొండపల్కలలో యూరియా యాప్‌కు వ్యతిరేకంగా రైతులు ధర్నాకు దిగారు. కరీంనగర్‌లో తాడికల్‌లో 230 బస్తాల యూరియా స్టాక్ రాగా క్షణాల్లోనే యూరియా అయిపోవడంతో ఆగ్రహించిన రైతులు జాతీయ రహదారిపై ధర్నా చేశారు. కరీంనగర్ జిల్లా కన్నాపూర్‌లోనూ ధర్నాకు దిగారు. నల్లగొండ జిల్లా తిప్పర్తిలో స్టాక్ వచ్చిన 35 సెకండ్లలోనే బస్తాలు మాయం కావడంతో ఆందోళనకు దిగారు.కరీంనగర్ జిల్లా శంకరపట్నంలో 330 బస్తాల యూరియా స్టాక్ రాగా యాప్‌లో బుక్ కాలేదు. కొద్ది సమయం తర్వాత సమస్యను పరిష్కరించగా క్షణాల్లోనే ఇతర ప్రాంతాల రైతులకు యూరియా బుక్ కావడంతో రైతులు నిరసన చేపట్టారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం బోదులబండలో కూడా ఇదే పరిస్థితి నెలకొన్నది. ఇలా ఎక్కడ చూసినా రైతులు యాప్‌కు వ్యతిరేకంగా ధర్నాలకు దిగుతున్నారు. నిర్మల్ జిల్లా నిర్మల్, సోన్ మండలాల్లో ఆదివారం పలు ఫర్టిలైజర్ షాపుల్లో యూరియా నిల్వలను యాప్‌లో చూడగా 'జీరో' చూపించడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. యూరియా లోడ్ ఫర్టిలైజర్ దుకాణానికి రాగానే డీలర్ ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పది నిమిషాల్లోనే అందుబాటులో ఉన్న రైతులు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకొని తీసుకెళ్తున్నారని, మిగతా వారికి దొరకడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

చదువురాని రైతులకు దొరుకతలేదు

చదువురాని రైతులు, స్మార్ట్‌ఫోన్లులేని రైతుల గోస వర్ణనాతీతంగా ఉన్నది. చదువురాని రైతులకు, స్మార్ట్‌ఫోన్లు లేని రైతులకు యూరియా దొరకడంలేదు. యాప్‌లో స్టాక్ కనిపించగానే ఇతర రైతులు వేగంగా బుక్ చేసుకోవడంతో వీళ్లకు మొండిచేయే మిగులుతున్నది. ఏఈవోలు, ఇతరులను బతిమాలి బుక్ చేసుకునేలోపే స్టాక్ అయిపోతున్నది. తర్వాత వచ్చిన రైతులు ఉత్తచేతులతో వెనుతిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో చదువురాని, స్మార్ట్‌ఫోన్లులేని రైతులు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. యాప్‌లో మండలాలు దాటి యూరియా బుక్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో ఊర్లోనే తీసుకునేవారు. కానీ ఇప్పుడు ఏ మండలం లో బుక్ అయితే, ఆ మండలానికి వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తున్నది. ఖమ్మం జిల్లాలో కొందరికి 70కిలోమీటర్ల దూరంలో యూరియా బుక్ కావడంతో అక్కడినుంచి తెచ్చుకోవాల్సి వచ్చింది.

క్షణాల్లోనే మాయం.. అంతా అనుమానం

యూరియా స్టాక్ చూపించిన క్షణాల్లోనే మాయమవుతున్నట్టు రైతులు చెప్తున్నారు. ఎన్ని వందల బస్తాలు ఉన్నప్పటికీ, కొద్దిసేపట్లోనే జీరో చూపిస్తున్నదని, ఆ కొద్ది సేపట్లోనే బస్తాలు ఏమైతున్నాయనే అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో ఈ పరిస్థితి అధికంగా ఉన్నది. షాపుల యజమానులు, ఇతర డీలర్లు వారే రైతుల పేరుతో యూరియా బుక్ చేస్తున్నారనే ఆరోపణలు కూడా వ్యక్తమవుతున్నాయి.

రైతులకు సైబర్ ముప్పు

సైబర్ మోసాలు విచ్చలవిడిగా పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో రైతులు యూరియా యాప్ కారణంగా సైబర్ వలలో చిక్కుకుంటున్నారు. యూరియా యాప్‌లో ఓటీపీ నమోదు చేసే విధానం ఉండటంతో సైబర్ మోసాలకు మరింత సులభంగా మారింది. దీంతోపాటు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే క్రమంలో రైతులు ఏపీకే ఫైల్స్‌ను క్లిక్ చేస్తున్నారు. దీంతో వారి ఖాతాలోని సొమ్ము అటు నుంచి అటే మాయమైపోతున్నది. దీంతో యూరియా యాప్ సైబర్ భద్రత ఎంతనే ప్రశ్నలు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో యూరియా యాప్ విధానాన్ని ఎత్తేసి పాత పద్ధతిలో యూరియా పంపిణీ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అక్షర చిట్‌ఫండ్ సంస్థ డైరెక్టర్ అరెస్ట్

సుబేదారి, ఫిబ్రవరి 15 : అక్షర చిట్‌ఫండ్ సంస్థ డైరెక్టర్ పేరాల శ్రీవిద్యను సుబేదారి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ రంజిత్ కథనం ప్రకారం.. అక్షర చిట్‌ఫండ్ సంస్థల్లో చీటీలు వేసిన వందలామందికి గడువు ముగిసినా డబ్బులు ఇవ్వకపోవడంతో పలువురు బాధితులు సుబేదారి పోలీసు స్టేషన్‌లో సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రావు, ఆయన భార్య, డైరెక్టర్ శ్రీవిద్యపై ఫిర్యాదు చేశారు. ఇదివరకే నాలుగు కేసులు ఉండగా, రెండు కేసుల్లో శ్రీనివాస్‌రావు జైలుకు వెళ్లి వచ్చాడు. మరో రెండు పెండింగ్ కేసుల్లో తప్పించుకొని తిరుగుతున్నాడు. అతడి భార్య శ్రీవిద్య అమెరికా నుంచి శనివారం వస్తుండగా బెంగళూరు ఎయిర్‌పోర్టులో సుబేదారి పోలీసులు అరెస్ట్ చేశారు. హనుమకొండ జిల్లా కోర్టులో హాజరుపరిచి, అక్కడి నుంచి నర్సంపేట సబ్‌జైలుకు తరలించారు.

మావోయిస్టులు లొంగిపోవాలి : డీజీపీ

హైదరాబాద్, ఫిబ్రవరి 15(నమస్తే తెలంగాణ): గడిచిన రెండేండ్లలో 588 మంది మావోయిస్టులు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారని, తెలంగాణ క్యాడర్‌కు చెందిన 15 మంది సహా మిగిలిన మావోయిస్టు నాయకులు, క్యాడర్ వెంటనే లొంగిపోవాలని డీజీపీ శివధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. లొంగిపోయినవారికి పునరావాస ప్యాకేజీ అమలుచేస్తామని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అంగన్‌వాడీల నిర్వీర్యానికి సర్కార్ కుట్ర : ఏటీపీ

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): అంగన్‌వాడీలను నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ ప్రభు త్వం కుట్రలు చేస్తున్నదని రాష్ట్ర అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్(ఏటీపీ-మినీ) అధ్యక్షురాలు ఆడెపు వరలక్ష్మి ఆరోపించారు. అందులో భాగంగానే సర్పంచులకు అంగన్‌వాడీల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించిందని ఆదివారం ఒక ప్రకటనలో ఆం దోళన వ్యక్తంచేశారు. రాజకీయ జో క్యంతో అంగన్‌వాడీ టీచర్లు స్వేచ్ఛగా పనిచేసే పరిస్థితి ఉండదని పేర్కొన్నారు. వెంటనే సర్పంచుల కమిటీల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

కరెంట్ షాక్‌కు రైతు బలి

నారాయణపేట జిల్లా పగిడిమర్రిలో విషాదం



అలీ (ఫైల్)

ఊట్కూర్, ఫిబ్రవరి 15 : కరెంట్ షాక్‌తో రైతు మృతి చెందిన ఘటన నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం పగిడిమర్రిలో విషాదాన్ని నింపింది. స్థానికులు, ఎస్సై రమేశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు మగ్దూంఅలీ (54) తిప్రాస్‌పల్లి శివారులో వేరుశనగ సాగు చేశాడు. శనివారం పొలానికి నీరు పారబెట్టేందుకు వెళ్లిన రైతు రాత్రి 9 గంటలు దాటినా ఇంటికి రాలేదు. భార్య షాహిన్‌బేగం అతనికి ఫోన్‌చేయగా లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి బావ మౌలాలీ, మరో వ్యక్తి అశోక్‌తో కలిసి పొలం వద్దకు వెళ్లింది. అడవి పందుల బెడద నుంచి పంట రక్షణ కోసం అమర్చిన ఎలక్ట్రిక్ ఫెన్సింగ్‌కు ప్రమాదవశాత్తు రైతు కాలు తగిలి విద్యుదాఘాతానికి గురై పడి ఉన్నాడు. వెంటనే దవాఖానకు తరలించగా.. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. రైతు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో బాలిక మృతి

- పొలం వద్ద మృతదేహం గుర్తింపు
- నాగర్‌కర్నూల్ జిల్లాలో విషాదం

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 15 : అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం బుద్ధసముద్రంలో చోటుచేసుకున్నది. డీఎస్పీ శ్రీనివాసులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాలిక(16) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నది. శనివారం రాత్రి ఇంట్లో భోజనాలైన తర్వాత అందరూ నిద్రించారు. కొద్దిసేపటి తరువాత బాలిక కనిపించకపోవడంతో ఆందోళనచెందిన కుటుంబ సభ్యులు వెతుకుతుండగా.. గ్రామానికి చెందిన ఓ యువకుడితో మాట్లాడుతూ రాత్రి 10:30 గంటల సమయంలో అతడి బైక్‌పై ఎక్కివెళ్లినట్టు స్థానికులు తెలిపారు. ఆదివారం ఉదయం వారి పొలం వద్దే బాలిక విగత జీవిగా పడి ఉన్నది. బాలిక మృతికి సదరు యువకుడే కారణమంటూ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతిరాలి ఒంటిపై ఎలాంటి గాయాలు లేకపోగా సమీపంలో రసాయనాలు ఉన్నట్టు గుర్తించారు. ఆ యువకుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు.

కొండంత ప్రేమతో పెదవంత ముద్దు



రవితేజ హీరోగా రూపొందుతున్న ఎమోషనల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకుడు. ప్రతిష్ఠాత్మక మైత్రీమూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్న ప్రియా భవానీశంకర్ ఫస్ట్‌లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమాలో ఆమె 'కావేరి' అనే పాత్రను పోషిస్తున్నట్టు మేకర్స్ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఫస్ట్‌లుక్‌లో ప్రియా భవానీశంకర్ బుగ్గపై హీరో రవితేజ ముద్దుపెడుతూ కనిపించగా, ఆమె సహజమైన ఆహార్యంతో అందంగా నవ్వుతూవుంది. హీరోహీరోయిన్ల మధ్య ప్రేమను ఈ పోస్టర్ ఆవిష్కరిస్తున్నది. నేపథ్యంలో ఉన్న అరటిపళ్ల బండి, హీరోహీరోయిన్ల ఆహార్యాలను బట్టి ఇది గ్రామీణ నేపథ్యంతో కూడిన సినిమా అని తెలుస్తున్నది. ఎమోషన్స్, కమర్షియల్ ఎలిమెంట్స్‌తో కూడిన పవర్‌ఫుల్ కథ ఇదని, తండ్రీకూతుళ్ల అనుబంధం ఈ కథకు హైలైట్ అని మేకర్స్ చెబుతున్నారు. రవితేజ కూతురుగా బేబీ నక్షత్ర నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: విష్ణుశర్మ, సంగీతం: జి.వి.ప్రకాష్‌కుమార్.

ఆదర్శకుటుంబం కోసం భారీ ఇల్లు?



వెంకటేశ్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఇప్పటివరకూ సినిమా రాలేదు. కానీ వెంకీ నటించిన రెండు సినిమాలకు త్రివిక్రమ్ మాటల రాశారు. ఆ రెండూ వెంకటేశ్ కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలిచాయి. అవే.. నువ్వునాకు నచ్చావ్, మల్లీశ్వరి. తెలుగురాష్ర్టాల్లో ఈ సినిమాలను ఇష్టపడని ఆడియన్ ఉండరు. నిజానికి కూడా త్రివిక్రమ్ డైలాగ్‌ని వెంకటేష్ చెప్పినంత టైమింగ్‌లో ఏ హీరో చెప్పలేదన్నది నిజం. అందుకే.. ఇప్పుడు త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకటేశ్ సినిమా వస్తుందంటే, ఆ హీరో ఫ్యాన్, ఈ హీరో ఫ్యాన్ అని కాకుండా, అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. 'ఆదర్శ కుటుంబం' పేరుతో రూపొందుతున్న ఈ సినిమాను వేసవిలో విడుదల చేయాలనే లక్ష్యంతో త్రివిక్రమ్ ముందుకెళ్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోలో ఈ సినిమా కోసం ఓ భారీ ఇంటి సెట్‌ను నిర్మిస్తున్నారు. ఈ సెట్‌లో కీలకమైన సన్నివేశాలను షూట్ చేస్తారట. ఈ నెల నాలుగోవారం నుంచి ఈ ఇంట్లో షూటింగ్ మొదలవుతుంది. ఈ షూట్ అనంతరం పాటల చిత్రీకరణ నిమిత్తం చిత్రబృందం విదేశాలకు వెళ్లనున్నది. హారికా అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఈ సినిమా రూపొందుతున్న విషయం విదితమే.

మ్యాజికల్ కథల్ని సృష్టిద్దాం

చిత్రం



అగ్ర కథానాయకుడు రామ్‌చరణ్ 'పెద్ది' సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నది. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకటసతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 30న పానిండియా స్థాయిలో విడుదల కానుంది. ఈ సినిమాపై దేశవ్యాప్తంగా అంచనాలు నెలకొని ఉన్న విషయం తెలిసిందే. ఇదిలావుంటే.. ఆదివారం చిత్ర దర్శకుడు బుచ్చిబాబు సాన పుట్టిన రోజు సందర్భంగా సినీ పరిశ్రమ నుంచి అనేకమంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అయితే.. వాటన్నింటిలో హీరో రామ్‌చరణ్ షేర్ చేసిన సందేశం ఆసక్తిని రేకెత్తించడమే కాక, చర్చనీయాంశమైంది. 'నా 'పెద్ది' కెప్టెన్ బుచ్చిబాబు సానా గారికి హ్యాపీ బర్త్‌డే. సెట్స్‌పై ప్రతి రోజూ మీరు చూపించే ప్యాషన్, డీటైలింగ్, రూటెడ్ స్టోరీటెల్లింగ్ ఎంతో ఎన్‌స్పైరింగ్‌గా ఉంటుంది. మనం కలిసి ఇంకా ఎన్నో మ్యాజికల్ కథల్ని సృష్టిద్దాం. ఈ ఏడాది మీ కష్టానికి తగిన గుర్తింపు రావాలని కోరుకుంటున్నా' అంటూ శుభాకాంక్షలు తెలిపారు రామ్‌చరణ్. దీనిపై బుచ్చిబాబు స్పందిస్తూ.. 'మీ ఆప్యాయతకు హృదయపూర్వక ధన్యవాదాలుసార్.. ఈ ప్రయాణంలో ప్రతిరోజూ మీ నుంచి కొత్తగా ఏదో ఒకటి నేర్చుకుంటున్నానుసార్. ఇది నాకు విలువైన అనుభవం. ఎడిట్ రూమ్‌లో చూస్తున్న ప్రతిసారీ మీ నటన నన్ను మంత్రముగ్ధుడ్ని చేస్తూనే ఉంది. 'పెద్ది'గా కొన్నేళ్లు మీరు ప్రేక్షకులకు గుర్తుండిపోతారు. నాపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించినందుకు మీకు కృతజ్ఞుడ్ని. థ్యాంక్యూ సోమచ్ మై డియరెస్ట్ చరణ్ సార్.. లవ్‌యూ..' అని పేర్కొన్నారు. ఇదిలావుంటే.. 'పెద్ది' లొకేషన్‌లో బుచ్చిబాబు సానా బర్త్‌డే వేడుక ఘనంగా జరిగింది. టీమ్ అంతా ఆయనకు శుభాకాంక్షలందించారు.

మలయాళం సినిమాలో సునీల్ స్టెప్పులు



క్యూబ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై షరీఫ్ మహమ్మద్ నిర్మిస్తున్న మలయాళ యాక్షన్ థ్రిల్లర్ 'కాటాలన్' నుంచి ఫస్ట్ సింగిల్ విడుదలైంది. ప్రముఖ తెలుగు నటుడు సునీల్‌పై ఈ పాట చిత్రీకరించడం విశేషం. ఇప్పటికే జైలర్, పుష్ప చిత్రాలతో ఇండియన్ సినిమాకు పరిచయమయ్యారు సునీల్. ఆ క్రమంలోనే ఈ మలయాళ సినిమాలోనూ ఆయన భాగం అయ్యారు. 'మజాకో మల్లికా..' అంటూ సాగే ఈ పాట తెలుగు వెర్షన్‌ని వినాయక్ శశికుమార్ రాయగా, బి.అజనీష్ లోక్‌నాథ్ స్వరపరిచారు. ఆనంద్ శ్రీరాజ్, భద్ర ఆలపించారు. పాల్ జార్జ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఆంటోనీ వర్గీస్, కబీర్ దుహన్‌సింగ్, సునీల్, జగదీష్ ముఖ్య తారలు. మే 14న పానిండియా స్థాయిలో సినిమా విడుదల కానుంది.

దైవత్వం.. విధి.. విధ్వంసం కలబోతగా



సంస్కృతి పరిరక్షణకై జరిగే పోరాటమే ప్రధాన ఇతివృత్తంగా రూపొందుతున్న పానిండియా మహాకావ్యం 'నాగబంధం' అని మేకర్స్ చెబుతున్నారు. విరాట్‌కర్ణ హీరోగా అభిషేక్ నామా తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మాతలు. నభా నటేష్, ఐశ్వర్య మీనన్ కథానాయికలు. సమ్మర్‌లో సినిమా విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. సూపర్‌స్టార్ మహేశ్‌బాబు తన ఎక్స్ ఖాతా ద్వారా టీజర్‌ని లాంచ్ చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. 'టీజర్‌లో నాగబంధం ప్రపంచం అద్భుతంగా ఉంది. ఈ అనుభూతిని పూర్తిగా ఎక్స్‌పీరియన్స్ చేయాలని ఎదురుచూస్తున్నా' అని ఎక్స్‌లో మహేశ్‌బాబు పేర్కొన్నారు. ఇక టీజర్ విషయానికొస్తే.. అహ్మద్‌షా అబ్దాలి నేతృత్వంలో జరిగిన ఆఫ్ఘాన్ దాడి నుంచి కొంత ప్రేరణ పొంది తయారు చేసుకున్న కథ ఇదని టీజర్ చెబుతున్నది. మైథాలజీ, చరిత్ర, ఆధ్యాత్మిక మేళవింపుగా, దైవత్వం.. విధి.. విధ్వంసం కలబోతగా ఈ సినిమా ఉంటుందని తెలుస్తున్నది. దర్శకుడు అభిషేక్ నామా గ్రాండ్ విజన్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్టు టీజర్ చెబుతున్నది. డీవోపీ సౌందర్‌రాజన్ విజువల్స్, వీఎఫ్ఎక్స్ ఈ టీజర్‌కి నిండుదనాన్ని తెచ్చాయి. పలు పవర్‌ఫుల్ అవతారాల్లో కనిపించి హీరో విరాట్ కర్ణ టీజర్‌లో హైలైట్‌గా నిలిచారు. మహేష్ మంజ్రేకర్, జగపతి బాబు, రిషబ్ సాహ్నీ, గరుడరామ్, జయప్రకాశ్, మురళీశర్మ, తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి మాటలు: కల్యాణచక్రవర్తి, సంగీతం: జునైద్‌కుమార్, అభే, నిర్మాణం: NIK స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్.

మెగా మూవీలో చాన్స్?



మలయాళంలో మంచి నటిగా గుర్తింపు తెచ్చుకున్న అనస్వర రాజన్.. 'చాంపియన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు కూడా చేరువైంది. ప్రస్తుతం భాషలకు అతీతంగా సినిమాలు చేస్తూ ఈ మలయాళభామ చాలా బిజీగా ఉంది. ఈ క్రమంలో ఈ టాలెంటెడ్ యాక్టస్‌కి టాలీవుడ్‌లో మరో అద్భుతమైన అవకాశం వరించినట్టు ఇన్‌సైడ్ టాక్. చిరంజీవి కథానాయకుడిగా కేఎస్ రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే. తండ్రీకూతుళ్ల అనుబంధమే ప్రధాన ఇతివృత్తంగా సాగే పవర్‌ఫుల్ కథతో తెరకెక్కనున్న ఈచిత్రంలో చిరంజీవి కూతురు పాత్రకు చాలామంది యంగ్ క్రేజీ కథానాయికలను అనుకున్నారు. అయితే.. ఆ అవకాశం చివరకు అనస్వర రాజన్‌ని వరించిందని తెలిసింది. కూతురు పాత్రకు ఈ కథలో అత్యంత ప్రాధాన్యత ఉండటంతో ఈ బరువైన పాత్రకు అనస్వరరాజన్ అయితేనే న్యాయం చేకూర్చగలదని దర్శకుడు బాబీ భావించారట. త్వరలోనే టీమ్ అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది.

ఎప్పుడూ రాయని నవల ఆధారంగా



నవీన్‌చంద్ర హీరోగా శ్రీకాంత్ నాగోతి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రానికి 'నాట్ ఎ డాక్టర్' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. రాహుల్ యాదవ్ నక్కా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రమోషన్‌లో భాగంగా ఆదివారం ఈ సినిమా పోస్టర్‌ని విడుదల చేశారు. అడవినేలలో నుంచి బయటకు వస్తున్న మట్టి చేయిని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ఆసక్తికరమైన ఏదో కథను ఈ పోస్టర్ చెబుతున్నట్టు అనిపిస్తున్నది. 'Based on a novel that was never written' అనే ట్యాగ్‌లైన్ ఈ సినిమా కథలో ఉన్న ఉద్వేగాన్ని తెలియజేస్తున్నది. స్వధర్మ్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు త్వరలోనే వెలువడనున్నాయి.

పురుషః స్వరాలు



పవన్‌కల్యాణ్ బత్తుల కథానాయకుడిగా నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'పురుషః'. హాసిని సుధీర్ కథానాయిక. వీరు వులవల దర్శకుడు. బత్తుల కోటేశ్వరరావు నిర్మాత. పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా సికింద్రాబాద్‌లోని కస్తూర్బా ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సమక్షంలో ఈ సినిమాలోని పాటను మేకర్స్ విడుదల చేశారు. 'చాటు చాటు..' అంటూ సాగే ఈ పాటను అనంతశ్రీరామ్ రాయగా, శ్రవణ్ భరద్వాజ్ స్వరపరిచారు. చిన్మయి శ్రీపాద ఆలపించారు. ట్యూన్‌కి తగ్గట్టు సహజమైన లొకేషన్లలో ఈ పాటను చిత్రీకరించామని, ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన వస్తున్నదని మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు. రాయంచ కొక్కిరి, విశిక, సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్ ఇందులో కీలక పాత్రధారులు.

ఈ విజయం బాధ్యతను పెంచింది



సంతోష్ శోభన్, మానస వారణాసి జంటగా నటించిన యూత్‌ఫుల్ లవ్‌స్టోరీ 'కపుల్ ఫ్రెండ్లీ'. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం ఇటీవల విడుదలైంది. ఈ సినిమా సక్సెస్‌మీట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ విజయంతో తన నమ్మకం నిజమైందని, ఈ సక్సెస్ క్రెడిట్ దర్శకుడిదేననీ, సంతోష్ శోభన్‌కి హిట్ రావడం ఆనందంగా ఉందని, ప్రేమకథలకు తను చిరునామా కావాలని పంపిణీదారుడు ధీరజ్ మొగిలినేని అన్నారు. ఈ విజయానికి టీమ్ సహకారమే కారణమని దర్శకుడు చెప్పారు. 'నా సినిమా థియేటర్ల ముందు హౌస్‌ఫుల్ బోర్డులను చూడాలనేది నా కల. ఈ సినిమాతో ఆ కల నెరవేరింది. ఎన్నోఏళ్లుగా ఎదురుచూస్తున్న విజయమిది. టీమంతా ప్రాణం పెట్టి పనిచేశారు కాబట్టే ఈ విజయం సాధ్యమైంది. ఈ సినిమా విజయం నటుడిగా నా బాధ్యతను పెంచింది' అని సంతోష్ శోభన్ పేర్కొన్నారు. ఇంకా నిర్మాత అజయ్‌కుమార్ రాజు.పి, కథానాయిక మానస వారణాసి కూడా మాట్లాడారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



సూపర్ 8

పాక్‌పై భారత్ ఎనిమిదో విజయం

- ప్రపంచకప్‌లో అప్రతిహత రికార్డు
- ఇషాన్ కిషన్ విజృంభణ
- బౌలర్ల సమష్టి ప్రదర్శన
- టీమ్‌ఇండియాకు సూపర్-8 బెర్తు

టీ20 ప్రపంచకప్‌లో భారత్ దుమ్మురేపింది! ప్రియమైన ప్రత్యర్థి పాకిస్థాన్‌పై బెబ్బులిలా విరుచుకుపడింది. సండే బ్లాక్‌బస్టర్‌లో టీమ్‌ఇండియా పాక్‌ను చిత్తుచిత్తుగా ఓడించింది. మెగాటోర్నీలో తమ అజేయ రికార్డును అప్రతిహతంగా కొనసాగిస్తూ ఏకంగా ఎనిమిదోసారి విజయఢంకా మోగించి..మరో మ్యాచ్ మిగిలుండగానే సూపర్-8 బెర్తు ఖరారు చేసుకుంది. కొలంబో గడ్డ మీద త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా రెపరెపలాడించింది. ప్యాకెట్ డైనమైట్ ఇషాన్ కిషన్ ధనాధన్ అర్ధసెంచరీతో చెలరేగిన వేళ పోరాడే స్కోరు అందుకున్న టీమ్‌ఇండియా సమష్టి ప్రదర్శనతో సత్తాచాటింది. పాక్ బౌలర్లను ఉతికిఆరేస్తూ కిషన్ బౌండరీలతో శివతాండవం చేశాడు. బుమ్రా, హార్దిక్ పాక్‌ను ఆదిలోనే దెబ్బతీయగా, అక్షర్, వరుణ్ మిగతా లాంఛనాన్ని పూర్తి చేశారు. వీరి ధాటికి 114 పరుగులకే కుప్పకూలిన పాక్ 61 పరుగుల తేడాతో మట్టికరిచింది. హ్యాట్రిక్ విజయాలతో డిఫెండింగ్ చాంపియన్ భారత్ టాప్ గేర్‌లో దూసుకెళుతుండగా, పాక్ సూపర్-8 ఆశలు మిణుకుమిణుకుమంటున్నాయి.

కొలంబో: ఫార్మాట్ ఏదైనా ప్రపంచకప్ టోర్నీల్లో దాయాది పాకిస్థాన్‌కు చుక్కలు చూపెట్టే టీమ్‌ఇండియా.. ఆ సంప్రదాయాన్ని దిగ్విజయంగా కొనసాగిస్తూ మరోసారి విజయ దుందుభి మోగించింది. ఇరుజట్ల మధ్య కొలంబో ఆతిథ్యమిచ్చిన గ్రూప్-ఏ మ్యాచ్‌లో భారత్.. 61 పరుగుల తేడాతో చిరకాల ప్రత్యర్థిని మట్టికరిపించి సూపర్-8 బెర్తును ఖరారు చేసుకుంది. అదీగాక ఐసీసీ టీ20 టోర్నీల్లో పాక్‌పై భారత ఆధిపత్యాన్ని 8-1కు పెంచుకుంది. మ్యాచ్‌లో పాక్ ఆహ్వానం మేరకు మొదట బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా.. ఇషాన్ కిషన్ (40 బంతుల్లో 77, 10 ఫోర్లు, 3 సిక్సులు) మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్‌కు తోడు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (29 బంతుల్లో 32, 3 ఫోర్లు) నిలకడైన ఆటతో 20 ఓవర్లకు 7 వికెట్లు కోల్పోయి 175 రన్స్ చేసింది. ఛేదనలో భారత బౌలర్ల సమష్టి ప్రదర్శనతో పాక్ 18 ఓవర్లకు 114 రన్స్‌కు తోకముడిచింది. ఉస్మాన్ ఖాన్ (34 బంతుల్లో 44, 6 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా షాహీన్ అఫ్రిది (19 బంతుల్లో 23 నాటౌట్, 2 ఫోర్లు, 1 సిక్స్) ఆడకుంటే ఆ జట్టు పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. హార్దిక్ (2/16), బుమ్రా (2/17), వరుణ్ (2/17), అక్షర్ (2/29) తలా రెండు వికెట్లు పడగొట్టి పాక్ పనిపట్టారు. ఇషాన్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

పవర్ ప్లేలోనే ఖేల్ ఖతం..

ఇషాన్ మినహా మిగిలిన భారత బ్యాటర్లు ఆచితూచి ఆడిన పిచ్‌పై పాక్ బ్యాటర్లు ఎలా స్పందిస్తారు? అన్న ఉత్కంఠకు తొలి మూడు ఓవర్లలోనే తెరపడింది. పవర్ ప్లేలోనే పాక్ ఓటమి దాదాపుగా ఖాయమైంది. హార్దిక్, బుమ్రా, అక్షర్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఆ జట్టు తొలి 6 ఓవర్లలో టాపార్డర్‌ను కోల్పోయి ఆ తర్వాత ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. హార్దిక్ తొలి ఓవర్లోనే ప్రమాదకర సాహిబ్‌జాదా ఫర్హాన్‌ను డకౌట్ చేసి పాక్ పతనానికి శ్రీకారం చుట్టాడు. రెండో ఓవర్‌లో బంతినందుకున్న బుమ్రా.. ఐదు బంతుల వ్యవధిలో రెండు కీలక వికెట్లు పడగొట్టి దాయాదిని చావుదెబ్బ కొట్టాడు. రెండో బంతికి అయూబ్ (6)ను అద్భుతమైన ఇన్‌స్వింగర్‌తో వికెట్ల ముందు బలిగొన్న అతడు.. ఆఖరి బంతికి కెప్టెన్ సల్మాన్ (4)ను బోల్తా కొట్టించాడు. ఐదో ఓవర్‌లో అక్షర్.. బాబర్ ఆజమ్ (5)ను క్లీన్‌బౌల్డ్ చేయడంతో ఆ జట్టు పవర్ ప్లేలో 38/4తో నిలిచింది. ఈ క్రమంలో పాక్‌ను కీపర్ ఉస్మాన్ ఆదుకునే యత్నం చేశాడు. దూకుడుగా ఆడుతూ భారత స్పిన్నర్లను ఎదుర్కొన్న అతడు.. షాదాబ్ ఖాన్ (14)తో కలిసి ఐదో వికెట్‌కు 39 రన్స్ జోడించాడు. కానీ అక్షర్ 11వ ఓవర్లో ముందుకొచ్చి ఆడబోయి స్టంపౌట్ అయ్యాడు. అంతే..! ఆ తర్వాత పాక్ లోయరార్డర్ తోకముడవడానికి పెద్దగా టైమ్ పట్టలేదు.

ఇషాన్‌దార్ ఇన్నింగ్స్

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన టీమ్ ఇండియా.. పాక్ పనిపడతాడనుకున్న అభిషేక్ శర్మ వికెట్‌ను ఫస్ట్ ఓవర్లోనే కోల్పోయింది. పాక్ సారథి వేసిన తొలి ఓవర్ ఆఖరి బంతిని పుల్ చేయబోయి మిడాన్‌లో అఫ్రిదికి చిక్కాడు. అభిషేక్ గండాన్ని తప్పించుకున్నామని సంబురపడ్డ పాక్ ఆశలపై ఇషాన్ నీళ్లు చల్లాడు. షాహీన్ బౌలింగ్‌లో సిక్స్‌తో వేట ఆరంభించిన అతడు.. అబ్రర్ ఐదో ఓవర్లో 6, 4 బాదాడు. అతడే వేసిన ఏడో ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లతో అతడి అర్ధశతకం కూడా పూర్తయింది. దూకుడుగా ఆడే క్రమంలో ఇషాన్‌ను 9వ ఓవర్లో అయూబ్ బౌల్డ్ చేయడంతో 87 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఇషాన్ నిష్క్రమణ తర్వాత భారత స్కోరు వేగం తగ్గింది. పాక్ సారథి వరుసగా స్పిన్నర్లతో వేయించి టీమ్‌ఇండియా భారీ స్కోరుకు అడ్డుకట్ట వేయగలిగాడు. తిలక్, సూర్య క్రీజులో ఉన్నా సింగిల్స్, డబుల్స్‌కే పరిమితమయ్యారు. అయూబ్ ఒకే ఓవర్లో తిలక్, హార్దిక్‌ను ఔట్ చేసి షాకిచ్చినా ఆఖర్లో శివమ్ దూబె (17 బంతుల్లో 27, 3 ఫోర్లు, 1 సిక్స్), రింకూ సింగ్ (11) మెరుపులతో భారత్ 170 పరుగుల మార్కును దాటేసింది.


ఇషాన్ (77)

18
టీ20 ప్రపంచకప్‌లో 18 ఓవర్లు స్పిన్ బౌలింగ్ చేయడం ఇదే తొలిసారి. పాక్ స్పిన్నర్లు భారత్‌పై ఈ ఫీట్ నమోదు చేశారు.

1
టీ20 వరల్డ్ కప్‌లో ఆరుగురు స్పిన్నర్లు ఒక మ్యాచ్‌లో బౌలింగ్ చేయడం ఇదే తొలిసారి

16
ఐసీసీ పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో 16 మ్యాచ్‌లాడిన భారత్ అన్నింటా వరుస విజయాలు సాధించింది. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియాపై ఓటమి టీమ్‌ఇండియాకు చివరిది.

సంక్షిప్త స్కోర్లు:
భారత్: 20 ఓవర్లకు 175/7 (ఇషాన్ 77, సూర్య 32, అయూబ్ 3/25, అఘా 1/10); పాకిస్థాన్: 18 ఓవర్లకు 114 ఆలౌట్ (ఉస్మాన్ 44, షాహీన్ 23, హార్దిక్ 2/16, బుమ్రా 2/17)



నీలి సముద్రంలా!

భారత్, పాక్ ప్రపంచకప్ మ్యాచ్‌కు అభిమానులు పోటెత్తారు. అసలు పోరు జరుగుతుందా లేదా అన్న అనుమానాలు పటాపంచలు చేస్తూ ఐసీసీ ప్రయత్నాలు సఫలం కాగా, ఫ్యాన్స్ సండే బ్లాక్‌బాస్టర్‌ను ఆస్వాదించారు. మ్యాచ్‌కు వేదికైన ప్రేమదాస స్టేడియానికి ఇరు దేశాల క్రికెట్ అభిమానులు వేల సంఖ్యలో తరలివచ్చారు. స్టేడియంలో ఎటు చూసినా టీమ్‌ఇండియా జెర్సీలు ధరించిన అభిమానులు వేల సంఖ్యలో ఉండటంతో నీలి సముద్రాన్ని తలపించింది. మెగాటోర్నీకి బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న రోహిత్‌శర్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. కప్‌ను స్టేడియంలో తీసుకొచ్చిన హిట్‌మ్యాన్ ఫ్యాన్స్‌తో సందడి చేశాడు. తన భార్య రితికా సజ్దేతో కలిసి వచ్చిన రోహిత్...ఐసీసీ చైర్మన్ జైషా, బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లాతో కలిసి మ్యాచ్ వీక్షించాడు.



నో షేక్‌హ్యాండ్

భారత్, పాకిస్థాన్ మెగా పోరులో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. గతంలో లాగే ఇరు జట్ల కెప్టెన్లు సూర్యకుమార్ యాదవ్, సల్మాన్‌అలీ ఆగా పాత సంప్రదాయాన్నే కొనసాగించారు. మ్యాచ్‌కు ముందు టాస్ వేసే సమయంలో కనీసం ఒకరిని ఒకరు చూసుకోని కెప్టెన్లు షేక్‌హ్యాండ్ ఇచ్చుకోకుండానే వెనుదిరిగారు. ఇటీవల జరిగిన ఆసియాకప్‌లోనూ రెండు దేశాల సారథులు ఇదే ఒరవడి కొనసాగించారు. టాస్ గెలిచిన పాక్ కెప్టెన్ సల్మాన్ ఆగా..భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా ఇరు జట్ల ప్లేయర్లు కరచాలనం లేకుండానే డగౌట్‌కు చేరుకున్నారు.


అరుంధతి రెడ్డి (4/22)

అమ్మాయిల బోణీ

- తొలి టీ20లో ఆసీస్‌పై గెలుపు
- మెరిసిన హైదరాబాదీ పేసర్ అరుంధతి

సిడ్నీ: ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) తర్వాత భారత మహిళల జట్టు ఆడిన తొలి మ్యాచ్‌లోనే సత్తాచాటింది. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న హర్మన్‌ప్రీత్ కౌర్ సేన.. కంగారూలతో సిడ్నీలో వర్షం అంతరాయం కల్గించిన తొలి మ్యాచ్‌లో ప్రత్యర్థిని 21 పరుగుల (డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో) తేడాతో ఓడించి మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యం సాధించింది. హైదరాబాదీ పేసర్ అరుంధతి రెడ్డి (4/22) కెరీర్ బెస్ట్ ప్రదర్శనకు తోడు రేణుకా సింగ్ ఠాకూర్ (2/14) పవర్ ప్లేలో కట్టుదిట్టమైన బౌలింగ్‌తో మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 18 ఓవర్లలో 133 పరుగులకే కుప్పకూలింది. జార్జియా వర్హైమ్ (19 బంతుల్లో 30, 4 ఫోర్లు) టాప్ స్కోరర్. తెలుగమ్మాయి శ్రీచరణి (2/14) రెండు వికెట్లు తీసింది. స్వల్ప ఛేదనలో బ్యాటింగ్‌కు వచ్చిన భారత్.. 5 ఓవర్లలోనే 50 రన్స్ దంచేసింది. షెఫాలీ వర్మ (11 బంతుల్లో 21, 1 ఫోర్, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడింది. వర్షం వచ్చే సమయానికి లక్ష్యానికంటే 21 రన్స్ ఎక్కువగా ఉండటంతో భారత్ విజేతగా నిలిచింది. ఆస్ట్రేలియాలో ఆస్ట్రేలియాను ఓడించడం (టీ20ల్లో) భారత్‌కు ఆరేండ్ల తర్వాత ఇదే ప్రథమం.

అదరగొట్టిన విండీస్

- టోర్నీ నుంచి నేపాల్ ఔట్


హోల్డర్ (4/27)

ముంబై: టీ20 ప్రపంచకప్‌లో రెండు సార్లు చాంపియన్ వెస్టిండీస్ సూపర్-8 దశకు అర్హత సాధించింది. ఆదివారం ముంబైలోని వాంఖడే వేదికగా నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 9 వికెట్ల తేడాతో భారీ విజయం సాధించి ఈ టోర్నీలో సూపర్-8కు క్వాలిఫై అయిన తొలి జట్టుగా నిలిచింది. విండీస్ ఆహ్వానం మేరకు మొదట బ్యాటింగ్ చేసిన నేపాల్.. నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 133 రన్స్ చేసింది. దీపేంద్ర సింగ్ (47 బంతుల్లో 58, 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) మినహా మిగిలినవారంతా క్రీజులో నిలవడానికే తంటాలు పడ్డారు. విండీస్ బౌలర్లలో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' జేసన్ హోల్డర్ (4/27) నాలుగు వికెట్ల ప్రదర్శన చేయగా హోసెన్, ఫోర్డ్, జోసెఫ్, ఛేజ్ చెరో ఒక వికెట్ తీశారు. కరీబియన్ బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీసి నేపాల్‌పై ఒత్తిడి పెంచడంతో ఆ జట్టు తక్కువ స్కోరుకే పరిమితమైంది. అనంతరం ఛేదనకు వచ్చిన విండీస్.. కెప్టెన్ షై హోప్ (44 బంతుల్లో 61 నాటౌట్, 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), షిమ్రన్ హిట్‌మైర్ (32 బంతుల్లో 46 నాటౌట్ , 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులతో 15.2 ఓవర్లలో లక్ష్యాన్ని పూర్తిచేసింది. గ్రూప్-సీలో భాగంగా లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో గెలిచిన వెస్టిండీస్.. 6 పాయింట్లతో సూపర్-8 బెర్తును ఖాయం చేసుకుంది. నేపాల్ మూడింట్లో మూడూ ఓడి రేసు నుంచి నిష్క్రమించింది.

నమీబియాకు అమెరికా షాక్


సంజయ్ (68*)

చెన్నై: రెండో టీ20 ప్రపంచకప్ ఆడుతున్న యూఎస్ఏ తమకంటే మెరుగైన జట్లకు షాకులిస్తున్నది. గ్రూప్-ఏలో ఆ జట్టు.. 31 పరుగుల తేడాతో నమీబియాపై గెలిచి ఈ టోర్నీలో సమష్టిగా రాణించి రెండో విజయాన్ని సొంతం చేసుకుంది. మొదట బ్యాటింగ్ చేస్తూ 20 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 199 రన్స్ చేసింది. భారత సంతతి ఆటగాళ్లు సంజయ్ కృష్ణమూర్తి (33 బంతుల్లో 68 నాటౌట్, 4 ఫోర్లు, 6 సిక్స్‌లు) వీరవిహారానికి తోడు మోనాంక్ పటేల్ (30 బంతుల్లో 52, 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. ఛేదనలో నమీబియా 168/6 వద్దే ఆగిపోయింది. స్టీన్‌క్యాంప్ (39 బంతుల్లో 58, 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), స్మిత్ (31) పోరాడినా ఆ జట్టుకు ఓటమి తప్పలేదు.


రైజింగ్ స్టార్స్ జయకేతనం

పాకిస్థాన్ 'ఏ'పై ఏకపక్ష విజయం


సంజయ్ (68*)

బ్యాంకాక్: మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో భారత 'ఏ' జట్టు భారీ విజయాన్ని నమోదుచేసింది. పాకిస్థాన్ 'ఏ'తో పూర్తి ఏకపక్షంగా జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు 8 వికెట్ల తేడాతో దాయాదిని చిత్తుచిత్తుగా ఓడించింది. భారత బౌలర్ల ధాటికి పాక్ 18.5 ఓవర్లకు 93 రన్స్‌కే చేతులెత్తేసింది. కెప్టెన్ రాధా యాదవ్ (2/11), సైమా ఠాకూర్ (2/14), ప్రేమ రావత్ (216) తలా రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనను భారత జట్టు 10.2 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి పూర్తిచేసింది. దినేశ్ వృంధా (55 నాటౌట్) అర్ధ శతకంతో ఆకట్టుకుంది.

రన్నరప్ హర్మీత్, యశస్విని



చెన్నై: భారత టేబుల్ టెన్నిస్ ద్వయం హర్మీత్ దేశాయ్, యశస్విని ఘోర్పడే డబ్ల్యూటీటీ స్టార్ కంటెండర్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం ఇక్కడ జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్‌లో భారత జోడీ.. 0-3 (9-11, 2-11, 8-11)తో రొమానియా సెకండ్ సీడ్ ఎడ్వర్డ్, బెర్నాడెట్ చేతిలో ఓడింది.

రాహుల్, పడిక్కల్ శతకాలు




లక్నో: రంజీ ట్రోఫీ సెమీస్ పోరును కర్ణాటక తొలిరోజు ఘనంగా ఆరంభించింది. లక్నోలో ఉత్తరాఖండ్‌తో జరుగుతున్న తొలి సెమీస్‌లో స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ (211 బంతుల్లో 141, 11 ఫోర్లు, 5 సిక్స్‌లు), కెప్టెన్ దేవ్‌దత్ పడిక్కల్ (236 బంతుల్లో 148 నాటౌట్, 16 ఫోర్లు, 2 సిక్స్‌లు) భారీ శతకాలతో రాణించారు. ఈ ఇద్దరి సెంచరీలతో మొదటిరోజు కర్ణాటక 90 ఓవర్లకు 355/2 పరుగుల భారీ స్కోరు సాధించింది. జమ్మూకాశ్మీర్‌తో జరుగుతున్న రెండో సెమీస్‌లో తొలుత బ్యాటింగ్ చేస్తున్న బెంగాల్.. మొదటి రోజు 249/5 చేసింది. సుదీప్ కుమార్ (136 బ్యాటింగ్) సెంచరీ చేశాడు.

బాల్ బ్యాడ్మింటన్ టోర్నీకి గురుకుల విద్యార్థులు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: బాలీ(ఇండోనేషియా) వేదికగా ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు జరుగనున్న ఇండో-ఇండోనేషియా బాల్ బ్యాడ్మింటన్ టోర్నీకి రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు బాబునాయక్, శశిధర్ ఎంపికయ్యారు. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో భారత జట్టు తరఫున బాబునాయక్, శశిధర్ ప్రాతినిధ్యం వహించనున్నారు. జాతీయస్థాయి టోర్నీల్లో రాణించడం ద్వారా ఈ ఇద్దరు గురుకుల విద్యార్థులు అంతర్జాతీయ టోర్నీకి ఎంపికైనట్లు గురుకుల ప్రతినిధులు పేర్కొన్నారు.

పరిశ్రమలకు పవర్ హాలిడే!

- పారిశ్రామికవాడల్లో నిత్యం విద్యుత్తు కోతలు
- ముందస్తు సమాచారం ఇవ్వకుండా కరెంటు కట్
- ఉత్పత్తులపై తీవ్ర ప్రతికూల ప్రభావం
- ఆందోళనలో పారిశ్రామికవేత్తలు



హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఈసారి వేసవి మొదలు కాక ముందే పరిశ్రమలకు కరెంటు కష్టాలు మొదలయ్యాయి. నిత్యం అప్రకటిత కరెంటు కోతలతో హైదరాబాద్ శివార్లలోని పారిశ్రామికవాడల్లో ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడుతున్నది. మెయింటెనెన్స్ పనుల పేరుతో ఇప్పటికే ప్రతి ఆదివారం విద్యుత్తు కోతలు విధిస్తున్న అధికారులు.. వారంలో మిగిలిన రోజుల్లో సైతం అకారణంగా కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నారు. దీంతో ఎప్పుడు కరెంటు పోతుందో అర్థంకాక పరిశ్రమల నిర్వాహకులు సతమతమవుతున్నారు. నాణ్యమైన కరెంటు సరఫరా కోసం ప్రతి ఆదివారం పారిశ్రామికవాడల్లో విద్యుత్తు శాఖ సిబ్బంది నిర్వహణ పనులు చేపట్టడం ఆనవాయితీ. అది సెలవుదినం కావడంతో ఉత్పత్తిపై ఎలాంటి ప్రభావం ఉండదు. కానీ, రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు వచ్చినప్పటినుంచి ఈ విధానం గాడితప్పింది. నిర్వహణ పనులు తూతూమంత్రంగా చేస్తుండటంతో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం మరమ్మతుల పేరిట ఇంచుమించు ప్రతి రోజూ విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నారు. అలా గత వారం రోజుల్లో జీడిమెట్లలో రెండుసార్లు గంట చొప్పున కరెంటు పోయింది. చర్లపల్లి, బాలానగర్, నాచారంలో మూడుసార్లు, మల్లాపూర్, ఉప్పల్ పారిశ్రామికవాడల్లో ఒకసారి విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది.

పాడవుతున్న యంత్రాలు, ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం

ముందస్తు సమాచారం లేకుండా కరెంటు నిలిపివేస్తుండటంతో యంత్రాలు పాడవుతున్నాయని, మోటర్లు కాలిపోయే ప్రమాదం ఉన్నదని పరిశ్రమల యజమానులు వాపోతున్నారు. యంత్రాలు నడుస్తున్నప్పుడు అకస్మాత్తుగా కరెంటు సరఫరా నిలిచిపోతే ఉత్పత్తుల నాణ్యత తగ్గిపోతుందని, ముఖ్యంగా ప్లాస్టిక్ పరిశ్రమల్లో ప్లాస్టిక్ గడ్డకట్టి వృథా అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమల్లో బాయిలర్లు చల్లారిపోయి మళ్లీ వేడెక్కేందుకు ఎంతో సమయం పడుతుందని, కనీసం అర్ధగంట సేపు విద్యుత్తు నిలిచిపోయినా.. మళ్లీ ఉత్పత్తి మొదలయ్యేందుకు రెండు గంటల సమయం పడుతుందని చెప్తున్నారు. వాస్తవానికి ఈ ఏడాది భారీ వర్షాల వల్ల జూన్, జూలై, ఆగస్టు మాసాల్లోనూ నిత్యం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఏదో ఒక ప్రాంతంలో చెట్లు కూలడం, కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు నష్టం జరగడం వంటి ఘటనలతో విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టాక కరెంటు సరఫరా కాస్త గాడిలో పడినప్పటికీ గత నెలరోజులుగా మళ్లీ విద్యుత్తు కోతలు మొదలయ్యాయి.

విద్యుత్తు పరికరాల కొరత

రాష్ట్ర విద్యుత్తు శాఖ ఇప్పటికే పరికరాల కొరతతో సతమతమవుతున్నట్టు సమాచారం. ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి విద్యుత్తు సరఫరా నియంత్రణ, క్రమబద్ధీకరణ లాంటి పనుల కోసం ఉపయోగించే ఆల్టర్నేటింగ్ కరెంట్ (ఏసీ), డైరెక్టర్ కరెంట్ (డీసీ) రెక్టిఫయర్లు, ఫిల్టర్లు, ఓల్టేజ్ రెగ్యులేటర్లు తదితర పరికరాలు లేక పాత పరికరాలనే కొనసాగిస్తుండటంతో రోజూ మరమ్మతులు తప్పడం లేదు. దీంతో విద్యుత్తు సరఫరా సక్రమంగా సాగడంలేదు.

మళ్లీ పాత రోజులు

స్వరాష్ట్ర ఆవిర్భావానికి ముందు నిత్యం కరెంటు కోతలతో తెలంగాణ తీవ్రంగా సతమతమైంది. ముఖ్యంగా వేసవి కాలంలో వారానికి 2-3 రోజులు అధికారికంగానే పవర్ హాలిడేలు ఉండేవి. పగటిపూట కరెంటు కోతలు విధించి, రాత్రి వేళల్లో మాత్రమే విద్యుత్తు సరఫరా చేసేవారు. దీంతో ప్రతి పరిశ్రమ తప్పనిసరిగా జనరేటర్లను ఏర్పాటు చేసుకునేది. తెలంగాణ ఏర్పాటు తర్వాత కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ సర్కార్ ఆ కష్టాలకు తెరదించి, పదేండ్లపాటు కరెంటు కోతలు లేకుండా చేయడంతో పరిశ్రమల్లో జనరేటర్లు కనుమరుగయ్యాయి. కానీ, ప్రస్తుత కరెంటు కోతలు చూస్తుంటే పాత రోజులు గుర్తొస్తున్నాయి. దీంతో తాము మళ్లీ జనరేటర్లను ఏర్పాటు చేసుకోక తప్పదని పారిశ్రామిక వర్గాలు చెప్తున్నాయి.

ఈనెలలోనే రెండు అల్పపీడనాలు

- నేడు, 19 తర్వాత ఏర్పడే అవకాశం
- 25 నుంచి 28 వరకు వర్షాలు
- వెల్లడించిన వాతావరణ శాఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నదని, దక్షిణ బంగాళాఖాతంలో సోమవారం అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. దీని ప్రభావంతో తమిళనాడు, శ్రీలంకలో వర్షాలు కురుస్తాయని పేర్కొన్నది. తెలంగాణ, ఏపీపై ప్రభావం అంతగా ఉండకపోవచ్చని వెల్లడించింది. ఈ నెల19 నుంచి బంగాళాఖాతంలో వాతావరణ మార్పులు ఉంటాయని తెలిపింది. మొదట ఉపరితల ఆవర్తనం ఏర్పడి, ఆ తర్వాత అల్పపీడనంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయని వివరించింది. దీంతో తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ముఖ్యంగా 25 నుంచి 28 వరకు తెలంగాణలో వర్షాలు కురిసే సూచనలున్నాయని తెలిపింది. మరోవైపు చలి తీవ్రత తగ్గడంతో రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయని, దాదాపు అన్ని జిల్లాల్లో 30 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదైయ్యాయని వెల్లడించింది. నెలాఖరుకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరే అవకాశాలుంటాయని పేర్కొన్నది.

పరిషత్ ఎన్నికలకు 'పది' పరీక్షల గండం!

- ఎన్నికలకు శరవేగంగా ఏర్పాట్లు
- షెడ్యూల్ విడుదలకు సన్నాహాలు
- మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు వార్షిక పరీక్షలు
- పరీక్షలా..? ఎన్నికలా..? ఎటూ తేల్చుకోలేకపోతున్న సర్కార్



హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తేతెలంగాణ): మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు పదో తరగతి వార్షిక పరీక్షలు అడ్డంకిగా మారనున్నాయా..? ఈ పరీక్షల షెడ్యూల్‌తో ఎన్నికలకు ఇబ్బందులు తప్పవా..? అంటే అవుననే సంకేతాలు వెలువడుతున్నాయి. అటు పరీక్షలుండటం.. వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచన నేపథ్యంలో ప్రభుత్వ వర్గాలు తర్జనభర్జనపడుతున్నట్టు సమాచారం. పరీక్షలా..? ఎన్నికలా..? అన్నది తేల్చుకోలేకపోతున్నట్టు తెలిసింది. పదో తరగతి వార్షిక పరీక్షల షెడ్యూల్ ఇప్పటికే విడుదలైంది. మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. మున్సిపల్ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు రంగం సిద్ధం చేస్తున్నది. ఎన్నికల సంఘం కూడా ఏర్పాట్లలో మునిగితేలినట్టు సమాచారం. షెడ్యూల్ విడుదలకు అధికారులు సన్నాహకాలు చేస్తున్నారు. ఈవీఎంలను సమకూర్చాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని అధికారులు అభ్యర్థించారు కూడా.

అంతా వ్యతిరేకించినా..

ఎప్పుడు లేని విధంగా ఈ ఏడాది పది పరీక్షలు నెల రోజులపాటు జరుగనున్నాయి. గతంలో 10రోజుల్లోపే ముగియగా, ఈ సారి ఏకంగా మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు నిర్వహించేలా అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. సీబీఎస్ఈలో ఒక్కో పరీక్షకు మధ్య మూడు, నాలుగు రోజుల వ్యవధి ఉండటంతో దాన్ని ప్రామాణికంగా తీసుకుని షెడ్యూల్ విడుదల చేశారు. ఇప్పుడిదే షెడ్యూల్‌తో ఇబ్బందులొచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ షెడ్యూల్ అశాస్త్రీయంగా ఉందని ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం వ్యక్తంచేశాయి. టీచర్ ఎమ్మెల్సీలు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, మల్క కొమురయ్య సైతం షెడ్యూల్ మార్చాలని కోరారు. విద్యార్థి సంఘాలు సైతం అసంబద్ధంగా ఉన్న ఈ పరీక్షల షెడ్యూల్ మార్చాలని డిమాండ్ చేశాయి. ఒక పేపర్‌కు మరో పేపర్‌కు మధ్య నాలుగు, ఐదు రోజులు వ్యవధి ఇవ్వడంతో అనేక నష్టాలు వస్తాయని సర్కార్ దృష్టికి తీసుకెళ్లాయి. కానీ ఇందుకు సర్కార్ ససేమీరా అన్నది.

ఏదీ... వాయిదా..?

మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను వీలైనంత త్వరగా నిర్వహించాలన్న ఆలోచనలో సర్కార్ ఉన్నది. ఎన్నికలకు వెళితే మొత్తం ప్రక్రియ ముగిసేందుకు 15 రోజులు పట్టే అవకాశాలున్నాయి. ఇంటర్ వార్షిక పరీక్షలు ఈ నెల 25 నుంచి మార్చి 17 వరకు జరుగనున్నాయి. ఈ పరీక్షలకు పట్టుమని పది రోజులు కూడా లేవు. ఇప్పటికే విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమయ్యారు. ఎన్నికల కోసం ఈ పరీక్షలను వాయిదావేసే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. మార్చి, ఏప్రిల్‌లో ఎన్నికలు నిర్వహించడం రెండో ఆప్షన్‌గా కనిపిస్తున్నది. ఈ రెండు నెలల్లోనే పదో తరగతి పరీక్షలున్నాయి. పరీక్షలే ముఖ్యమనుకుంటే ఈ రెండు మాసాల్లో ఎన్నికల నిర్వహణ సాధ్యమయ్యే అవకాశం లేదు. అదే ఎన్నికలే ముఖ్యమనుకుంటే పదో తరగతి పరీక్షలను వాయిదా వేయడం, లేదంటే వారం, పది రోజుల్లోనే ముగించేలా కొత్త షెడ్యూల్ రూపొందించాల్సిన ఆప్షన్ తప్ప మరొకటి కనిపించడంలేదు. నెల రోజులున్న పరీక్షలను పది రోజులకు కుదించి.. వెంట వెంటనే పరీక్షలను నిర్వహిస్తేనే ఏప్రిల్‌లో ఎన్నికలకు వెళ్లే అవకాశం ఏర్పడుతుంది. ఇక పాత షెడ్యూల్ ప్రకారమే పది పరీక్షలు నిర్వహించాలనుకుంటే ఏప్రిల్ మూడో వారం తర్వాతే ఎన్నికలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది. దీంతో ఎన్నికలను వాయిదా వేయాలా.. లేక పరీక్షలను వాయిదా వేయాలా అన్న మీమాంస నెలకొన్నది. ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ పీవీ శ్రీహరి 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలైతే, ఆయా షెడ్యూల్‌ను బట్టి సర్కార్‌తో సంప్రదించి పరీక్షల షెడ్యూల్‌పై ఓ నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, సోమవారం 16 ఫిబ్రవరి 2026 | HYDERABAD



గ్రేటర్ @ 32.7డిగ్రీలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): ఆగ్నేయం నుంచి వీస్తున్న గాలుల ప్రభావంతో గ్రేటర్ వాతావరణం క్రమంగా వేడెక్కుతున్నది. దీంతో నగరంలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి దాటి నమోదవుతున్నాయి. ఈ క్రమంలోనే ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 32.7డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 18.1డిగ్రీలు, గాలిలో తేమ 33శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

నాలాపై స్లాబ్ నిర్మాణం

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 15: అసంపూర్తిగా వదిలేసిన నాలా నిర్మాణ పనులను అధికారులు యుద్ధప్రాతిపదికన చేపట్టారు. శనివారం తండ్రితో కలిసి బైక్‌పై పాఠశాలకు వెళ్తున్న ఎనిమిదేండ్ల చిన్నారి కృష్ణానగర్ బీ బ్లాక్‌లో ఓ టిఫిన్ సెంటర్ ఎదురుగా నాలాలో పడిపోవడంతో స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయమై ఆదివారం నమస్తే తెలంగాణ దిన పత్రికలో 'అసంపూర్తిగా నాలా నిర్మాణం' శీర్షికన వచ్చిన వార్తకు హెచ్‌ఎంఎస్‌బీ అధికారులు స్పందించారు. జలమండలి డివిజన్-6 జీఎం ప్రభాకర్‌రావు ఆదేశాలతో ఎల్లారెడ్డిగూడ సెక్షన్ మేనేజర్ శ్యామ్, సిబ్బందితో కలిసి సివరేజీ లైన్‌పై స్లాబ్ నిర్మించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.

నమస్తే ఎఫెక్ట్






బంజారాలకు అండగా ఉంటాం
బీఆర్ఎస్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ జయంతి వేడుకలో హోమం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నాయకులు





పోటెత్తిన భక్తజనం
శివరాత్రిని పురస్కరించుకొని ఆదివారం కీసరగుట్టలోని శివాలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తారు. భక్తులతో క్యూలైన్లు కిక్కిరిసి పోయాయి. గుట్టపైన గల శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుట్ట పరిసర ప్రాంతాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి.

బీఆర్ఎస్‌కే జై



- గులాబీ పార్టీకి అండగా నిలిచిన శివారు ఓటర్లు
- అధికార పార్టీ కంటే ఎక్కువ ఓటింగ్ శాతం
- మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో కాంగ్రెస్ కంటే 5 శాతం ఎక్కువ ఓటర్ల మద్దతు
- కీలక మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ పాగా

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ శివారు మున్సిపాలిటీల్లోని ఓటర్లు బీఆర్ఎస్ పార్టీకి ఏకపక్షంగా మద్దతు తెలిపారు. నగర శివార్లలోని ప్రాంతాలన్నీ బీఆర్ఎస్ పార్టీకి కంచుకోట అని మరోసారి నిరూపించారు. రెండున్నరేండ్ల కాంగ్రెస్ అరాచక పాలనకు వ్యతిరేకంగా కదం తొక్కారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ చేసిన అభివృద్ధికి గీటురాయిలాగా మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో తమ వాణి వినిపించారు. అధికార కాంగ్రెస్ పార్టీ, బీజేపీ, ఎంఐఎంతో కుమ్మక్కై బరిలోకి దిగినా ఓటర్లు బీఆర్ఎస్‌కు ఏకపక్షంగా జై కొట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్ని కుయుక్తులకు పాల్పడినా వాటిని తమ అమూల్యమైన ఓటుతో తిప్పికొట్టారు. సాధారణ ఎన్నికలు, స్థానిక సంస్థల్లో గ్రేటర్ హైదరాబాద్ శివారుల్లోని ప్రాంతాలు బీఆర్ఎస్‌కు ఏవిధంగా మద్దతు తెలిపారో పురపాలక ఎన్నికల్లోనూ దాన్ని పునరావృతం చేశారు.

కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధిచెప్పిన శివారు..

మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో దాదాపు 90 శాతానికి పైగా మున్సిపాలిటీల్లో అధికార కాంగ్రెస్ కుంటే బీఆర్ఎస్ పార్టీకి ఎక్కువ ఓటింగ్ శాతం ...మిగతా IV లో

వెలుగులివ్వని గృహజ్యోతి

బల్దియా పరిధిలో అర్హులకు అందని పథకం

- 25 లక్షల రేషన్‌కార్డుదారులకు గాను లబ్ధి పొందుతున్నది 11లక్షల మందే
- కొత్తవారి నమోదుకు అవకాశమివ్వని సర్కార్
- రెండేళ్లుగా సగం మంది ఎదురుచూపులు
- ప్రభుత్వ తీరుపై తీవ్ర అసహనం


▶ IV

గ్రేటర్ కలలు ఆవిరి

గ్రేటర్ హోదాను అనుభవించిన ప్రాంతాలను ముక్కలు చేసిన సర్కార్

ఒక్క రాత్రిలో సీన్ మారింది. నిన్నటి దాకా గ్రేటర్ పౌరులమని మురిసిపోయిన వేలాది మందికి ఇప్పుడు కొత్త కష్టాలు తప్పవనే చర్చ జరుగుతున్నది. ప్రభుత్వం పంపిన మూడు జీవోల తూటా.. శివారు ప్రాంతాల ప్రజల ఆశలపై నీళ్లు చల్లింది. జీహెచ్‌ఎంసీని మూడు ముక్కలు (జీహెచ్‌ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి) చేస్తూ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు నగరవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ముఖ్యంగా గ్రేటర్ పరిధిలో ఉన్న ఐటీ, పరిశ్రమలు ఉన్న ప్రాంతాలను మళ్లీ చిన్న కార్పొరేషన్ వైపు మళ్లించడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతున్నది. ఈ విభజన వెనుక కేవలం పరిపాలన సౌలభ్యం మాత్రమే కాకుండా, బలమైన రాజకీయ కోణం ఉందన్న వాదనలూ వినిపిస్తున్నాయి. రాబోయే ఎన్నికల్లో పట్టు సాధించేందుకే వార్డులను అనుకూలంగా మలుచుకున్నారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి.

- సిటీ బ్యూరో, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ):



- జీహెచ్‌ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లుగా విభజన
- పరిపాలనా సౌలభ్యం కోసమే విభజన చేశామంటూ కవరింగ్
- ప్రభుత్వ తీరుపై నగరవాసుల మండిపాటు
- ప్రభుత్వ నిర్ణయంతో అభివృద్ధికి ఆటంకం కలగడం ఖాయంటున్న నిపుణులు

పల్లె నుంచి పట్టణం.. పట్టణం నుంచి మహా నగరం.. ఇది కదా ఏ ప్రాంతమైనా ఆశించే అభివృద్ధి ప్రస్థానం!! కానీ మహానగర పాలనలో పాలన సాగుతున్న తీరు చూస్తుంటే అభివృద్ధి చక్రం వెనక్కి తిరుగుతోందా? అనే సందేహం వ్యక్తమవుతున్నది. నిన్నటి దాకా విశ్వనగరంలో అంతర్భాగంగా ఉండి.. గ్రేటర్ హోదాను అనుభవించిన ప్రాంతాలను మూడు ముక్కలు చేస్తూ తిరిగి చిన్న కార్పొరేషన్ స్థాయికి దిగజార్చడంసర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పరిపాలనా సౌలభ్యం అనే సాకుతో గ్రేటర్ పరిధిలోని ఎల్బీనగర్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి, ఉప్పల్ లాంటి ప్రాంతాలను విడదీసి వాటిని చిన్న కార్పొరేషన్ హోదాలోకి నెట్టడంపై విమర్శలు వస్తున్నాయి. ఎదిగిన బిడ్డను మళ్లీ చిన్నపిల్లాడిని చేసినట్లుగా గ్రేటర్ నుంచి విడగొట్టి సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్‌లోకి తీసుకురావడం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. జీహెచ్‌ఎంసీలో ఉన్నప్పుడు లభించే మౌలిక సదుపాయాలు, రవాణా అనుసంధానం, అత్యున్నత స్థాయి పాలన..చిన్న కార్పొరేషన్లతో సాధ్యమా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

మళ్లీ డీలిమిటేషన్ ?

జీహెచ్‌ఎంసీలో 27 పురపాలిక విలీనంతో 150 డివిజన్లను 300 డివిజన్లు చేశారు. ఈ క్రమంలో జనాభా ప్రాతిపదికను సరిగ్గా పట్టించుకోలేదు. డివిజన్లను లోపభూయిష్టంగా కేటాయించారు. ఉదాహరణకు 90 వేల జనాభా ఉన్న నాగారం మున్సిపాలిటీని ఒకే డివిజన్‌గా, 48 వేల జనాభా ఉన్న తూముకుంటను కూడా ఒకే డివిజన్‌గా పరిగణించడంపై అప్పట్లో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.అయితే పాలనా సౌలభ్యం కోసం చేపట్టిన డివిజన్ల పునర్విభజనపై ప్రభుత్వం పునరాలోచనలో పడింది. ముఖ్యంగా కొత్తగా ఏర్పడిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ), మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలో డివిజన్ల కేటాయింపుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతుండటంతో మరోసారి డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టేందుకు సిద్ధమవుతుండటం సర్కార్ పాలన పనితీరును ప్రశ్నిస్తున్నది. కొత్తగా ఏర్పడిన ఒక్కో కార్పొరేషన్‌లో 100 డివిజన్లకు పెంచే యోచనలో సర్కార్‌ఉన్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

రామంతాపూర్ హోమియో వైద్య కళాశాలలో దోపిడీ

ఫీజులు ఫుల్.. సౌకర్యాలు నిల్



- అల్లోపతి కంటే రెట్టింపు స్థాయిలో ఫీజులు వసూళ్లు
- ప్రభుత్వ అనుమతి లేకుండానే ఇష్టారాజ్యంగా పెంపుదల
- అవకతవకలపై దర్యాప్తు చేయాలని విద్యార్థుల డిమాండ్

"రామంతాపూర్ జేఎస్‌పీఎస్ ప్రభుత్వ హోమియో వైద్య కళాశాలలో ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను నిలువు దోపిడీకి గురి చేస్తున్నారు. అల్లోపతి కంటే రెట్టింపు స్థాయిలో వసూలు చేస్తున్నారని విద్యార్థులు మండిపడుతున్నారు. పాలకుల అవినీతి, వైద్య, ఆరోగ్యశాఖ చేతగానితనం, ఆయుష్ ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో అందిన కాడికి దోచుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలను పేపర్ మీద చూపించి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీస సౌకర్యాలు కూడా కల్పించడంలో పూర్తిగా విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాశాలలో 128 యూజీ సీట్లు, 38 పీజీ సీట్లు ఉన్నాయి. యూజీ విద్యార్థులకు నాలుగున్నర సంవత్సరాలకు గాను రూ.29వేలు, పీజీ విద్యార్థులకు మూడు సంవత్సరాలకు గాను రూ.49,500 చొప్పున ఫీజులు వసూలు చేస్తున్నారు."

– సిటీబ్యూరో, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ):

రామంతాపూర్ జేఎస్‌పీఎస్ ప్రభుత్వ హోమియో వైద్య కళాశాలలో రెట్టింపు స్థాయిలో ఫీజులు వసూలు చేస్తున్నారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ అల్లోపతి పీజీ వైద్య విద్యార్థుల ఫీజు రూ.25వేలు మాత్రమే ఉండగా, రామంతాపూర్ జేఎస్‌పీఎస్ హోమియో వైద్యకళాశాలలో యూజీ విద్యార్థుల నుంచి రూ. 29వేలు, పీజీ విద్యార్థుల నుంచి రూ.49,300 చొప్పున ఫీజులు వసూలు చేస్తున్నారు. ఫీజులో కేవలం రూ. 2,800 మాత్రమే యూనివర్సిటీకి ముడుతుందని, మిగిలినదంతా ఎవరి జేబులోకి వెళ్తుందో చెప్పాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఫీజుల పట్టికలో పేర్కొన్న అంశాల్లో ఎన్ని సౌకర్యాలను అందిస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వ అనుమతి లేకుండా...

ప్రభుత్వ రంగ విద్యా సంస్థల్లో ఫీజులు పెంచాలంటే తప్పని సరిగా ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాలి. సంబంధిత శాఖ ద్వారా ఫీజులు ...మిగతా IV లో





ఓయూ ఉద్యమ నేతలపై జులుమ్

- ఇటీవల క్యాంపస్‌లో ఆందోళన చేసిన విద్యార్థినేతలపై కేసు నమోదు
- పీఎస్‌కు రావాలంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్న వైనం
- ఇకపై ఆందోళన చేయబోమంటూ అండర్‌టేకింగ్ రాసివ్వాలని హుకుం

▶ II

బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కు!

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో బయటపడిన స్నేహం

చెరో మున్సిపాలిటీ కైవసానికి కుట్ర ● ప్రజాతీర్పును అపహాస్యం చేస్తున్నారు: మల్లారెడ్డి

మేడ్చల్, ఫిబ్రవరి15 (నమస్తే తెలంగాణ): ప్రజాతీర్పును అపహాస్యం చేసేలా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుమ్ముక్కు అయ్యాయి. ఇన్నేళ్లుగా బయటి ప్రపంచానికి బద్ధ శత్రువులుగా చెప్పుకునే ఆపార్టీల స్నేహం ఒక్కసారిగా బట్టబయలైంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మెజార్టీ రాని మున్సిపాలిటీలలో చెరో మున్సిపాలిటీ కైవసానికి ఆ ఇరు పార్టీలు కుట్రలు చేస్తుండటమే ఇందుకు ఉదాహరణ. జిల్లాలోని మూడు మున్సిపాలిటీలలో జరిగిన ఎన్నికల్లో మూడుచింతలపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాగా ఎల్లంపేట మున్సిపాలిటీలో ఎక్స్ ఆఫీషియో ఓటుతో చైర్మన్ పీఠాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకునే అవకాశం ఉంది. అయితే ఇక్కడే కాంగ్రెస్, బీజేపీల ఫెవీకాల్ బంధం బయటపడింది. ఎల్లంపేట చైర్మన్ పీఠం బీఆర్ఎస్‌కు దక్కొద్దనే ఒకే ఒక్క లక్ష్యంతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటయ్యాయి. హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీలలో ఎవరికీ మద్దతు ఇవ్వబోమని ఓవైపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు స్పష్టం చేయగా.. మరోవైపు దానికి విరుద్ధంగా క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఉండటంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ...మిగతా IV లో



మెజార్టీపరంగా చూస్తే..

మూడుచింతలపల్లి మున్సిపాలిటీలో 24 వార్డులు ఉండగా బీఆర్ఎస్ పార్టీ 14 వార్డులు గెలుపొంది స్పష్టమైన మెజారిటీ సాధించంగా.. ఎల్లంపేట్ మున్సిపాలిటీలో 24 వార్డులు ఉండగా 12 వార్డులు బీఆర్ఎస్ గెలుపొందగా కాంగ్రెస్ 8, బీజేపీ 4 వార్డులు గెలుపొందాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఎక్స్ ఆఫీషియో సభ్యుడిగా ఎల్లంపేట్ మున్సిపాలిటీలో పేరు నమోదు చేసుకున్నారు. దీంతో బీఆర్ఎస్ బలం 13(మేజిక్ ఫిగర్)కు చేరింది.

బీజేపీ, కాంగ్రెస్‌ది ఫెవీకాల్ బంధం


బీజేపీ, కాంగ్రెస్ పార్టీలది ఫెవీకాల్ బంధం. నేడు జరగనున్న చైర్మన్ ఎన్నికలో అది బహిర్గతం అవుతుంది. బీఆర్ఎస్ పార్టీపై కుట్రలు చేసేందుకు ఆ రెండు పార్టీలు ఒక్కటవుతున్నాయి. ప్రజలు ఇచ్చిన తీర్పును అపహాస్యం చేసేలా ఆ పార్టీల తీరు ఉంది. ఎల్లంపేట్ మున్సిపాలిటీలో హంగ్ ఏర్పడగా నా ఎక్స్ ఆఫీషియో ఓటుతో బీఆర్ఎస్‌కు పూర్తి మెజారిటీ ఉన్నప్పటికీ.. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు కుట్రలు చేస్తున్నారు. పదవుల కోసం ఆ రెండు పార్టీలు ఎంత నీచానికైనా దిగజారుతుండటాన్ని చూసి ప్రజలు ఛీదరించుకుంటున్నారు. – చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యే, మేడ్చల్



దారుణ హత్యలతో బెంబేలు..!

- వరుస ఘటనలతో భయం భయం..
- నగరవాసుల్లో అనుక్షణం కలవరం..
- రెండేళ్లుగా పెరిగిన రౌడీషీటర్ల ఆగడాలు..
- సిటీలో కొరవడిన పోలీసు నిఘా ..

సిటీబ్యూరో, ఫిబ్రవరి 10(నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కొన్నిరోజులుగా వరుసహత్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్‌సిటీ కమిషనరేట్ల పరిధిలో రోజురోజుకూ రౌడీషీటర్లు, పాతనేరస్తులు, ఆకతాయిల ఆగడాలు పెరిగిపోయాయి. పోకిరీలు, అల్లరిమూకలు ముఠాలుగా ఏర్పడి రాత్రి, పగలూ తేడా లేకుండా అకారణంగా దాడులకు పాల్పడడం, ప్రత్యర్థులతో కొట్లాటలు, గొడవలు, హత్యాయత్నాలు, హత్యలు చేయడం పరిపాటిగా మారింది. మద్యం, గంజాయి మత్తులో తిరుగుతున్న ముఠాలు చిన్నచిన్న విషయాలకే మూకుమ్మడి దాడులకు పాల్పడుతున్నాయి. యువకులు తమ ప్రాంతాల్లో ఆధిపత్యాన్ని ప్రదర్శించడం కోసం ఇతరుల రక్తం కళ్లచూస్తూ చిన్న చిన్న కారణాలకే కత్తులతో కిరాతకంగా చంపుతున్నారు. తనను చూసి మిగిలినవారు భయపడాలనే ఉద్దేశంతో , తానొక రౌడీని అనిపించుకోవడమే లక్ష్యంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్ప డుతున్నారని చాలామందిని విచారణ చేసే క్రమంలో వారి ప్రవర్తనాతీరు విచిత్రంగా ఉంటున్నదని పోలీసులు చెప్తున్నారు. పోలీసులంటే భయం లేకుండా, కోర్టులు, శిక్షలు అంటే లెక్కలేనితనంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అయితే పాతక క్షలు, ప్రాంతాల మీద ఆధిపత్యం కోసం జరిగే పలు హత్యలను అడ్డుకునేదిశగా తమకున్న నెట్‌వర్క్ ద్వారా అవకాశమున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పోలీసులు నిందితులతో మిలాఖత్ కారణంగా నేరాలు పెరిగిపోతున్నాయని ఓ సీనియర్ పోలీస్ అధికారే చెప్పారు. తమ విస్తృత నిఘాతో ఇలాంటివి జరగకుండా చూడాల్సిన పోలీసులు ఆ దిశగా చురుకుగా వ్యవహరించకపోవడంతో నగరంలో నేరాలు పెరుగుతున్నాయని ఆ అధికారి తెలిపారు.



పోలీసు నిఘా కరువు..!

గత రెండేళ్లుగా ఏయేటికాయేడు నేరాలు పెరుగుతున్నాయి. అయితే పోలీసు కమిషనర్లు తమ సంవత్సరాంతం ప్రెస్‌మీట్లలో నేరాలు తగ్గాయని చెబుతూ అందుకు తగినట్లుగా గణాంకాలు చూపిస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం నేరాల సంఖ్య తగ్గడం లేదు. రోజుకు రెండుమూడుచోట్ల మర్డర్లు, దోపిడీలు, దాడులతో నగరం ఉలిక్కిపడుతోంది. హైదరాబాద్ నగరంలో తెలంగాణ వచ్చిన తర్వాత గతంలో ఎన్నడూ లేనంతగా ఈ రెండేళ్లలో రౌడీషీటర్ల ఆగడాలు పెరిగాయి. సెటిల్‌మెంట్లతో పాటు ఆధిపత్యం కోసం గ్యాంగ్‌వార్‌లకు దిగి ప్రత్యర్థులను హతమారుస్తున్నారు. కాలాపత్తర్, ఆసిఫ్‌నగర్ , టోలీచౌకి, తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున రౌడీషీటర్ల ఆగడాలు మితిమీరిపోతున్నా యి. రౌడీషీటర్ల ఆగడాలు పెరగడానికి నిఘా వైఫల్యమే కారణమనే చర్చ జరుగుతోంది. హత్య లు, హత్యాచారాలు వంటి తీవ్రమైన నేరాలు చేసి జైలుకెళ్లి బయటకు వచ్చిన పాతనేరస్తులపై పోలీసులు నిఘా పెట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వారు జైలు నుంచి ఎప్పుడు బయటకు వస్తున్నారు.. మళ్లీ నేరాల బాటపడుతున్నారా.. అసలు ఏం పనిచేస్తున్నారు.. ఇలా అనేక విసయాలను పోలీసులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. ఘరానా నేరస్తులు, రౌడీషీటర్లు, దోపిడీదొంగలు, కబ్జాదారుల కదలికలపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. కానీ క్షేత్రస్థాయిలో అలా జరగడం లేదు. పాత నేరస్థులపై పోలీస్ నిఘా లేకపోవడం వల్ల జైలు నుంచి బయటకు వచ్చిన నేరస్తులు మరింతగా రెచ్చిపోయి ముఠాలుగా ఏర్పడి మరింత అరాచకాలు సృష్టిస్తున్నారు. దారుణ హత్యలకు, నేరాలకు పాల్పడుతున్న వారిలో ఎక్కువగా పరిచయస్తులే ఉంటున్నారని పోలీసులు చెబుతున్నారు. రక్తసంబంధీకులు, స్నేహితులు, తెలిసినవారే దారుణాలకు ఒడిగడుతున్నారు. అనైతిక సంబంధానికి అడ్డు వస్తున్నారనో, డబ్బుల పంపకాలు, ఆస్తి పంపకాల్లో తేడాలు.. ఇలా చెప్పుకుంటూపోతే అనేక ఘటనల్లో తెలిసినవారే హంతకులు, నేరస్తులుగా తేలుతున్నారు. డబ్బులు, ఆస్తి, మద్యం, మగువ అనేవి ప్రధాన కారణాలుగా ఉంటున్నాయని ఆయా కేసుల్లో పో లీసులు విచారించే సమయంలో పలు కారణాలు వెలుగుచూస్తున్నాయని పోలీసులు చెప్పారు.

కొన్ని సంఘటనలివే..

- మొయినాబాద్ సమీపంలోని కేతిరెడ్డిపల్లిలో ఈనెల 4న మహిళా న్యాయవాది స్వప్నను పథకం ప్రకారం హత్యచేశారు. భూవివాదం నేపథ్యంలో సర్వే కోసం వెళ్లిన స్వప్నను కారుతో ఢీకొట్టి తర్వాత రాళ్లు , కర్రలతో దాడి చేశారు. ఆ తర్వాత కత్తితో గొంతు కోసి హత్యచేసి నిందితులు పారిపోయారు.
- రంగారెడ్డి జిల్లా అత్తాపూర్‌లో న్యాయవాది షరీఫ్‌ను ఈనెల 14న ఆయన బావమరుదులే హత్యచేసి పరారయ్యారు. సులేమాన్‌నగర్‌లోని తన ఆఫీసులో ఉన్న ఖదీర్‌పై కత్తులతో దాడిచేసి పలుమార్లు పొడవడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.
- జగద్గిరిగుట్టలో నడిరోడ్డుపై పట్టపగలు ఓ రౌడీషీటర్ తన స్నేహితులతో కలిసి మరో రౌడీషీటర్‌ను కత్తులతో చంపిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించింది. ఒకప్పుడు ప్రాణ స్నేహితులు గా ఉన్న ఆ ఇద్దరు ఓ మహిళ విషయంలో మనస్పర్థలు రావడంతో రెండు వర్గాలుగా విడిపోయారు.
- ఇటీవల నగరంలోని ఓ ప్రాంతంలో అర్ధరాత్రి సమయంలో కారులో 45ఏళ్ల వ్యక్తికి లిఫ్ట్ ఇచ్చిన 20ఏళ్లలోపు యువకులు.. టిఫిన్ చేస్తున్న క్రమం లో మీద చట్నీ పడేశారన్న కోపంతో ఆ వ్యక్తిని కారులో ఎక్కించుకుని రాత్రంతా నగరంలో తిప్పుతూ పిడిగుద్దులతో అతనిపై దాడికి పాల్పడ్డారు. అనంతరం నిర్మానుష్య ప్రాంతంలో కత్తితో పొడిచి చంపేశారు.
- లాలాగూడకు చెందిన ఓ వ్యక్తి గుడెన్ మెంట్ ఫుట్ఓవర్ బ్రిడ్జి వద్ద తన స్నేహితుడితో కలిసి మద్యం సేవించి అక్కడే పడుకుని ఫోన్‌లో మాట్లాడుతుండగా.. ఓ పాతనేరస్తుడు అక్కడికి వచ్చి తాను ఇక్కడే కూర్చుంటానని కాస్త చోటివ్వమని అడిగారు. అతను జరగకపోవడంతో అతని కాళ్ల వద్ద కూర్చునే ప్రయత్నం చేయగా అజయ్‌ను గఫూర్ కాలితో తన్నాడు. దీంతో ఇద్దరి మధ్య వా గ్వాదం జరిగి కత్తిపోట్లకు దారితీయగా గఫూర్ అక్కడికక్కడే మృతిచెందాడు.

ఖతార్‌లో ఫోరెన్సిక్ డాక్టర్ ఉద్యోగమంటూ...

రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగికి రూ. 20 లక్షలు టోకరా

సిటీబ్యూరో, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): విదేశాల్లో ఫోరెన్సిక్ డాక్టర్‌గా ఉద్యోగం ఇప్పిస్తామంటూ నమ్మించి 72 ఏండ్ల ఓ రిటైర్డు ప్రభుత్వ వైద్యుడికి సైబర్‌నేరగాళ్లు రూ. 20 లక్షలు టోకరా వేశారు. వివరాల్లోకి వెళ్తే.. కుషాయిగూడకు చెందిన బాధితుడి వాట్సాప్‌కు ఖతార్‌లో ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగంలో ఉద్యోగాలున్నాయంటూ మెసేజ్ వచ్చింది. దాన్ని చూసిన బాధితుడు తాను కూడా ఫోరెన్సిక్‌లో పనిచేశానని, తాను ఉద్యోగం చేసేందుకు సిద్ధంగా ఉన్నానంటూ మెసేజ్ ఇచ్చి.. బయోడేటాను పంపించాడు. మీ బయోడేటాను లైసెన్సింగ్ డిపార్టుమెంట్ అసిస్‌మెంట్ చేసేందుకు పంపిస్తున్నామని, ఆ తరువాత మీకు ఈ మెయిల్ ద్వారా సమాచారం పంపిస్తామంటూ నమ్మించా రు. కొన్ని రోజుల విరామం తరువాత మీరు స్పెషలిస్ట్ ఫోరెన్సిక్ మెడిసిన్ పోస్టుకు ఎంపికయ్యారని, అకామిడేషన్, ట్రాన్స్‌ఫోర్టు, వారానికి ఐదు రోజుల పని చేయడానికి నెలకు మీకు 65000 క్యూఏఆర్‌లు జీతంగా వస్తుందని సూచించారు. మీకు ముంబైలో ఇంటర్వ్యూ ఉంటుందని ముందుగా సూచించి, ఆ తరువాత ఆన్‌లైన్‌లో లక్ష్మి అనే పేరుతో ఒక మహిళ ఇంటర్వ్యూ చేసింది. దీంతో బాధితుడు మీ సంస్థలో పనిచేసే డాక్టర్ల వివరాలు కావాలంటూ కోరగా అలా ఇవ్వడం కుదరదని, మీకు కావాలంటే ఇంటర్నల్ మెడిసిన్ స్పెషలిస్ట్ మస్క్ పెరువ్వానందన్‌కు సంబంధించిన ఈ మెయిల్ ఐడీ ఇస్తామంటూ ఆ ఐడీని పంపించారు. బాధితుడు ఖతారులో ఈ సంస్థ గురించి ఈ మెయిల్ ద్వారా ఆరా తీయగా, అక్కడ ఈ సంస్థకు మంచి పేరుందంటూ నమ్మిస్తూ మస్క్ పెరువ్వానందన్ పేరుతో ఈ మెయిల్ రిప్లే వచ్చింది. దీంతో బాధితుడికి ఈ ఉద్యోగంపై నమ్మకం కుదిరింది. ఈ క్రమంలో బాధితుడికి సంబంధించిన డాక్యుమెంట్లు అన్ని మరోసారి పంపించి, లైసెన్స్ ప్రాసెసింగ్ కోసం రూ.20 వేల ఖతారులు పంపించాలంటూ సూచించారు. ఆ తరువా త మరో లైసెన్స్ ఫీజు అంటూ మరికొంత డబ్బు వసూలు చేశారు. ఇలా దఫ దఫాలుగా రూ. 20.06 లక్షలు వసూలు చేశారు. మరింత డబ్బు కావాలంటూ ఒత్తిడి తెస్తూ, మీరు ఫీజు చెల్లించడంలో ఆలస్యమైతే ఫెనాల్టీలు పడుతాయని బెదిరింపులకు దిగారు. దీంతో బాధితుడికి ఈ వ్యవహా రంపై అనుమానం వచ్చి ఇదంతా మోసమ ని గుర్తించి, మల్కాజిగిరి సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ప్రియురాలి నగ్న వీడియోలతో బ్లాక్ మెయిల్.. కేసు నమోదు

వెంగళరావునగర్,ఫిబ్రవరి 15: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువతిని ప్రేమ పేరుతో లోబర్చుకున్నాడు... ప్రియురాలితో సన్నిహితంగా ఉన్నప్పుడు ఆమె నగ్న ఫొటోలు, వీడియోలు తీసుకున్నాడు...పెండ్లిమాట ఎత్తేసరికి ఆ ఫొటోలతో బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డాడు. ఈ ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధి లో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం..పంజాగుట్టలోని ఓ లేడీస్ హాస్టల్‌లో ఉండే ఏపీ నంద్యాల జిల్లాకు చెందిన ఓ ప్రైవేట్ బ్యాంక్ ఉద్యోగిని(24)కు గతేడాది ఇన్‌స్టాగ్రామ్‌లో వరుణ్ నాగేంద్ర అనే యువకుడు పరిచయమయ్యాడు. ఆ పరిచయంతో ప్రేమించానని చెప్పి..నిన్నే పెండ్లి చేసుకుంటానని ఆమె ను నమ్మించాడు. ఎస్.ఆర్.నగర్‌లోని రూమ్‌కు ప్రియురాలిని తీసుకెళ్లి పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. న్యూడ్ వీడియోలు, ఫొటోలను ఫోన్‌లో తీసుకున్నాడు. ఆమె గర్భం దాల్చగా గర్భ నిరోధక ట్యాబ్లెట్లు మింగించాడు.దాంతో ఆ యువతికి తీవ్ర రక్తస్రావం కావడంతో ఓ దవాఖానలో చేర్పించి చికిత్స చేయించాడు. అనంతరం లైంగిక సంబంధాన్ని కొనసాగించకపోతే ఆ ఫొటోలు,వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పెడుతానని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డాడు. దీంతో బాధిత యువతి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

‘మేం ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వండి’

స్వతంత్ర అభ్యర్థి కుబుంబ సభ్యుడి వీడియో వైరల్

ఎల్లంపేట మున్సిపాలిటీలో ఘటన

మేడ్చల్, ఫిబ్రవరి 15 : ఎన్నికల్లో గెలవడానికి అభ్యర్థులు ఇంటింటికి తిరిగి తాయిలాలు, నగదు పంచిపెట్టడం.. ఓటమిని చవిచూస్తే తిరిగి వసూలు చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. నిన్న మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పోతారంలో ఘటన జరుగగా శనివారం ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలో అలాంటి ఘటన మరొకటి జరిగింది. మున్సిపాలిటీ పరిధిలోని 19 వార్డు నుంచి పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థిని 114 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. గెలుస్తానని నమ్మకంతో ఉన్న అభ్యర్థి మూడో స్థానంలో నిలవడంతో ఓటర్లు తమకు ఓటు వేయకుండా ఓడించారని భావించారు. దీంతో శనివారం తాము ఇచ్చిన డబ్బులు తిరిగి వసూలు చేసుకోవాలని ప్రయత్నాలు ప్రారంభించారు. అందులో భాగంగా అభ్యర్థి కుటుంబ సభ్యుడు ఓ ఇంటికి వెళ్లి తాను ఇచ్చిన డబ్బులు తమకు తిరిగి ఇవ్వాలని కోరారు. ఇందుకు వారు ససేమిరా అన్నారు. తాము ఓట్లు వేయలేదని ఎవరూ చెప్పారని ఎదురు తిరిగారు. అలా అయితే ఏ గుడికి అయినా వచ్చి ప్రమాణం చేయాలని కోరారు. ఇందుకు వారు ససేమిరా అన్నారు. మీరు ఇచ్చిన డబ్బులు కోసం మేం గుడికి వచ్చి ప్రమాణం చేయాలా అంటూ మండిపడ్డారు. ఈ ఘటనను స్థానికులు గోప్యంగా తీసిన వీడియోను ఆ వార్డు వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేశారు. అది కాస్త క్షణాల్లో ఒకరి తర్వాత మరొకరు వేరే వేరే గ్రూపుల్లో పోస్టు చేయడంతో వార్డు దాటి మున్సిపాలిటీ వ్యాప్తంగా చక్కర్లు కొట్టి, వైరల్‌గా మారింది.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 415 మందిపై కేసులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 15(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ పోలీసులు రెండు రోజులపాటు చేపట్టిన స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 415 మందిపై కేసులు నమోదు చేశారు. కమిషనరేట్ పరిధిలో ఈనెల 13,14తేదీల్లో చేపట్టిన డ్రైవ్‌లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 415 మందిని అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు. ఇందులో 341 మంది ద్విచక్రవాహనదారులు , 27 మంది త్రీవీలర్స్, 47 మంది ఫోర్‌వీలర్స్ డ్రైవర్స్ , ఇతర వాహనదారులు ఉన్నారని పేర్కొన్నారు. వీరందరినీ కోర్టుకు హాజరుపరచనున్నట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 15: చదువుకోవడానికి గదిలోకి వెళ్లిన ఓ ఇంటర్మీడియట్ విద్యార్థిని ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుం ది. పోలీసుల వివరాల ప్రకారం...కొంపల్లిలోని సాయికృపా అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న ఎం.అశోక్‌బాబు,ప్రభావతి దంపతుల కుమార్తె ఎం.నాగలిఖితసాయి(17) జీడిమెట్ల విలేజ్ శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఆదివారం మధ్యాహ్నం సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసిన అనంతరం తాను చదువుకుంటానని చెప్పి తన గదిలోకి వెళ్లింది. కొంతసమయం తర్వాత చెల్లెలు గీతికసాయి గది తలుపు తట్టగా లోపలి నుండి ఎలాంటి స్పందన రాలేదు. అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ సహాయంతో గది తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా లిఖితసాయి తన చున్నీతో ఉరి వేసుకొని కనిపించింది. కుటుంబ సభ్యులు తక్షణమే 108 సహాయంతో స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయిందని అక్కడి వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తల్లి ప్రభావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో ఇంజినీరింగ్ విద్యార్థిని..

బంజారాహిల్స్,ఫిబ్రవరి 15: అనుమానాస్పద స్థితిలో ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే .. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం, నందిగామ గ్రామానికి చెందిన గుగులోతు సంధ్యారాణి(20) షేక్‌పేటలోని నారాయణమ్మ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ 3వ సంవత్సరం చదువుతూ స్థానికంగా ఉన్న మై హోమ్ గర్ల్స్ హాస్టల్‌లో ఉంటుంది. శనివారం ఉదయం 11గంటల ప్రాంతంలో సంధ్యారాణి ఆత్మహత్య చేసుకుందంటూ ఆమె తండ్రి రఘుకు హాస్టల్ నిర్వాహకురాలు నజ్వా తబస్సుమ్ ఫోన్ చేసి చెప్పింది. దాంతో హాస్టల్‌కు చేరుకుని చూడగా లిఫ్ట్‌వద్ద మృతదేహం కనిపించింది. బాత్‌రూమ్‌లో సంధ్యారాణి ఆత్మహత్య చేసుకుందని ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు లిఫ్ట్‌వద్దకు తీసుకువచ్చామని నిర్వాహకులు తెలిపారు. కాగా తమ కుమార్తె మృతిపై హాస్టల్ నిర్వాహకులు సరైన సమాచారం ఇవ్వడం లేదని, సీసీ కెమెరాలు పనిచేయడం లేదంటూ మృతురాలి తండ్రి రఘు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

కుక్కను తప్పించబోయి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 15: కుక్కను తప్పించబోయి ద్విచక్రవాహనం అదుపుతప్పి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందాడు. ఈ సంఘటన ఘట్‌కేసర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం విశ్వతేజ(27) బైక్‌పై భువనగిరి నుంచి నగరం వైపు వస్తున్నాడు. మార్గమధ్యలో కుక్క అడ్డురాగా .. దానిని తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి సర్వీస్ రోడ్డు గుంతలో పడింది. తలకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఉప్పల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు నిజామాబాద్‌కు చెందిన వాడని, గచ్చిబౌలిలో నివాసం ఉంటూ అక్కడే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని గాంధీ దవాఖానకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంటలు అంటుకుని వృద్ధురాలు..


ఘట్‌కేసర్, ఫిబ్రవరి 15: ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై ప్రభాకర్ రెడ్డి వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ పట్టణంలో నివాసం ఉంటున్న వృద్ధురాలు జోగు ఎల్లమ్మ(80) శనివారం రాత్రి ఇంట్లో దోమలను పోగొట్టేందుకు మంట పెట్టింది. ఆ మంటలు ప్రమాదవశాత్తు ఎల్లమ్మ చీరకు అంటుకుని శరీరం తీవ్రంగా కాలిపోయింది. గమనించిన స్థానికులు మంటలు ఆర్పి చికిత్స నిమిత్తం నగరంలోని గాంధీ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది. ఆమె కూతురు సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

హోటా విజేత ఆనంద్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో రాష్ట్ర హోంశాఖ ప్రధాన కార్యదర్శి సీవీ ఆనంద్ చాంపియన్‌గా నిలిచాడు. ఆదివారం జరిగిన పురుషుల 55 ఏండ్ల వయసు విభాగం సింగిల్స్ ఫైనల్లో ఆనంద్ 6-2, 6-3 తేడాతో నీలకంఠ్ దాంబ్రె(గోవా)పై అద్భుత విజయం సాధించాడు. వయసు పెరిగినా.. తనలో చేవ తగ్గలేదని నిరూపిస్తూ ఆనంద్ వరుస సెట్లలో ప్రత్యర్థిని చిత్తుచేశాడు. తొలి సెట్‌ను 6-2తో గెలిచిన ఆనంద్..అదే జోరు కొనసాగిస్తూ మలి సెట్‌ను 6-3తో ఖాతాలో వేసుకున్నాడు. దాదాపు నాలుగేండ్ల తర్వాత టెన్నిస్ టోర్నీలో తనకు ఇది టైటిల్ విజయమని ఆయన సంతోషం వ్యక్తం చేశాడు.

చిల్డ్రన్స్ హోం నుంచి బాలుడు అదృశ్యం



అక్షిత్ కుమార్ (ఫైల్)

మేడిపల్లి , ఫిబ్రవరి 15: చిల్డ్రన్స్ హోం నుంచి బాలుడు అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీ స్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. అమ్మఒడి చిల్డ్ర న్స్ హోం నుంచి గతంలో సైదాబాద్ ప్రభు త్వ బాలల గృహం నుంచి పారిపోయిన అక్షిత్‌కుమార్ (12)పై గతంలో మిస్సింగ్ కేసునమోదైంది.ఆ బాలున్ని మళ్లీ మేడిపల్లి అమ్మ ఒడి వలంటీర్ ఆర్గనైజేషన్ చిల్డ్రన్స్ హోంలో చేర్పించారు. ఈనెల 13 న ఆశ్రమం నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. వలంటీర్ అరుణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి నేతలపై ఉక్కుపాదం..!

- ఓయూ క్యాంపస్‌లో పోలీసు రాజ్యం
- ఇటీవల రాత్రంతా రోడ్డుపై విద్యార్థినుల ఆందోళన.. వారికి అండగా నిలిచిన విద్యార్థులపై కేసులు
- వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్న పోలీసులు
- ఇకపై ఆందోళన చేయబోమంటూ అండర్‌టేకింగ్ రాసిస్తే విముక్తి కలిగిస్తామని ప్రలోభ పెడుతూ హెచ్చరికలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యార్థి నేతలు



ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 15: ఉద్యమాల పురిటిగడ్డ ఉస్మానియా యూనివర్సిటీలో మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని ప్రజాపాలనలో విద్యార్థి నేతలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇటీవల సెంటెనరీ లేడీస్ హాస్టల్ సమస్యపై రాత్రంతా రోడ్డుపై ఆందోళన చేసిన విద్యార్థినులకు అండగా నిలిచిన విద్యార్థి నేతలపై పోలీసు లు కేసులు నమోదు చేశారు. ప్రజా పాలనలో క్యాంపస్‌లో పోలీసు రాజ్యం నడుస్తుందా అనే ప్రశ్నలు వినిపిస్తున్న వేళ.. దీనికి వంతపాడేలా ఓయూ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్‌వో) ఆందోళన చేస్తున్న విద్యార్థులపై ఫిర్యాదు చేయడం.. ఆ వెంటనే పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడం చకచకా జరిగిపోయాయి. ఇప్పటికే విద్యార్థి నాయకులను పరోక్షంగా భయపెట్టి ఎలాంటి ఆందోళన లు జరపకూడదని అనధికారికంగా హెచ్చరించినట్లు పుకార్లు శికారు చేస్తున్నాయి. తాజా ఘటనలో మొత్తం పది మంది విద్యార్థి నేతలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇటీవల రాత్రంతా రోడ్డుపైనే..

చరిత్రలో మునుపెన్నడూలేని రీతిలో లేడీస్ హాస్టల్ విద్యార్థినులు తమ సమస్యల పరిష్కారం కోసం గత మంగళవారం రాత్రంతా రోడ్డుపైనే బైఠాయించి నిరసన తెలిపారు. ఓయూ అధికారులు విద్యార్థినులతో చర్చించి, సమస్య తెలుసుకుంటే విద్యార్థినులు ఆందోళన విరమించే అవకాశం ఉండేది. కానీ రాత్రంతా ఆడపిల్లలు ఆందోళన చేస్తుంటే కేవలం వారితో చర్చించేందుకు స్టూడెంట్ ఎఫైర్స్ డీన్‌ను పంపించి, ఉన్నతాధికారులు చేతులు దులుపుకున్నారు. రాత్రి పదిన్నర గంటలకు అక్కడికి చేరుకున్న ఆయన అరగంట ఉండి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దాంతో ఆగ్రహించిన విద్యార్థినులు ఉదయం వరకు అక్కడే చలి, దోమలను సైతం లెక్కచేయకుండా రోడ్డుపైనే ఉండిపోయారు. వారికి మద్దతుగా వివిధ విద్యార్థి సంఘాల నాయకులు అండగా నిలిచారు. ఉదయం తొమ్మిది గంటల సమయంలో ఏసీపీ గ్యార జగన్ ఆధ్వర్యంలో పోలీసులు రంగప్రవేశం చేసి ఓవరాక్షన్ చేశారని విద్యార్థులు మండిపడ్డారు. ఏసీపీయే నేరుగా రంగంలోకి దిగి తన అధికార పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చూస్తూ ఊరుకోబోనని హెచ్చరిస్తూ, విద్యార్థి నేతలను బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. అదే రోజు ఉదయం పదిగంటలకు సీఎస్ఓ పోలీ సులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు ఆఘమేఘాలమీద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

ఫిర్యాదు, ఎఫ్ఐఆర్‌పై విస్మయం

ఓయూ సీఎస్‌వో చేసిన ఫిర్యాదు, పోలీసుల ఎఫ్ఐఆర్‌లపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోం ది. ఒకవైపు ఆందోళన చేసిన వారిని వదిలేసి, కేవ లం వారికి అండగా నిలిచినవారిపైనే సీఎస్‌వో ఫిర్యాదు చేయడం, దానికి అనుగుణంగానే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం.. ఎవరి ఆదేశాలకు అనుగుణంగా చేశారో అర్థం అవుతోందని విద్యార్థులు మండిపడుతున్నారు. అసలు ఆందోళనబాట పట్టిన విద్యార్థినుల గురించి ప్రస్తావించకుండా కేవలం వారికి మద్దతుగా నిలబడినందుకే తమపై కేసులు నమోదు చేశారని దుయ్యబడుతున్నారు. మొత్తం పది మంది పేర్లు ప్రస్తావించి, చివరి పేరుతో పాటు ఇతర విద్యార్థినులు అని మాత్రమే పేర్కొన్నారని విమర్శిస్తున్నారు. సదరు ఫిర్యాదుదారుతోపాటు కేసు నమోదు చేసిన అధికారులు ఎవరిమెప్పు కోసమే తాపత్రయపడుతున్నారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కేసు నుంచి తప్పించాలంటే..

కేసు నమోదైన విద్యార్థి నాయకులను పోలీసు ఉన్నతాధికారి ఒకరు తన దగ్గరకు పిలిపించుకుని హితోక్తులు చెబుతున్నట్లు విశ్వసనీయ వర్గాల స మాచారం. ఫోన్‌లు బయట పెట్టించి, క్యాబిన్‌కు రాగానే మూడు నెలలు ఎలాంటి కార్యక్రమాలు చేయకుండా ఉంటామని లిఖిత పూర్వక హామీ (అండర్‌టేకింగ్) ఇస్తే కేసు నుంచి తప్పిస్తానని ప్రలోభాలకు గురిచేస్తున్నట్లు తెలిసింది. అంటే యూనివర్సిటీలో ఎలాంటి కార్యక్రమాలు చేయకుండా ఉండేందుకు పోలీసు ఉన్నతాధికారులు శతవిధాలా ఎందుకు ప్రయత్ని స్తున్నారని విద్యార్థి నేతలు ప్రశ్నిస్తున్నారు. అసలు పోలీసులు ఉన్నతాధికారులు ప్రభుత్వం కోసం పని చేస్తున్నారా లేక వర్సిటీ ఉన్నతాధికారుల కోసం పనిచేస్తున్నారా అనే అనుమానాలు కలుగుతున్నాయని చెబుతున్నారు.

గతంలోనూ పలు వివాదాలు..

పోలీసుల వ్యవహార శైలిపై ఓయూలో ఇప్పటికే పలు వివాదాలు నెలకొన్నాయి. గతంలో నిరుద్యోగుల ఉద్యమం సమయంలో ల్యాండ్ స్కేప్‌లోకి ప్రవేశించి ఇష్టానుసారంగా వ్యవహరించిన అంశంలో రాష్ట్రవ్యాప్తంగా విమర్శలు వచ్చాయి. కార్యక్రమానికి కవరేజీ కోసం వచ్చిన మీడియా ప్రతినిధులమని చెబుతున్న వినకుండా అదుపులోకి తీసుకోవడంతో పాత్రికేయులు పోలీసులకు వ్యతిరేకంగా ఆందోళన బాట పట్టారు. నాన్‌బోర్డర్లు ఉండకూడదని, క్యాంపస్‌ను క్లోజ్‌డ్ క్యాంపస్‌గా మార్చాలని విలేకరుల సమావేశం పెట్టి మరీ చెప్పడం మరింత వివాదాస్పదమైంది. స్వయం ప్రతిపత్తి కలిగిన యూని వర్సిటీకి సంబంధించిన అంశాలను అధికారులు మాట్లాడి, ఏ నిర్ణయాన్నైనా వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదంతో జరగాలని, కానీ పోలీసుల జోక్యం ఏందని విద్యావేత్తలు, మేధావులు పెదవి విరిచారు.

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీలో ఉమ్మడి రాష్ట్రంలోనూ ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేదని విద్యార్థులు గుర్తు చేస్తున్నారు. ప్రజాపాలన, మార్పు అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభు త్వం ఓయూలో నిర్బంధం అమలు చేస్తోందని మండిపడుతున్నారు. భావప్రకటనా స్వేచ్ఛ సైతం కరుకు ఖాకీల పద ఘటనల మధ్య పడి నలిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్సిటీ, వి ద్యారంగ సమస్యలపై కచ్చితంగా ఎప్పుడూ పోరా టం చేస్తూనే ఉంటామని స్పష్టం చేస్తున్నారు. ఎవరు అధికారంలో ఉన్నా ఓయూ ఎప్పుడూ సమర్థవంతమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తుందని పేర్కొంటున్నారు. ప్రపంచంలో ఎక్కడ ఏం జరిగినా స్పందించే గుణం ఈ ఓయూ గడ్డకు ఉందని అన్నారు. నిర్బంధాలు, అక్రమ కేసులతో ఉద్యమాలను నిలువరించలేరని హెచ్చరిస్తున్నారు.

సేవాలాల్ మహరాజ్.. బోధనలు స్ఫూర్తిదాయకం



నందినగర్‌లో సేవాలాల్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ కార్పొరేటర్ భారతీనాయక్ తదితరులు

బంజారాహిల్స్,ఫిబ్రవరి 15: బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని ఆదివారం ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 14లోని నందినగర్ గ్రౌండ్స్‌లో సేవాలాల్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతి కార్యక్రమానికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ..సేవాలాల్ బోధనల సారాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుని జీవితంలో ముందుకు సాగాలన్నారు. సేవాలాల్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో ఉండి హక్కుల కోసం పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భారతీనాయక్, బంజారా నేతలు రాములు చౌహాన్, రాందాస్, బాబా నాయక్, భీమ్‌షా తదితరులు పాల్గొన్నారు.



సేవాలాల్ మహరాజ్ ఆలయం వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బంజారా నేతలు, భక్తులు

జూబ్లీహిల్స్ గురుబ్రహ్మనగర్ బస్తీలో సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. బస్తీ అధ్యక్షుడు గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకలలో ఫిలింనగర్ 18బస్తీల సంక్షేమసంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావుతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

కిస్మత్‌పూర్‌లో..

బండ్లగూడ: బంజారాల ఆరాధ్య దైవం అయిన సంత్‌సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా కిస్మత్‌పూర్ ఎర్రకుంటలో సేవాలాల్ దేవాలయంలో మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్,మాజీ ఉప సర్పంచ్ శేఖర్ ముదిరాజ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అన్నపురెడ్డి భీమార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 15: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాండు యాదవ్, గోపాల్‌నాయక్, సంతుగౌడ్, విజయ్, బాబు, లక్ష్మణ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



కిస్మత్‌పూర్ ఎర్రకుంట వద్ద సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి,మాజీ ఉప సర్పంచ్ శేఖర్ ముదిరాజ్



బాబుల్‌రెడ్డినగర్‌లో నిర్వహించిన సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మానవ వనరులు అందించడంలో ముందుంటాం

కాచిగూడ : మానవ వనరులు అందించడంలో భారత్ ముందు వరుసలో ఉందని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. వి.బాలకిష్టారెడ్డి అన్నారు. ఆదివారం బర్కత్‌పుర అవంతి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో మున్నూరుకాపు సంఘం మ్యాడం అంజయ్య హాల్‌లో హెచ్‌ఆర్ కాంక్లేవ్–2026 నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విద్యామండలి చైర్మన్ వి.బాలకిష్టారెడ్డి, అవంతి కళాశాలల వ్యవస్థాపకుడు ఎం.శ్రీనివాసరావు, ఐఐసీఏ డైరెక్టర్ వివేకనంద్ చల్లా, విప్రో డైరెక్టర్ నరేశ్ సీ పూరి, క్యాంపస్ రిలేషన్స్ అభిషేక్ దైజోడే, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సౌత్ హెడ్ రామ్‌కిశోర్, ఇన్ఫోసిస్ ప్రిన్సిపాల్ కల్యాణ్ సర్వేపల్లి విచ్చేశారు. కార్యక్రమంలో కళాశాలల అధ్యక్షురాలు ఎం.జ్ఞానేశ్వరి, జనరల్ సెక్రటరీ డా. ఎం.ప్రియాంక,ఎండీ శ్రవణ్ కుమార్, ఉపాధ్యక్షుడు నందీశ్, హెచ్‌ఆర్ డైరెక్టర్ డా.జయప్రద, ప్రిన్సిపాల్స్ డా. రా కేశ్, అప్పారావు, సెక్రటరీ సాయిరాం పాల్గొన్నారు.



శంషాబాద్ పట్టణంలోని శ్రీవెండికొండ సిద్దేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



బండ్లగూడ: ఆరెమైసమ్మ దేవాలయంలో క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులు

ఓం...శివోహం

–భక్తిశ్రద్ధలతో మహా శివరాత్రి వేడుకలు –భక్తులతో పోటెత్తిన శివాలయాలు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 15: ఓం నమశ్శివాయ.. శంభో శివశంకరా..అంటూ భక్తుల పారవశ్యంతో శివాలయాలు మార్మోగాయి. ఖైరతాబాద్,జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లోని శివాలయాల్లో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, ఏకరుద్రాభిషేకాలతో ఆధ్యాత్మిక వెల్లివిరిసింది.

- బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1లోని శివాలయంలో తెల్లవారు జాము నుంచే పెద్దసంఖ్యలో భక్తులు పోటెత్తారు. ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీ విజయశాంతి తదితరులు ఆలయాన్ని సందర్శించి అభిషేకాలు నిర్వహించారు.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ భ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకుని విశేష అభిషేకాలు చేశారు.

ఆలయ చైర్మన్ అర్జున్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

- ఫిలినగర్ దైవసన్నిధానం, జూబ్లీహిల్స్‌లోని సీతారామ స్వామి ఆలయం, శాలివాహననగర్‌లో శ్రీ కాశీవిశ్వనాథ స్వామి ఆలయంలో భక్తులు స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు.

• దేవాలయాలకు పోటెత్తిన భక్తులు

మణికొండ: మహాదేవ మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం రాజేంద్రనగర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న శైవక్షేత్రాలు భక్తుల శివనామస్మరణలతో మార్మోగాయి. గండిపేట మండలం పుప్పాలగూడలోని కాశీవిశ్వేశ్వరాలయం, మణికొండలోని శ్రీపార్వతీ రామలింగేశ్వరాలయం, గండిపేటలోని ముక్తేశ్వరాలయం,ఖానాపురం నియో పోలీస్‌లోని రాజన్నగుట్ట శివాలయాలల్లో ఘనంగా శివపార్వతుల కల్యాణమహోత్సవాలను నిర్వహించారు.

• మచిలేశ్వరాలయంలో పోటెత్తిన భక్తజనం

శివరాత్రి సందర్భంగా మంచిరేవుల గ్రామంలోని చారిత్రాత్మక వీరభద్రస్వామి(మచిలేశ్వర్) ఆలయానికి భక్తులు పోటెత్తారు.

• కాశీ విశ్వేశ్వరాలయంలోనూ....

పుప్పాలగూడలోని చారిత్రాత్మక కాశీ విశ్వేశ్వరాలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ఉపవాసదీక్షలను విరమించారు. ఖానాపూర్‌లోని రాజన్నగుట్టలోనూ భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక సౌకర్యాలను కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసులు పటిష్టమైన భద్రతా చర్యలను చేపట్టారు.



బంజారాహిల్స్: శ్రీనగర్‌కాలనీలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో పూజల్లో భక్తులు

• ఘనంగా మహాశివరాత్రి మహోత్సవాలు

మైలార్‌దేవ్‌పల్లి: అత్తాపూర్ సర్కిల్ పరిధిలో మహాశివరాత్రి మహోత్సవాలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే శివాలయాలకు చేరుకొని స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఉపవాస దీక్షలతో భక్తిపారవసంలో మునిగిపోయారు. దేవాలయాలకు భక్తుల తాకిడి అధికంగా ఉండడంతో నిర్వాహకులు భారీ ఏర్పాట్లు నిర్వహించి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూసుకున్నారు.

శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు

బండ్లగూడ: శివారాత్రి పండగను పురస్కరించుకుని శివాలయాలు అన్ని శివ భక్తులతో కిటకిటలాడాయి.శివరాత్రి పండగ రోజు ఉపవాస దీక్షలో శివుడిని దర్శిచుకునేందుకు ఉదయం నుంచే భక్తులు శివాలయాలలో బారులు తీరారు.ముందు జాగ్రత్తగానే ఆలయాల నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా క్యూలైన్లను ఏర్పాట్లు చేసి వారిని దైవ దర్శనం కోసం పంపించారు.

• వెల్లివిరిసిన శివరాత్రి శోభ

హిమాయత్‌నగర్: శివరాత్రి పర్వదినం సందర్భంగా నారాయణగూడలోని భూలక్ష్మి ఆలయం,సాయిబాబా ఆలయం,విఠల్‌వాడీలోని శివాలయం, హిమాయత్ నగర్‌లోని మూడుగుళ్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.ఆదివారం తెల్లవారు జాము నుంచే శివుని దర్శనం కోసం పెద్ద ఎత్తున భక్తులు బారులు తీరారు.ఉదయం నాలుగు గంటలకు రుద్రాభిషేకంతో ఆలయాల్లో పూజలు ప్రారంభమయ్యాయి. హర హర మహాదేవ శంభో శంకర. ... ఓం నమ: శివా య అంటూ శివ నామ స్మరణ లతో ఆలయాలు మార్మోగాయి. ఈ కార్యక్రమంలో భూలక్ష్మి ఆలయం కమిటీ అధ్యక్షుడు తోట శివకుమార్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

• ఘనంగా మహాశివరాత్రి పూజలు..

జూబ్లీహిల్స్: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఆలయాల్లో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్‌గూడ, కృష్ణానగర్, రహ్మత్‌నగర్, కార్మిక నగర్, బోరబండ, ఎర్రగడ్డ, రాజీవ్‌నగర్, వెంగళరావునగర్, ఏజీ కాలనీ, శ్రీనగర్ కాలనీల్లో భక్తిశ్రద్ధలతో పూజలలో పాల్గొన్నారు.



మణికొండ డివిజన్‌లో మహాశివరాత్రి సందర్భంగా మహదేవుడి అవతారంలో ..చిన్నారి ఇశాంక్

• కిటకిటలాడిన ఆలయాలు

శంషాబాద్ రూరల్: మహాశివరాత్రి సందర్భంగా శంషాబాద్ పట్టణంలోని శ్రీవెండికొండ సిద్ధేశ్వరస్వామి, కపుగడ్డలోని నాగలింగేశ్వరస్వామి, పెద్దగోల్కొండలోని భగీరథ శివాలయం, గొల్లపల్లిలోని శివాలయంతో పాటు వివిధ శివాలయాలలో ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శంషాబాద్ మండలంలోని మల్కారం, సుల్తాన్‌పల్లి, నర్కూడ,పెద్దషాపూర్, పెద్దతూప్ర గ్రామాలలోని శివాలయాలలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు



బంజారాహిల్స్ : రోడ్డు నంబర్ 1లోని శివాలయంలో నిర్వహించిన అభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



మణికొండ: మంచిరేవుల మచిలేశ్వరాలయానికి పోటెత్తిన భక్తజనం



స్వామి వారికి పూజలు చేస్తున్న భక్తులు



హిమాయత్‌నగర్: నారాయణగూడలోని భూలక్ష్మి ఆలయంలో..



బైరాగిగూడలోని శివాలయంలో శివ దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు



శివుడికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



మైలార్‌దేవ్‌పల్లి: రాంబాగ్ చిన్న అనంతగిరి శివాలయంలో..



ఖైరతాబాద్: మింట్ కాంపౌండ్‌లోని శ్రీ నాగలింగేశ్వరస్వామి దేవాలయంలో..



రాజేంద్రనగర్‌లోని శివాలయంలో..భక్తులు

ఆకట్టుకున్న శివరాత్రి క్రికెట్ టోర్నమెంట్

మంచిరేవుల గ్రామంలో ప్రతియోటా శివరాత్రి జాగరణ్ పేరిట ప్రత్యేక క్రికెట్ టోర్నమెంటను ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి యువతతో కలిసి క్రికెట్ మ్యాచ్‌లను జాగరణగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జీ పి.కార్తీక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నార్సింగి సర్కిల్ అధ్యక్షుడు కె.విష్ణువర్ధన్‌రెడ్డి, పార్టీ నాయకులు మల్లేష్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.– మణికొండ



రాజేంద్రనగర్‌లోని శివాలయంలో ఉపవాస దీక్షలో ఉన్న భక్తులకు పండ్లు పంపిణీ చేస్తున్న రాష్ట్ర విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ



పూజల్లో పాల్గొన్న భక్తులు



బోరబండ బస్ టెర్మినల్ సమీపంలో దేవదాయశాఖకు చెందిన శివాలయంలో..



జూబ్లీహిల్స్: మహాశివరాత్రి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే నవీన్ యాదవ్

మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం జీవితం ఆదర్శం

హిమాయత్‌నగర్,ఫిబ్రవరి 15: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం జీవితం ఆదర్శమని సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి,రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టీ.నరసింహ అన్నారు.ధర్మభిక్షం 104వ జయంతి సందర్భంగా ఆదివారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో ధర్మభిక్షం చిత్రపటానికి పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ధర్మభిక్షం విద్యార్థి దశ నుంచే క్రియా శీలక పాత్ర పోషించారని, మనిషిని మనిషిగా గుర్తించి, గౌరవించడంలో ఆదర్శప్రాయుడని వారు కొనియాడారు. సమ సమాజమే లక్ష్యంగా అణగారిన వర్గాల్లో చైతన్యం రగిలించిన అవిశ్రాంత పోరాట యోధుడు ధర్మభిక్షం అని అన్నారు.సూర్యాపేట కేంద్రంగా ఆనాడే హాస్టళ్లను తెరిచి అనేక మంది చదువుకునేందుకు అవకాశం కల్పించగా ఆయన శిష్యులే అన్ని రాజకీయ పార్టీల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్,నేతలు దామోదర్ రెడ్డి,బి.నాగభూషణం,కేవీఎల్,డి.జి.సాయిలు గౌడ్, దోర్నాల వేణు,సయ్యద్ వలి ఉల్లాఖాద్రి,రవి కిశోర్ తదితలు పాల్గొన్నారు.



హిమాయత్‌నగర్ మఖ్దూం భవన్‌లో ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పల్లా వెంకట్‌రెడ్డి

ఆక్రమణలకు చెక్‌పెట్టేందుకు చర్యలు

బంజారాహిల్స్.ఫిబ్రవరి 15: జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 9లోని సత్వ ఎన్‌క్లేవ్‌లో జీహెచ్‌ఎంసీ పార్కు స్థలం ఆక్రమణకు గురికాకుండా చూసేందుకు చర్యలు తీసుకోవాలంటూ స్థానికులు ఇచ్చిన ఫిర్యాదులతో రంగంలోకి దిగిన అధికారులు ప్రహరీ నిర్మాణం చేపట్టారు. సత్వ ఎన్‌క్లేవ్‌తో పాటు వెనకనున్న లహోటీ లే అవుట్‌ను కలుపుతూ సుమారు 2వేల గజాల విస్తీర్ణంలో జీహెచ్‌ఎంసీ పార్కు ఉంది. గతంలో సత్వ ఎన్‌క్లేవ్ వైపు ఉన్న పార్కు స్థలంతో పాటు పక్కనున్న కొంత రెవెన్యూ స్థలాన్ని బోగస్ పత్రాలతో ఆక్రమించిన మొవ్వా రవీంద్రనాథ్ అనే వ్యక్తి బ్లూషీట్లు వేయడంతో పాటు అధికారుల కన్నుగప్పి లోపల నిర్మాణాలు చేపట్టారు. ఈ వ్యవహారంపై కాలనీవాసులు సుదీర్ఘ పోరాటం చేసి మొవ్వా రవీంద్రనాథ్ చేసిన మోసాన్ని బయటపెట్టడంతో ఆయనతో పాటు కుటుంబ సభ్యులపై క్రిమినల్ కేసు నమోదైంది. అప్పటి షేక్‌పేట రెవెన్యూ అధికారుల చొరవతో ఆ స్థలంలో వెలిసిన ఆక్రమణలు తొలగిపోయాయి. కాగా లహోటీ లే అవుట్‌లోని పార్కు గేటు కూల్చేశారని, కొంతమంది ప్రైవేటు వ్యక్తులు పార్కుస్థలంలో నిర్మాణ సామగ్రిని వేసి పార్కును ధ్వంసం చేశారంటూ స్థానిక కాలనీవాసులు జీహెచ్‌ఎంసీతో పాటు హైడ్రాకు ఫిర్యాదులు చేశారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు పార్కును పరిశీలించారు. పార్కు ప్రహరీ గోడను నిర్మించాలని జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రూ.12లక్షల వ్యయంతో పార్కు చుట్టూ ప్రహరీ నిర్మాణపనులు చేపట్టారు. ఈ పార్కును కాపాడుకుంటామని, పార్కును ప్రైవేటు వ్యక్తులు పాడుచేయడంతో పాటు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా సుమారు 2వేల గజాల పార్కు స్థలంలో కొంత రెవెన్యూ స్థలం ఉందని రెవెన్యూ అధికారులు గతంలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డు సైతం ఏర్పాటు చేశారు. ఖరీదైన ప్రభుత్వ స్థలాన్ని ప్రజల అవసరాల కోసం వాడుకునే అవకాశం ఉందని, ఈ స్థలాన్ని ల్యాండ్ బ్యాంక్‌లో సైతం ఉందని అధికారులు తెలిపారు.



జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 9లోని సత్వ ఎన్‌క్లేవ్‌లో పార్కు స్థలం చుట్టూ జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ప్రహరీ నిర్మాణపనులు చేస్తున్న దృశ్యం

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్ట్

బండ్లగూడ,ఫిబ్రవరి 15 : ఇంట్లో ఎవరు లేనిది చూసి దొంగతనానికి పాల్పడిన ఇద్దరిని అత్తాపూర్ పోలీస్‌లు రిమాండ్‌కు తరలించారు.ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం సులేమాన్ నగర్ డైమాండ్ సిటీ కాలనీలో 346నెంబర్ గల ఫ్లాట్‌లో హజ్రబేగం తన భర్త కూతురుతో కలిసి వాచ్‌మెన్‌గా పని చేసుకుంటున్నారు.కాగా శుక్రవారం మధ్యాహ్నం సమయంలో హజ్రా బేగం భర్త అబ్దుల్ పనిమీద బయటకు వెళ్లగా , ఆమె కూతురును ఇంట్లో వదిలేసి పైన ఉన్న అంతస్తులోకి పని కోసం వెళ్లింది.ఆ ఇంటి పక్కనే పని చేస్తున్న మహ్మద్ జూనైద్,సయ్యాద్ నయాబ్ అలియాస్ రెహాన్ అనే యువకులు ఆమె ఇంట్లోకి వెళ్లి బీరువాను పగులగొట్టి అందులో ఉన్న అర తుల బంగారం,30తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు.హజ్రబేగం కిందికొచ్చి చూడగా బీరువాలోలో ఉండాల్సిన నగలు కనిపించలేదు. దీంతో ఆమె వెంటనే అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.కేసు నమోదు చేసుకున పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సీసీ కెమెరాల ఆధారంగా నిందుతులను పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.



దొంగతనానికి పాల్పడిన నిందితులు